


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఖమ్మం 10-08-2026సోమవారం | సంపుటి : 13 | సంచిక : 254 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on




# మానవాళికి ఆదివాసీల సంస్కృతి దిశా నిర్దేశం

బడ్జెట్‌లో రూ.18,745 కోట్లు

సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 9 (వుదయం) :** ఆదివాసీలు యుగాలుగా కాపాడుకుంటూ వస్తున్న జీవనవిధానం, ప్రకృతి ఆధారిత సంస్కృతి ఆధునిక మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా ఆదివాసీలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకృతితో ముడిపడిన ఆదివాసీల జీవనం ప్రకృతిని దైవంగా, అడవిని తమ కన్నతల్లిగా భావించే ఆచారం గిరిజనుల ప్రత్యేకత అని ముఖ్యమంత్రి కొనియాడారు. తరతరాలుగా తమ విశిష్ట సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న గిరిజనుల జ్ఞానం, పర్యావరణ స్పృహ సమాజానికి నిరంతరం స్ఫూర్తినిస్తాయని తెలిపారు. గిరిజనుల సుస్థిర జీవనశైలి, పరస్పర సహకార సామాజిక విధానం రాబోయే తరాలకు ఎంతో నేర్పుతాయని, ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడంలో గిరిజనాచారం కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని సీఎం స్పష్టం చేశారు. వారి సంక్షేమం, సమగ్ర వికాసం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, గిరిజనుల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని పునరుద్ఘాటించారు.



## ప్రకృతి పరిరక్షణలో గిరిజనుల బాట అనుసరణీయం
## ఆదివాసీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.18,745 కోట్లు: మంత్రి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్‌లో ఘనంగా 'ప్రపంచ గిరిజన దినోత్సవం' ప్రపంచ గిరిజన (ఆదివాసీ) దినోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 లో గల కొమరం భీమ్ ఆదివాసీ భవన్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధితోనే గిరిజనుల సమగ్ర వికాసం: మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గిరిజనులు తమ అడవులను, సంస్కృతిని కాపాడుకుంటూనే అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక నిధుల కేటాయింపు: 202627 ఆర్థిక సంవత్సరానికి గాను 'షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి నిధి' (STSDF) కింద రూ. 18,745.16 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ప్రాథమిక వసతుల కల్పన: ప్రతి గిరిజన తండాలకు, గూడేలకు బీటీ రోడ్లు, సురక్షిత తాగునీరు, విద్యుత్, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరా గిరి జల వికాసం: గిరిజన రైతులకు సాగునీరందించేందుకు 'ఇందిరా గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నామని, ప్రత్యామ్నాయ పంటలు, సౌర విద్యుత్ (సోలార్) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. అడవితో గిరిజనుల సంబంధం తల్లి పిల్లల అనుబంధం లాంటిదని, గిరిజనుల జీవనోపాధికి అడవులే ప్రాణాధారమని మంత్రి వ్యాఖ్యానించారు. అడవులను సంరక్షించుకుంటూనే, నైపుణ్యాభివృద్ధి ద్వారా గిరిజన యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డితో కేసీఆర్ మరపురాని అనుబంధం

- నల్లబెల్లిలో భావోద్వేగానికి గురైన కేసీఆర్
- పార్టీ తరపున రూ.2.25 కోట్ల ఆర్థికసాయం



**నల్లబెల్లి, ఆగస్టు 9 (వుదయం) :** ఇటీవల అకాల మరణం చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) పాల్గొన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి గ్రామంలోని పెద్ది నివాసానికి చేరుకున్న కేసీఆర్.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**భావోద్వేగానికి గురైన కేసీఆర్..**

**పార్టీ అండగా ఉంటుందని భరోసా**

ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డితో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజా జీవితంలో సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదాగా బతికారని, నిత్యం ప్రజల మనిషిగా మెలిగారని కొనియాడారు. ఆయన లేని లోటు పార్టీకి, నియోజకవర్గానికి తీరనిదని ఆవేదన వ్యక్తం చేశారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును కుటుంబసభ్యులకు కేసీఆర్ స్వయంగా అందజేశారు.

**నల్లబెల్లికి తరలివచ్చిన జనసందోహం**

అధిష్టానం రాక నేపథ్యంతో నల్లబెల్లి గ్రామానికి బీఆర్ఎస్ కీలక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం ప్రాంగణం జనసందోహంతో కిక్కిరిసిపోవడంతో ఒక్కసారిగా స్వల్ప తోపులాట వాతావరణం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కార్యకర్తలను నియంత్రించి, కేసీఆర్ కాన్వాయ్‌ను సురక్షితంగా పెద్ది నివాసం లోపలికి పంపించారు.



## జర్నలిస్టుల భద్రతకు జాతీయ స్థాయిలో ప్రత్యేక చట్టం తేవాలి

ఐ.జే.యు. డిమాండ్!

**బెంగళూరు, ఆగస్టు 9 (ఎఎంస్) :** జర్నలిస్టుల భద్రతకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది.

బెంగళూరులో రెండురోజులపాటు జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం ముగిసింది. సమావేశానికి ఐ.జే.యు. జాతీయ అధ్యక్షుడు బల్వింద ర్ సింగ్ జమ్మూ అధ్యక్షత వహించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు, చట్టపరమైన దాడులు, హింస, పెరిగిపోవడం, వార్తా వనరుల గోప్యతకు అవసరమైన చట్టాలు లేకపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో భారతదేశంలో జర్నలిస్టుల, మీడియా సంస్థల భద్రతకు ఒక ప్రత్యేక బలమైన చట్టం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ కార్యవర్గ సమావేశం ఆమోదించిన ఒక తీర్మానంలో డిమాండ్ చేసింది.

ఐ.జే.యు. పూర్వాధ్యక్షుడు , తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ దేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికి దిగజారిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసారు. భారత రాజ్యాంగం భావప్రకటనా స్వేచ్ఛకు గట్టి హామీ ఇచ్చినప్పటికీ వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ కల్పించే సమగ్ర చట్టం లేకపోవడం వల్లనే బెదిరింపులు, దాడులు పెరిగిపోతున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో జర్నలిస్టుల భద్రతకు ఇప్పటికే ప్రత్యేక చట్టాలు వచ్చినప్పటికీ , అవి అవసరానికి తగినవిధంగా లేవని ఆ తీర్మానం పేర్కొన్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమాచార పౌరసంబంధాల బడ్జెట్ ను, వివిధ శాఖలు జారీచేసే ప్రకటనలను అనుకూల ప్రచారం కోసం ఆయుధాలుగా వినియోగించడాన్ని ఆ తీర్మానం ఖండించింది. 1955, 1958 సంవత్సరాల నాటి రెండు వర్కింగు జర్నలిస్ట్ చట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో వర్కింగు జర్నలిస్టులకు వృత్తి భద్రత, వేతనభద్రత , మెరుగైన పనిపరిస్తితులు కల్పించేందుకు వీలుగా ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఐ.జే.యు. మరో తీర్మానంలో డిమాండ్ చేసింది. వివిధ మీడియా సంస్థలలో కొనసాగుతున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయో పరిమితిని 58 నుండి 60 సంవత్సరాలకు పెంచాలని ఐ.జే.యు. సమావేశం ఆమోదించిన మరో తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఐ.జే.యు. సెక్రెటరీ జనరల్ డి. సోమసుందర్ , దేశంలో మీడియా స్థితిగతులపై, గత నాలుగు నెలల్లో యూనియన్ నిర్వహించిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. నివేదికపై పదిహేను రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, దాదాపు ఇరవై మందికి పైగా జాతీయ కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్. ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ. మాజిద్ , జాతీయ ఉపాధ్యక్షులు అమర్ మోహన్ ప్రసాద్,
వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యదర్శులు డి.ఎస్.ఆర్. సుభాష్, పి.భాస్కర్ రెడ్డి, నరేంద్ర భరద్వాజ్ , కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.జానకీ మోహన్, ప్రధాన కార్యదర్శి అంజన్ కుమార్ తదితరులు మాట్లాడారు.



జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 వ తేదీన "జర్నలిస్ట్ డిమాండ్స్ డే" ను దేశవ్యాప్తంగా పాటించాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది.
నవంబర్ 16వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వీర్యమైపోయిన ప్రస్తుత పరిస్థితులపై దేశవ్యాప్త చర్చను లేవనెత్తాలని, సమస్యపై అవగాహన పెంచేందుకు , పటిష్టమైన మీడియా కౌన్సిల్ అవసరాన్ని వివరిస్తూ ప్రచారాందోళనా కార్యక్రమాన్ని చేపట్టాలని, జర్నలిస్టులను, పౌర సమాజ ప్రముఖులను, ప్రజాప్రతినిధులను, న్యాయ నిపుణులను, విద్యావేత్తలను భాగస్వాములను చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు జరపాలని ఐ.జే.యు. జాతీయ కార్యవర్గ సమావేశం పిలుపు ఇచ్చింది. అక్టోబర్ ఆఖరు వారంలో మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సును హైదరాబాద్ లో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. జాతీయ కార్యవర్గ సమావేశాల ముగింపులో "కర్ణాటక రాజ్య ప్రశస్తి" పురస్కారాల ప్రదానకార్యక్రమాన్ని ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కర్ణాటక స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ సమాజంలోని విభిన్న జీవన రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రకటించిన "రాజ్య ప్రశస్తి" పురస్కారాలను ఐ.జే.యు. జాతీయ నాయకుల చేతులమీదుగా ప్రదానం చేశారు.

## 'జెన్ జీ' భవిష్యత్తే ముఖ్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఎఎంస్) :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంపై జరిగిన ఆందోళనల్లో నేటి తరం యువతను ('జెన్ జీ') కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించేందుకు కుట్ర పన్నారని మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. దేశ భవిష్యత్తు అయిన యువత సంక్షేమం కంటే తనకు మంత్రి పదవి పెద్దది కాదనే ఉద్దేశంతోనే పదవికి రాజీనామా చేసినట్లు ఆయన వెల్లడించారు. ఒక విశ్వవిద్యాలయ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాజీనామా అనంతరం తొలిసారిగా ఈ విషయమై బహిరంగంగా మాట్లాడారు.


నేటి యువతే భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెడతారు

జెన్ జీ తరం పిల్లలు మన ఇంట్లోని పిల్లల లాంటివారని, వారి వికాసంతోనే దేశ పురోగతి ముడిపడి ఉందని ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యానించారు. "యువతతో నాకు ఎలాంటి విభేదాలూ లేవు. గత పదేళ్ల కాలంలో దేశంలో జన్మించిన 20 కోట్ల మంది పిల్లలే రాబోయే రోజుల్లో భారత్‌ను 'విశ్వగురు'గా నిలబెట్టబోతున్నారు. వారి భవిష్యత్తు కంటే నాకు మంత్రి పదవి ముఖ్యం కాదు. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నేరుగా కలిసి, స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు ముందడుగు వేశాను" అని ఆయన తెలిపారు.

**బీజేడీ నిరసనలకు భయపడేది లేదు: నవీన్ పట్నాయక్‌పై విమర్శలు**


ఇదే సమయంలో తనపై బీజేడీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలపై ఆయన ఘాటుగా స్పందించారు. భువనేశ్వర్ విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో కొందరు వ్యక్తులు 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారని, అయితే ఇటువంటి బెదిరింపులకు తానేమీ భయపడేది లేదని, మళ్లీ వస్తానని స్పష్టం చేశారు. బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తనను రాష్ట్ర ప్రజల ముందు అవమానకరంగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

## ఇంతే కదా...!




## జలసంధి తెరిచే ప్రసక్తే లేదు

**వాషింగ్టన్:** ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' పునఃప్రారంభంపై ఇరాన్ తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని తెరవాలంటే అమెరికా తక్షణమే తన ధోరణిని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ప్రాంతీయంగా అమెరికా దళాల ఉపసంహరణతో పాటు దాడుల నష్టపరిహారం చెల్లించాలంటూ ఇరాన్ తీవ్ర షరతులు విధించింది. గత జూన్‌లో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఆంక్షల సడలింపు, ఆస్తుల విడుదలను తుది ఒప్పందంలో చేర్చాలని ప్రాథమికంగా భావించారు. అయితే, ఇరాన్ ఇప్పుడు తన వ్యూహాన్ని మార్చుకుంది.






# మండలంలోని 'సర్పంచ్",లతో ఎమ్మెల్యే సమావేశం"



ఝరాసంగం వుదయం ఆగస్టు:8

జాహిరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలంలోని సర్పంచ్ లతో ఎమ్మెల్యే.కొణింటి. మాణిక్ రావు, గారు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల సమస్య లు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి, రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. రాకపోకలకు ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నా రని సర్పంచ్ లు తెలిపారు, ఎమ్మెల్యే గారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ప్రజల సమస్య,లను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. సమావేశంలో ఝరాసంగం సర్పంచ్ వినోద బాలరాజ్, తుమ్మన్ పల్లి సర్పంచ్ షేక్ సోహెల్, ఇమ్రాన్ పటేల్, నాగేందర్ పటేల్, జైపాల్ రెడ్డి, రాజ్ కుమార్,జైరాజ్, పలువురు సర్పంచ్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హోటళ్లో తినుబండారాలు తింటున్నారా... జర జాగ్రత్

- వాడిన నూనె మళ్ళీ వాడితే ప్రాణానికి ప్రమాదం.
- హోటళ్లకు అలవాటైన ప్రజలను ఆసరా తీసుకున్న హోటల్ యజమానులు కగిన నూనె కాగిస్తూ.

నారాయణఖేడ్ ఆగస్టు 09(వుదయం)

నారాయణఖేడ్ పట్టణంలో ప్రజల ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. నూనెలను అధికంగా వాడే వంటకాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వేయించిన పదార్థాల కోసం హోటళ్లను ఆశ్రయించే వారి సంఖ్య భారీగా పెరిగింది. ఇదే ఆసరాగా తీసుకున్న హోటల్ యజమానులు కాగిన నూనె కాగి పదార్థాలను తయారు చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు. నిమ్మకు నిరతనట్టు వ్యవరిస్తున్నారు. ఎక్కడ కూడా తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. బాగా వేడి చేసిన నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 25 శాతానికి మించిపోయి హానికరంగా మారుతుంది. అని తెలిసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కనీసం, హోటల్ యజమానులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని గట్టి ఆరోపణలు ఉన్నాయి.

**ప్రజల ఆరోగ్యంపై ఫుడ్ సేఫ్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.**

కల్తీ నూనె నిరోధానికి..ఒకసారి వాడిన నూనెను మరోసారి వాడకుండా ఉండేందుకు చిరు వ్యాపారులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.అతిగా మరిగించిన నూనెలో తినుబండారాలను తయారు చేయకుండా చర్యలు తీసుకోవాలి. కొన్ని హోటళ్లో నాణ్యత లు పాటించడం లేదనీ, పురుగులు పట్టిన ఆహార పదార్థాలతో తయారుచేసి అమ్ముతున్నారని, రోజు వారి తయారు చేయకుండా ఒకరోజు తయారు చేసి మర్నాడు అమ్ముతున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఒకసారి వాడిన వంట నూనెను మళ్లీ మళ్లీ వినియోగించడం వల్ల ఆరోగ్యానికి చేటు కలిగిస్తుంది. మోతాదుకు మించి మరిగిన నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 25 శాతానికి మించి శరీరానికి హానికరంగా మారుతుంది. అలాంటి నూనెతో ఆహార పదార్థాలు వండితే శరీరంలో అధికంగా ఫ్రీరాడికల్స్ పెరిగిపోతాయి. నూనె రంగు మారిపోతుంది. అడుగున నల్లటి పదార్థం తయారవుతుంది. ఆమ్లం అధికమవుతుంది. కొన్ని నూనెలలో నిలువ ద్వారా విష పదార్థాలు కూడా ఏర్పడతాయి. ఇది తిన్న ప్రజలకు ఇంట్లో తినాలంటే నోరు రుచిగా ఉండదు ఎందు అని డాక్టర్లను సంప్రదిస్తే మీరు బయట ఫుడ్ తిన్నారు కదా అక్కడ మరిగిన నూనె మరిగించి మరిగించి తినుబండారాలు తయారు చేస్తున్నారు కాబట్టి వాటి వల్ల మీకు రోగాలు వస్తున్నాయని తెలుపుతున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో కూడా ఇదే తంతు. విచ్చలవిడిగా కాగిన నూనెనే కాగిస్తూ రోజు టిఫిన్లు తినుబండరాలు తయారు చేసి ప్రజలలో అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇకనైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించి ఇలాంటి వారిపైచర్యలకు పాదుపడుతున్న హోటళ్ల పై నిగా పెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.





# కృష్ణమ్మ ఉగ్రతాండవం

- బీచుపల్లి వద్ద ప్రాణాంతక 'మొసలి' రక్కసి!
- నదిలోకి దిగారా.. మృత్యువాత పడ్డట్టే! తీరప్రాంత ప్రజలారా హెచ్చరిక!

ఎర్రవల్లి ఆగస్టు 09 (వుదయం కరస్పాండెంట్)



కృష్ణమ్మ రౌద్రరూపం దాల్చింది. ఎగువన కురుస్తున్న రాక్షస వర్షాలకు జూరాల గేట్లు ఎత్తివేయడంతో బీచుపల్లి వద్ద నది ముంచెత్తుతోంది. ఉరకలెత్తుతున్న ఈ మహోగ్ర ప్రవాహంలోకి ఎగువ నుంచి ఒక భయానక 'మొసలి' కొట్టుకొచ్చింది. అటు ఉప్పొంగే ప్రవాహ హోరు.. ఇటు నీటి కడుపులో కళ్ళు గప్పుకుని పొంచివున్న ప్రాణాంతక జలరాక్షసి! ప్రస్తుతం బీచుపల్లి తీరం మృత్యుకూపంగా మారింది. తీరప్రాంత జనం గుండెల్లో భయకంపనాలు మొదలయ్యాయి. అడుగుపెడితే.. జలసమాధే! ఈ ఉధృత ప్రవాహంలో నది తీరానికి వెళ్లడమంటే మృత్యువు నోట్లోనే వేలు పెట్టడమే! పుణ్యస్నానాలనో, పూజలనో నదిలోకి దిగారో ఇక అంతే సంగతులు. నీటి అడుగున మొసలి ఏ క్షణాన ఎటునుంచి వచ్చి దాడి చేస్తుందో ఊహించడం కూడా అసాధ్యం. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా నిండు ప్రాణాలు బలికాక తప్పదు. ముఖ్యంగా పిల్లలను, వృద్ధులను కంటికి రెప్పలా కాపాడు కోవాలని, నది ఛాయలకే రానివ్వొద్దని అధికారులు ఘాటుగా హెచ్చరిస్తున్నారు. రీల్స్, ఫోటోల పిచ్చి వద్దు.. ప్రాణాలతో చెలగాటమాడకండి! చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు జీవనోపాధి కోసం జీవితాలను పణంగా పెట్టవద్దు. ఈ విపత్కర పరిస్థితుల్లో నదిలోకి దిగే సాహసం అస్సలు చేయకండి. ఇక మొసలి కనిపించిందని ఫొటోలు, వీడియోగ్రఫీలు, రీల్స్ చేసే పిచ్చి సాహసాలకు ఒడిగడితే ప్రాణాలు గాల్లో కలవడం ఖాయం. ఆ దృశ్యాలు చూసేందుకు గుంపులుగా చేరడం అత్యంత ప్రమాదకరం. రంగంలోకి యంత్రాంగం.. పటిష్ట బందోబస్తు పరిస్థితి తీవ్రతను గుర్తించిన జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అలంపూర్ సీఐ ప్రదీప్, ఇటిక్యాల ఎస్ఐ రవి, ఎంఆర్ఓ నరేష్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి అరుణ తదితర అధికారులు తీరప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. నది వైపు ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రకృతి రౌద్రం తగ్గేవరకు, మొసలి ముప్పు వీడేవరకు నది వైపు కన్నెత్తి కూడా చూడకండి. ప్రాణాలపై తీపి ఉంటే అధికారుల హెచ్చరికలు శిరసావహించండి!

# స్వీపర్ల జీతాలు ఆపేసి.. ప్రభుత్వం ఏం సాధించింది?

- రెండు నెలలుగా వేతనాలు పెండింగ్.. పట్టించుకునేవారెవరు?
- జైల్‌భరోతో ప్రభుత్వానికి కార్మికుల సత్తా చూపిస్తాం: సీఐటీయూ

గద్వాల ఆగస్టు 09 (వుదయం బ్యూరో)



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రతి స్వీపర్ అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పేర్ నరసింహ పిలుపునిచ్చారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక చట్టాల సవరణలు కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని విమర్శించారు.కొత్త కార్మిక చట్టాల అమలుతో మానవ శ్రమకు విలువ తగ్గి, యాజమాన్యాలు చెప్పిందే శాసనంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులను బానిసలుగా మార్చే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నాయన్నారు. పని గంటలు పెంచే అవకాశం, ఉద్యోగ భద్రత లేకపోవడం, సామాజిక భద్రతా పథకాలకు దూరం చేయడం వంటి పరిణామాలు కార్మికుల జీవితాలను మరింత కష్టాల్లోకి నెడతాయని అన్నారు.ప్రభుత్వం వేతనాలు విడుదల చేయకపోయినా ప్రశ్నించే హక్కు లేకుండా చేసే విధానాలను తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

**రెండు నెలలుగా వేతనాలు పెండింగ్**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఎలాంటి కారణం లేకుండా స్వీపర్లను విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. వేతనాల సమస్యను వెంటనే పరిష్కరించి, స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సకల కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం, కార్మిక హక్కుల పరిరక్షణ,ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్వీపర్లు మల్లమ్మ, అకిరా బేగం, హసీనా బేగం, జయమ్మ, మహముదా, అంజిలన్న, బాలరాజు, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో పార్ట్ టైమ్ ఉపాధ్యాయులనియామకం

- అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి, ఆగస్టు 9:వు దయం.

సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన (పార్ట్‌టైమ్) ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హత కలిగిన, ఇంగ్లీష్ మీడియంలో బోధించగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ నర్సింగ్ రావు తెలిపారు.డిగ్రీ లెక్చరర్ పోస్టులు: సంగారెడ్డి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ లెక్చరర్ పోస్టులు: ప్రతిభా జూనియర్ కళాశాల (బాలురు)లో కామర్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, నారాయణఖేడ్ పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు)లో జువాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి.PGT పోస్టులు: సిర్గాపూర్ పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, కంగ్టి పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు)లో ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్ స్టడీస్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు)లో సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి.TGT పోస్టులు: నారాయణఖేడ్ పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లీష్, కంగ్టి పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, జిన్నారం పాఠశాల & జూనియర్ కళాశాల (బాలురు)లో మ్యాథ్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల & జూనియర్ కళాశాల (బాలికలు) లో మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి. అదే బాలికల విద్యాలయంలో సోషల్ స్టడీస్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.విద్యార్హతలు: డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. అదే సబ్జెక్టులో Ph.D./NET/SET అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. PGT పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు B.Ed. ఉత్తీర్ణులై ఉండాలి. TGT పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు B.Ed. ఉత్తీర్ణులై ఉండాలి. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (PD) పోస్టుకు ఏదైనా డిగ్రీతో పాటు B.P.Ed./B.P.Ed. ఉత్తీర్ణత తప్పనిసరి.బాలికల విద్యాలయాల్లోని పోస్టులను కేవలం మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాలకు DCO-సంగారెడ్డి జిల్లా: 9849237238 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

# గెస్ట్ టీచర్ల జీతాలు పెంచండి



- తెలంగాణ రాష్ట్ర హామీల కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డికి మెమోరాండం.

నారాయణఖేడ్ ఆగస్టు 09(వుదయం)

తెలంగాణ రాష్ట్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లలో పనిచేస్తున్న గెస్ట్ టీచర్ల జీతాలు పెంచాలని పలువురు గెస్ట్ టీచర్లు తెలంగాణ రాష్ట్ర హామీల కమిటీ చైర్మన్ నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డిని ఆదివారం కలిసి తెలంగాణ రాష్ట్ర హామీల కమిటీ చైర్మన్ గా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసి శాలువా, బొకేతో సన్మానించారు. అనంతరం గెస్ట్ టీచర్ల జీతాలు పెంచాలని మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా గెస్ట్ టీచర్ల అధ్యక్షులు రాములు, జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, కోఆర్డినేటర్ సంతోష్ నాయక్ లు మాట్లాడుతూ పెరిగిన నిత్య అవసరాలకు అనుగుణంగా, సమాన పనికి సమాన జీతం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గెస్ట్ టీచర్ల జీతాలు పెంచుతూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాలుగు పీరియడ్లు మాత్రమే చెప్పాల్సిన గెస్ట్ టీచర్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు, హౌస్ మాస్టర్ గా నైట్ కేర్ టేకరుగా, వివిధ ఇన్చార్జ్‌గా తమ విధులు నిర్వహిస్తూ స్కూల్ కాంప్లెక్స్ లో ఉండి విద్యార్థుల అభివృద్ధి ఎనలేని కృషి చేస్తున్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంజీవ రెడ్డి బీసీ వెల్ఫేర్ మినిస్టర్ పొన్నం ప్రభాకర్,ఆయా వెల్ఫేర్ సెక్రటరీలతో మాట్లాడి గెస్ట్ టీచర్ల జీతాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థ పటిష్ఠం కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని వీలైతే టీచర్లందరూ రెండు గంటలు ఎక్కువ పనిచేసి విద్యార్థుల పురోభివృద్ధికి సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ టీచర్లు రాజు,విజయ్ కుమార్, సంగ్రామ్, మధుమోహన్ నరేష్ రాములు నాయక్ సాయిలు, మహేష్,పండరి,సూర్యకాంత్, ప్రశాంత్, సదానందం, యాదయ్య, నర్సింలు,మోహన్ రెడ్డి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# "అమ్మవారికి నైవేద్యాలు, ప్రత్యేక పూజలు'

- " అత్యంత వైభవం గా అమ్మవారి బోనాల ఉస్తవాలు"

కోహీర్ ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి )



కోహీర్ మండల పరిధిలోని చింతల్‌గట్టు గ్రామంలో దుర్గామాత ఊరడమ్మా అమ్మవార్ల బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక భక్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొన్నారు. మహిళలు బోనాలను శిరస్సుపై ధరించి ఊరేగింపుగా బయలుదేరారు. ఈ ఊరేగింపు మంగళ వాయిద్యాలు మరియు డప్పు చప్పుళ్ల నడుమ చాలా కోలాహలంగా సాగింది. భక్తులంతా కలిసి ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు.గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దుర్గామాతను దర్శించుకున్నారు..గ్రామస్తులంతా పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ. భక్తిపారవశ్యంతో పాల్గొన్నారు .ఆలయ ప్రాంగణం భక్తుల జయ జయధ్వానాలతో ప్రతిధ్వనించింది. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.చిన్నా పెద్దా తేడా లేకుండా ఊరి ప్రజలంతా కలిసి ఉత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.పండుగ శోభతో చింతల్‌గట్టు గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.అమ్మవారి దివ్య ఆశీస్సులు గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.బోనాల ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం కొనసాగింది.ఈ ఉత్సవాలు గ్రామస్తుల ఐక్యతకు, సాంప్రదాయ బద్ధమైన భక్తిభావానికి ప్రతీకగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మల్లన్న పాటిల్ చంద్రారెడ్డి మధుసూదన్ రెడ్డి సీతారాం రెడ్డి చక్రధర్ రెడ్డి విట్టల్ రెడ్డి వీరారెడ్డి మల్లారెడ్డి బసవరాజ్ వీరన్న శేఖర్ మోహన్ రెడ్డి నరసింహులు ఆంజనేయులు మాణిక్ రెడ్డి రాచ్చన్న రాజిరెడ్డి విట్టల్ రెడ్డి చంద్రశేఖర్ విజయ్ కుమార్ జగదీశ్వర్ రాజు కె రాజన్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ఎస్ కార్యకర్తలే నా బలం

- ఒంటెద్దు పోకడతోతప్పు చేశా
- సర్పంచ్ సాయికిరణ్

ఆందోల్ జోగిపేట్ వుదయం



ఆదివారం ఆందోల్ మండల పరిధిలోని నేరడి గుంట గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సర్పంచ్ ఓగ్గు సాయికిరణ్ మాట్లాడుతూ గత ఆరు మాసాల్లో సర్పంచ్ పదవిలో ఉన్న కార్యకర్తలు నాకు అండగా లేనందున ఎంతగానో బాధపడ్డాను నాకు బి ఆర్ ఎస్ కార్యకర్తలే నాకు వెన్నుముకలని తెలుసుకున్న.ఏ కార్యక్రమం ఉన్న బి ఆర్ఎస్ కార్యకర్తలను విస్మరించకుండా కొనసాగుతానని తెలుపుతూ. పార్టీ కార్యకర్తలు ముందుకు రానందున నాకు ఎంతగా గాను బాధగా అనిపించింది ఇక ముందు ప్రతి కార్యక్రమంలో కార్యకర్తను కలుపుకొని పోతానని బి ఆర్ఎస్ పార్టీకి కట్టుబడి ఉంటానని ప్రతి ఫోటో కాల్స్ కు కార్యకర్తలను పిలుస్తానని అన్నారు ఈ కార్యక్రమంలోమాజీ మండల ఉపాధ్యక్షుడు పత్తి వీరేశం బీ ఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మన్నే బాలరాజ్ మాజీ ఎంపిటిసి కృష్ణగౌడ్ మాజీ ఎంపిటిసి సంగమేశ్వర్ ముఖ్య కార్యకర్తలు సతీష్ వారిది మైనార్టీ అధ్యక్షులు ఆమెరుద్దీన్ తలారి నరసింహులు ఉపసర్పంచ్ కోదండ ఈశ్వర్ లు వార్డ్ మెంబర్ బోయిని శంకర్ బ్యాగరి మహేష్ ఎర్రోళ్ల కృష్ణ మన్నే నర్సింలు కోదండ యాదయ్య తుకపురం అర్జున్ కోదండ దత్తు దూదేకుల ఇమామ్ సబ్. పరిపూర్ణ. మన్నె నర్సింలు మైలు గుండ్ల ప్రభాకర్ గుణాల సంగమేశ్వర్ గున్నల సంతోష్ బేగరి ఆంజనేయులు బెగరి కృష్ణ గ్రామ బి ఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక భరోసా

- ఉప్పల వెంకటేష్ ఆర్థిక సాయం

కల్వకుర్తి, ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి):



కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామానికి చెందిన లక్ష్మీబాయి అనారోగ్యంతో మరణించగా, ఆమె కుటుంబ సభ్యులకు మిషన్ భగీరథ మాజీ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తక్షణ ఆర్థిక సాయం అందించారు.లక్ష్మీబాయి మరణ వార్తను ఎల్లికట్ట గ్రామం బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు భీమయ్య, ఉపసర్పంచ్ బలగం కేశవులు, కంఠం రవి, శాంతి రెడ్డి, టైలర్ ఆంజనేయులు, వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, జైపాల్ రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టికి పట్టాభిషేకం

తీరని కష్టమొచ్చినపుడు
కొత్తబట్టల ముడుపు కడుతం
కలల కనవడ్డప్పుడు
కల్లు సాకవోస్తం
గుండె బరువైనపుడు
నీ గూట్లె దీపం ముట్టిస్తం
పండొ ఫలమో కలిగితే
కోడిపుంజును కోసి
నైవేద్యం వొండుతం
మా ఆకలితీర పంట పండినపుడు
మ్యాకపోతును కోసి
నెత్తుటి సాకవెడతం
పని బాటలల్ల అడుగడుగు
తోడుంటవని నమ్ముతం
చెట్టు పుట్టలల్ల నీ రూపం కొలుసుకుంటం
పిల్ల పాపలతో సల్లంగ బతికితే
యాడాదికో మారు బోనాలు తీస్తం
బోనం అంటే పండుగ మాత్రమే కాదు
మట్టికి పట్టాభిషేకం కట్టుడు



చెన్న రాజు,
కవి, ఉపాధ్యాయుడు
9908010610 దౌల్తాబాద్ ఆగస్టు 09 (వుదయం):

# కల్వకుర్తిలో యువజన కాంగ్రెస్ పండుగ

- నాయకులుగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ మంచి వేదిక - బీస బాలరాజు

కల్వకుర్తి, ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి):



నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఆదివారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పండుగలా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. పట్టణంలోని ఇందిరా నగర్ కమాన్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా బీస బాలరాజు మాట్లాడుతూ నాయకులుగా ఎదగడానికి యువజన కాంగ్రెస్ మంచి వేదిక అని తెలిపారు. మండలంలోను, పట్టణంలోను తన బాధ్యతగా యువజన కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిక్షణం కృషి చేస్తున్నానని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతి గడప గడపకు తిరిగి ప్రచారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీను, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మావిళ్ళపల్లి వంశీ, జిల్లెల ఉప సర్పంచ్ రవి, నాయకులు దున్న భాస్కర్, విజయ్ భాస్కర్, కమ్ముల శ్రీకాంత్, శివ, ఎముక శ్రీహరి, కుర్మయ్య, బంగారయ్య, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

# ఉగ్రరూపానికి బ్రేక్: జూరాల వద్ద చల్లబడిన 'జల' విలయం

- ఎగువన కరిగిన మేఘాలు.. సడలిన ఉరుముల ధాటి
- పూర్తిగా మూతపడిన జూరాల క్రస్ట్ గేట్లు.. తీరప్రాంతాలకు బిగదీసిన ఊపిరి సడలింపు

గద్వాల ఆగస్టు 09 (వుదయం బ్యూరో)



కొద్ది రోజులుగా భయానక ప్రవాహంతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ ఒక్కసారిగా శాంతించింది. ఎగువ క్యాచ్‌మెంట్ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరివాహకాల్లో వరుణుడి విలయ తాండవం తగ్గడంతో జూరాల ప్రాజెక్టు వైపు దూసుకొచ్చిన జల ఉధృతికి కళ్లెం పడింది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి దిగువకు సాగుతున్న ప్రాణాంతక ప్రవాహ ధాటి సడలడంతో, జూరాల వద్ద పాతబడిన జలభయం తొలిగిపోయింది. జలాశయం వద్ద పరిస్థితులు ప్రస్తుతానికి అదుపులోకి వచ్చినా, ఎగువ ప్రాంతాల నుంచి మళ్లీ ఏ క్షణానైనా నీటి ధాటి పెరిగే ప్రమాదం ఉన్నందున ఇంజనీరింగ్ యంత్రాంగం నిరంతర నిఘా ఉంచింది.

# మనియార్‌పల్లిలో ఊరడమ్మ, పోచమ్మ తల్లుల బోనాల ఉత్సవాలు

కోహీర్ ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి )

కోహీర్ మండలం మనియార్‌పల్లిలో ఊరడమ్మ, పోచమ్మ తల్లుల బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ గ్రామ దేవతల ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం నాడు ఈ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు మరియు పెద్దల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.మధ్యాహ్నం 02:00 గంటలకు శ్రీ పోచమ్మ తల్లికి బోనాలు. సమర్పించారు. మహిళలు సాంప్రదాయబద్ధంగా బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లారు.సాయంత్రం 04:00 గంటలకు 'వరద పాశం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొని ఆధ్యాత్మిక శోభతో అలారారింది. అమ్మవార్ల ఆశీస్సులు పొందేందుకు ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.గ్రామ సుభిక్షం కోసం ప్రజలంతా అమ్మవార్లను భక్తితో వేడుకున్నారు. భక్తులందరూ అమ్మవార్ల కృపాకటాక్షాలు పొంది సంతోషం వ్యక్తం చేశారు.గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఈ ఉత్సవాలు దిగ్విజయంగా జరిగాయి



# అమ్మవారికి ఆషాడ మాస బోనాలు

(వూదయం) పెద్ద శంకరంపేట ప్రతినిధి ఆగస్ట్ 09

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని గడికోట దుర్గామాత అమ్మవారికి ఆదివారం సాయంత్రం గ్రామస్తులు వైభవ బోనాలు నిర్వహించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ (దేవుడి ) నుండి భాజా భజంత్రీలతో మహిళలు బోనాల నెత్తిన పెట్టుకొని శివసత్తులు నృత్యాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గడికోటలోని అమ్మవారికి సమర్పించారు. ఉదయం శ్రీ సరస్వతి శిశు మందిర్ నుండి అమ్మవారి చిత్రపటం. తొట్టెలను ఊరేగింపుగా గడికోటకు చేరుకొని అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# చదువుతోనే వాల్మీకుల భవిష్యత్‌కు బంగారు బాట!

- వడ్డేపల్లి, రాజోలి మండలాల్లో వాల్మీకి విద్యా చైతన్య కమిటీల ఏర్పాటు
- విద్యతో అన్ని రంగాల్లో రాణించేలా యువతను ప్రోత్సహించడమే లక్ష్యం


శాంతినగర్ ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)



వాల్మీకి సమాజంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించి, విద్య ద్వారానే అన్ని రంగాల్లో ముందుకు సాగేలా యువతను చైతన్యపరచాలనే లక్ష్యంతో జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యా చైతన్య కమిటీలను ఏర్పాటు చేశారు. వడ్డేపల్లి, రాజోలి మండలాలకు సంబంధించిన కమిటీలను శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు ప్రకటించారు.వడ్డేపల్లి మండల అధ్యక్షులుగా కోయిల్దిన్నె నాగరాజ్, ప్రధాన కార్యదర్శిగా శాంతినగర్ హుస్సేన్, కోశాధికారిగా రామాపురం పరశురాములు ఎంపికయ్యారు. రాజోలి మండల అధ్యక్షులుగా పెద్ద తాండ్రపాడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా తుమ్మిళ్ల వెంకటేష్, కోశాధికారిగా మాందొడ్డి రమేష్ బాబు నియమితులయ్యారు.ఈ సందర్భంగా జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం అధ్యక్షులు మేడికొండ ఈశ్వర్, నాయకులు క్యాతూరు మద్దిలేటి, జిల్లా వాల్మీకి ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి జె. ఎల్లస్వామి, ఉపాధ్యక్షులు డి. రంగన్న, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా వాల్మీకి నాయకులు పచ్చర్ల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు బిజ్వారం తిమ్మప్ప, మాందొడ్డి వినోద్, గొందిమల్ల రామకృష్ణ, షాబాద్ భీసన్న, కొర్విపాడు తిలక్ తదితరులు పాల్గొన్నారు. వాల్మీకి సమాజంలోని విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల్లో యువతను ప్రోత్సహించడం, విద్యా అవకాశాలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడం వంటి అంశాలపై కమిటీలు పనిచేయనున్నట్లు నాయకులు తెలిపారు.కార్యక్రమంలో రెండు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వాల్మీకి పెద్దలు, ఉద్యోగులు, యువత పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## బొల్లారంలో ఘనంగా బోనాల వేడుకలు



**జిన్నారం ఆగష్టు 9(వుదయం ప్రతినిధి )**

బోనాల వేడుకల్లో భాగంగా బొల్లారం డివిజన్ పరిధిలోని ఐడిఎ బొల్లారం కాలనీలో జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి,బొల్లారం బీసీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బత్తుల శ్రీశైలం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

మన పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఈ గొప్ప సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదగిరి గౌడ్, స్థానిక నాయకులు పరశురామ్, చిరంజీవి, నవీన్ రెడ్డి, శివకృష్ణ, హరి కృష్ణ, ప్రతాప్ రెడ్డి, పురుషోత్తం, వడ్డే రాము, విక్కీ అగర్వాల్, కాలనీ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తోల్కట్టలో ఘనంగా బోనాల పండుగ

**చేవెళ్ల ఆగస్టు 9(వుదయం)**



మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట గ్రామంలో అదివారం పోచమ్మ మైసమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.బోనాల పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో బోనాల పండుగను పురస్కరించుకుని భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సందడి నెలకొంది.సంప్రదాయ పద్ధతిలో బోనాలు సమర్పిస్తూ అమ్మవారిని కొలిచారు.

శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.





### అమీన్‌పూర్‌లో సంబరంగా ఆషాఢ మాస బోనాలు
## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**: కాట శ్రీనివాస్ గౌడ్.**

**అమీనుపూర్ ఆగష్టు 09, వుదయం ,**

అమీన్‌పూర్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీ, శ్రీవాణి నగర్ కాలనీల్లో ఆషాఢ బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కాట శ్రీనివాస్ గౌడ్‌ను ఘనంగా స్వాగతించి, శాలువాతో సన్మానించారు.

## ఫేక్ సర్టిఫికెట్లు తేలితే ఉద్యోగం రద్దు చేయాలి

**చిన్నకోడూర్ ,వుదయం**



చిన్నకోడూర్ మండలంలోని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారాలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు శ్రీ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు, ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో సమగ్ర సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టాలి,ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి,ఇటీవల జూనియర్ లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో,కేవలం ఒక శాఖకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు, అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సర్టిఫికెట్లను సమగ్రంగా పునఃపరిశీలించాలని ఆయన కోరారు అదేవిధంగా నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసిన వ్యక్తులు సంస్థలు లేదా వాటి వెనుక ఉన్న వ్యవస్థపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు,అందువల్ల ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విద్యార్హతలు, కులం, స్థానిక ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత అవసరం ప్రభుత్వ ఉద్యోగం అనేది వేలాది మంది నిరుద్యోగ యువత కల ఎంతో మంది అభ్యర్థులు సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పోటీ పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధిస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో నకిలీ లేదా తప్పుడు ధ్రువపత్రాలతో ఎవరైనా ఉద్యోగం పొందితే అది నిజాయితీగా పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం అవుతుందని శ్రీనివాస్ ముదిరాజ్ పేర్కొన్నారు, వెరిఫికేషన్‌లో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే, చట్ట ప్రకారం ఉద్యోగం రద్దు చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఇప్పటివరకు పొందిన ప్రభుత్వ ప్రయోజనాలు, వేతనాలు తదితర అంశాలపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు,అధికారుల పాత్రపైనా విచారణ జరపాలి నకిలీ ధ్రువపత్రాల ఆధారంగా ఎవరైనా ఉద్యోగం పొందినట్లు నిర్ధారణ అయితే, వాటిని పరిశీలించిన సమయంలో అధికారుల నిర్లక్ష్యం,

.నియామక ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని ఆయన అన్నారు,నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి

నిజాయితీగా చదివి, అర్హత సాధించి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు న్యాయం చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో 100 శాతం పారదర్శకత,జవాబుదారీతనం ఉండాలని శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్టిఫికెట్లను దశలవారీగా వెరిఫికేషన్ చేయాసి అన్ని ఉద్యోగుల నియామక వ్యవస్థను బలోపేతం చేయాలి అన్ని శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### భవాని మాత ఆలయంలో
## ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతుల ప్రత్యేక పూజలు

**ముషీరాబాద్,ఆగస్టు 09(వుదయం)**

ఆషాఢ మాసం బోనాల పండుగను పురస్కరించుకొని చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ భవాని మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులు ఆలయాన్ని సందర్శించి భవాని మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అమ్మవారి సేవా కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం ఆలయ పూజారి ముచ్చకుర్తి ప్రభాకర్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## కాజిపల్లి గ్రామ రోడ్డు గుంతలమయం

**జిన్నారం ఆగష్టు 9 (వుదయం ప్రతినిధి )**



గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. రహదారిపై గుంతలు ఏర్పడి వరద నీరు నిలవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మోకాళ్ళ లోతు లో నీరు నిలవడంతో రాత్రింబవళ్లు ప్రయాణించాలంటే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతల మయంగా మారిన రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## జిన్నారం పంట పొలాల్లో సందడి చేసిన జాతీయ పక్షి నెమలి



**జిన్నారం ఆగష్టు 9 (వుదయం ప్రతినిధి )**

జిన్నారం అక్కమ్మచెరువు షాకరు కొమ్మ సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఆదివారం సాయంత్రం జాతీయ పక్షి నెమలి సందడి చేసింది. పచ్చని పంట పొలాల్లో నెమలి రాకను గమనించిన ప్రకృతి ప్రేమికులు వాహనదారులు కాసేపు ఆగి నెమలి దృశ్యాలను సెల్ ఫోన్లలో బంధించి సంబరపడ్డారు. కాగా పచ్చదనం వెల్లి విరుస్తుండడంతో నెమళ్లు వ్యవసాయ క్షేత్రాల్లో కనువిందు చేయడం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. మరో విశేషం ఏమిటంటే జిన్నారం మండలంలో అండూర్, కొడకంచి, మంగంపేట, సోలక్పల్లి, రాళ్లకత్వ, జిన్నారం గ్రామాలు నెమళ్లకు ఆవాసాలుగా మారాయి.

## లాల్ దర్వాజా బోనాలు హైదరాబాద్ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీక

- **హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు**

**వుదయం , శివ్వంపేట ఆగస్ట్ 9....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు అమ్మవారి బోనం తమ నెత్తిన ఎత్తుకొని మొక్కు తీర్చుకున్నారు . అనంతరం సంస్కృతి గురించి వివరిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలకు ప్రతిబింబంగా నిలిచే పండుగల్లో బోనాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢ మాసంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించడం తెలంగాణ ప్రజల ఆచారం. హైదరాబాద్‌లో జరిగే బోనాల ఉత్సవాల్లో లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు అత్యంత ప్రసిద్ధి చెందినవిగా పేరుగాంచాయి.

**లాల్ దర్వాజా మహంకాళి అమ్మవారు**

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలోని లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయం భక్తులకు ఎంతో పవిత్రమైన క్షేత్రంగా భావించబడుతుంది. ఆషాఢ మాసంలో జరిగే బోనాల సందర్భంగా ఆలయం పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతాయి.అమ్మవారిని మహంకాళి స్వరూపంగా కొలుస్తూ భక్తులు తమ కుటుంబాల ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి, సౌభాగ్యం కోసం మొక్కులు చెల్లించుకుంటారు.

**బోనం అంటే ఏమిటి?**

'బోనం' అనే పదం 'భోజనం' అనే పదం నుంచి వచ్చిందని సాధారణంగా చెబుతారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించేందుకు మహిళలు కొత్త మట్టి లేదా లోహ పాత్రలో అన్నం, పాలు, బెల్లం వంటి పదార్థాలతో నైవేద్యం సిద్ధం చేస్తారు.

ఆ బోనం పాత్రను పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించి తలపై పెట్టుకుని



మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయానికి తీసుకువస్తారు.ఇది కేవలం ఒక నైవేద్యం మాత్రమే కాదు—అమ్మవారిపై భక్తి, కృతజ్ఞత, కుటుంబ క్షేమం కోసం చేసే ప్రార్థనకు ప్రతీక.

**మహిళల భక్తి – బోనాల ప్రత్యేకత**

లాల్ దర్వాజా బోనాల్లో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమైనది. సంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బోనం పెట్టుకుని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకోవడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణ.

పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనం, వేప ఆకులు, మంగళ వాయిద్యాలు, పోతరాజుల నృత్యాలు—ఇవన్నీ కలిసి తెలంగాణ జానపద సంస్కృతికి అద్భుతమైన రూపాన్ని చూపిస్తాయి.

**పోతరాజుల నృత్యం**

బోనాల ఉత్సవంలో పోతరాజులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. సంప్రదాయ దుస్తులు ధరించి, చేతిలో కొరడా పట్టుకుని ఉత్సాహంగా నృత్యం చేస్తూ ఊరేగింపులో పాల్గొంటారు. పోతరాజును అమ్మవారి సోదరుడిగా భావించే జానపద విశ్వాసం ఉంది. ఆయన అమ్మవారి ఊరేగింపుకు రక్షకుడిగా ముందుండి నడుస్తారని భక్తుల నమ్మకం.

**వేపాకు, పసుపు, కుంకుమల ప్రాధాన్యత**

బోనాల సందర్భంగా వేపాకుకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. వేపను పవిత్రతకు, ఆరోగ్యానికి ప్రతీకగా భావించే సంప్రదాయం ఉంది.

బోనం పాత్రను పసుపు, కుంకుమలతో అలంకరించడం ద్వారా అమ్మవారి శక్తి స్వరూపాన్ని ఆరాధిస్తారు. మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన బోనాన్ని తలపై పెట్టుకుని అమ్మవారికి సమర్పించడం తరతరాలుగా వస్తున్న ఆచారం.రంగం - భక్తి విశ్వాసానికి ప్రత్యేక ఘట్టంహైదరాబాద్ బోనాల ఉత్సవాల్లో *రంగం* కూడా ఒక ముఖ్యమైన సంప్రదాయ కార్యక్రమం. అమ్మవారి ప్రతినిధిగా భావించే మహిళ భక్తుల సమక్షంలో భవిష్యత్తుకు సంబంధించిన సూచనలు చెప్పే ఆచారం దీనిలో కనిపిస్తుంది.ఇది తెలంగాణ జానపద ఆధ్యాత్మిక సంప్రదాయంలో ప్రత్యేకమైన అంశంగా నిలిచింది.లాల్ దర్వాజా బోనాలు - భక్తి మాత్రమే కాదు, సంస్కృతి కూడాలాల్ దర్వాజా బోనాలు హైదరాబాద్ నగరంలోని తెలంగాణ సంస్కృతికి ఒక జీవంతమైన ప్రతిరూపం. ఈ ఉత్సవంలో భక్తి, జానపద కళలు, సంగీతం, నృత్యం, సంప్రదాయ ఆచారాలు ఒకే చోట కలుస్తాయి.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పిస్తారు. పాతబస్తీ వీధులు పండుగ వాతావరణంతో కళకళలాడుతాయి.

**అమ్మవారి ఆశీస్సులు**

బోనాల సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కుటుంబాలకు ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తారు.

"అమ్మవారి కృప ఉంటే అన్నీ శుభాలే" అనే విశ్వాసంతో భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

*లాల్ దర్వాజా బోనాలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహత్తరమైన ఆధ్యాత్మిక-సాంస్కృతిక ఉత్సవం.* ఇది కేవలం ఒక పండుగ కాదు; తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలకు, అమ్మవారిపై ప్రజలకున్న అచంచలమైన విశ్వాసానికి ప్రతీక.

అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం, ధర్మం వెల్లివిరియాలని కోరుకుందాం అని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట్‌లో ఘనంగా బోనాల పండుగ
## అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

- **భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసుల బందోబస్తు. నిరంజన్ గౌడ్ పీసీ, రాఘవేందర్ హెచ్ సి పర్యవేక్షణ**
- **భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ. కోరిన కోరికలు నెరవేరాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**గండిపేట్ ఆగస్టు 09(వుదయం)**



గండిపేట్‌లో ఈరోజు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు నెరవేరుతాయని, అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాల్లో సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తూ ప్రతి ఏడాది బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో సందడిగా మారాయి.భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరంజన్ గౌడ్ పీసీ, రాఘవేందర్ హెచ్ సి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భక్తుల రాకపోకలను పర్యవేక్షించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,

రద్దీని నియంత్రిస్తూ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలీసుల బందోబస్తుతో బోనాల పండుగ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.బోనాల పండుగ సందర్భంగా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని బోనాలను సమర్పించారు.

తమ కుటుంబాల క్షేమం, ఆరోగ్యం, సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ బోనాల పండుగలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోందని భక్తులు తెలిపారు. పండుగ సందర్భంగా గండిపేట్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పోలీసుల సమర్థవంతమైన బందోబస్తు, భక్తుల సహకారంతో బోనాల పండుగ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఘనంగా జరిగింది.

### చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో
## మంత్రి పొంగులేటి ప్రత్యేక పూజలు



- **ఆదం సంతోష్ కుమార్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి**



బోనాల పండుగ సందర్భంగా చిలకలగూడలోని కట్టమైసమ్మ ఆలయంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ ఆదం సంతోష్‌కుమార్‌తో కలిసి మంత్రి పొంగులేటి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి, సౌభాగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.బోనాల పండుగ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పూజారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### వర్షాలు సమృద్ధిగా కురవాలి
## రైతుల్లో కొత్త వెలుగులు నింపాలి





- **అమ్మవారి దయతో అన్నింట శుభం జరగాలి...**
- **ప్రజలంత సుభిక్షంగా ఉండాలి**
- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

వర్షాలు సమృద్ధిగా కురవాలని.. రైతుల్లో కొత్త వెలుగులు నింపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల గ్రామం లో ఆదివారం జరిగిన పోచమ్మ దేవాలయ ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో హరీష్‌రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ..ఆషాడ మాసం లో అమ్మవారి బోనాల కార్యక్రమం లో పాల్గొనడం సంతోషం గా ఉందన్నారు. అమ్మవారి దయతో ఈ యేటా వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి కృపతో అన్నింటా శుభం జరగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల కనకయ్య, రఘురాములు, మధు, గ్రామ పెద్దలు జక్కుల సిద్దిరాములు, మెడుదుల మల్లేశం, పెంబర్ల కనకయ్య, శ్రీనివాస్,

శంకరయ్య, నర్సిములు, కనకయ్య, జగన్, యాదగిరి, సత్యనారాయణ, గ్రామ యువత, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంగాపూర్‌లో ఘనంగా ఊరడమ్మ తల్లి బోనాల పండుగ

**ఝరాసంగం, ఆగస్టు 9 (వుదయం):**

ఝరాసంగం మండలం గంగాపూర్ గ్రామంలో గ్రామ దేవత ఊరడమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షహజన్ బీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఊరడమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పించి, ఆలయాన్ని పందిళ్లు, తోరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామ ప్రజలను చల్లగా చూడాలని, పంటలు



సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షహజన్ బీ, ఉపసర్పంచ్ ఇమ్రాన్ పటేల్, మాజీ సర్పంచ్ శివరాజ్ పాటిల్, మాజీ ఉపసర్పంచ్ ఉమేష్ పటేల్, మల్‌శెట్టి పాటిల్, సంజు పాటిల్, నబీ పటేల్, బాబూమియా పటేల్,

మల్లన్న పాటిల్, ప్రవీణ్ పాటిల్, బి. అంబేద్కర్, బి. బాబు, బి. యాదయ్య తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఉష
### వుదయం సాహిత్యం

# బంజారా యోధురాలి చరిత్ర

ఇటీవల సినీనటి రాధిక నటించిన తమిళ సినిమా "తాయి కిజావి" వుమన్ ఎంపవర్మెంట్ గురించిన చర్చను తాజాపరిచింది. రాజకీయ, ఆర్థిక, విముక్తి పోరాటాలు, ఉద్యమాలకు ముందు ఉండి నడిపిన మహిళల జాబితా చాలా పెద్దదే. వారి జీవితాలను నామమాత్రం రాసుకుంటూ పోతే కొన్ని వందల పేజీలు కావచ్చు. చరిత్రకెక్కని, రవి కూడా కాంచని ఓ బంజారా మహిళా యోధురాలి చరిత్రను కవి, రచయిత నవలాకారుడు అమ్గోత్ వెంకట్ పవర్ "పోర్యతార" (తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవల) నవలలో రాశారు. 2025 సంవత్సరానికి గాను తెలంగాణ సాహిత్య పరిషత్తు వారిచే ఉత్తమ నవలా పురస్కారాన్ని అందుకున్న ఈ తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవలపై చర్చించుకోవాల్సిన సందర్భం కూడా ఉన్నది. ప్రతి జాతికి తమ తమ ఆచార వ్యవహారాలకు సంబంధించి, జీవనానికి సంబంధించిన ధర్మం ఉంటుంది. బంజారాలకు కూడా ఓ ధర్మం ఉన్నది. ఆకలి కలిగిన వాళ్ల దగ్గరి కూడు లాక్కోకూడదని ధర్మాన్ని పాటిస్తూ విస్తారమైన పశుపోషణ నే వృత్తిగా సంచార జీవితాన్ని గడుపుతున్నారు. బంజారాలు ఎక్కడనుండి వచ్చారు అనే దానికన్నా ఎక్కడికి వచ్చారు... ఎలాంటి జీవనం కొనసాగిస్తున్నారనేది ముఖ్యం. బంజారాల ప్రధాన ఆస్తి పశువులు. మేలు జాతి పశువుల ఉత్పత్తి చేయటం, అమ్మటం, సుదూర ప్రాంతాల ప్రజలకు, ప్రభువులకు, భూస్వాములకు అమ్ముతూ ఉండేవారు. బలమైన పశుసంపద ఉండటం వలన కాలాను గుణంగా సంచార వ్యాపారం కూడా విస్తారంగా సాగించారు. ప్రపంచంలోని ఎడారి జాతుల ప్రధాన వృత్తి వ్యాపారమే. ఇక్కడి బంజారాలు కూడా ఉప్పు, పప్పులు మొదలగు వాటిని బెంగళూరు, మైసూరు, హైదరాబాద్ పట్టణాలకు తరలించి అమ్మేవారు. ఆయా పట్టణాలలో దొరికే వస్తువులను ధాన్యాలను మరోచోట ఎడ్లబండ్ల ద్వారా తీసుకెళ్లి వ్యాపారం నిర్వహించేవారు. ఈ నిర్వహణలో దోపిడిదొంగలు, భూస్వాములు, జాగీరు దారులు తమ పరిధిలలో విధించిన పన్నులు, నిజాం పాలనలో వేసే పన్నులు చాలా భారంగా ఉండేవి. హైదరాబాద్ నగర నిర్మాణం, వ్యాపార సంబంధాలలో బంజారాలది ముఖ్యమైన పాత్ర. నేటి బంజారాహిల్స్ నాటి బంజారాల నివాస ప్రాంతం. గోలకొండ చుట్టూ వారి నివాసం. సంచార వ్యాపారం తో పాటు స్థిర వాసాలు ఏర్పరచుకుని జీవించే వారు. లదణి (వలస) జీవితాలతో కొనసాగించే ఈ బంజారాలు బంజారాహిల్స్ ను, షాద్ నగర్ ను, శంషాబాద్ ను ఇలా ఎక్కడ పశుపోషణకు అవకాశం దొరుకుతుందో అక్కడికి వెళ్లేవారు. ప్రముఖులు హైదరాబాద్ జీవిత చరిత్ర రాస్తూ బంజారా జీవితాన్ని హైదరాబాద్ నగరం చుట్టూ లదణి లదణి లుగా మారుతున్న వైనాన్ని వివరంగా రాశారు . ఇట్లా అడవులు, పీఠభూములు, గుట్టలు, కొండల ప్రాంతాల్లో తాండాలుగా స్థిరనివాసం ఏర్పరచుకున్నారు . అట్లా వ్యవసాయం మీద ఆధారపడుతూ ప్రారంభమైన వీరి జీవనం ముఖ్యముగా వ్యవసాయాధార వలసదారులు వెళ్లినట్లుగా మైదానము, నల్లరేగడి భూములకు వెళ్ళలేదు. మెట్ట, వర్షాధార వ్యవసాయానికి పనికి వచ్చే భూములను మాత్రమే ఆశ్రయించారు. ఈ పరిణామ క్రమంలో ఎదుర్కొన్న కష్టాలను, నష్టాలను నైజాం, భూస్వాముల ఆగడాలను ఎదుర్కొంటూ జీవిస్తున్న సందర్భంలో ఓ బంజారా మహిళ జడ్చర్ల, తిమ్మాజీపేట, నాగర్ కర్నూల్, బిజినేపల్లి, కొత్తకోట, వనపర్తి గోపాల్ పేట్ చుట్టూ ఉన్నటువంటి తండాలకు నాయకత్వం వహించి విముక్తి పోరాటాలను చేసింది. ఆమె హీరిబాయి. హీరిబాయి జీవిత చరిత్రను చదవాలంటే బంజారా జీవితాలను వంద ఏండ్ల వెనక్కి వెళ్లి చదవాలి. అది జరగక పోతే తెలియని భాషను,అర్థం కాని భాషను విన్నట్లే. తాండా






రాజకీయ జీవనం ఆ తండా పంచుల నిర్ణయాల పై ఆధారపడుతుంది. తెగల ప్రజాస్వామ్య విలువలకు ఇది చక్కటి ఉదాహరణ. పెండ్లిలు, ఇతర తాండవాసులతో సంబంధాలు, వ్యాపార వ్యవహారాలు, నిర్వహణ అన్ని ఆ పంచులే చూసుకునేవారు. వీరి నాయకుడే "నాయక్". విలక్షణమైనటువంటి వివాహ ఆచారం, సంప్రదాయం,

సంస్కృతి వాడ్ బూడ్ (అనుభవ వృద్ధులు) సిక్వాడి (హితోపదేశం) ద్వారా తర్వాతి తరాలకి అందించేవారు లంబాడీ మనవు అనేది ఒక ప్రధాన అంశం ఒక తాండా మహిళా మరో తాండాయువకుడితో పెళ్లి అయిన తర్వాత తను పుట్టిన తండాకి తిరిగి వచ్చే దాఖలా ఉండదు. హీరి బాయి పెరిగిన తీరు, ఆమె ధీరత్వం చూసిన తల్లిదండ్రులు, తాండా వాసులు ఆమె భర్త గత్తరకు గుర్రైచనిపోతే తిరిగి తండాకు పిలుచుకొని ఆదరిస్తారు. 1899 1900 సంవత్సరం ఆ మరుసటి సంవత్సరాలు వరుసగా ఏడు సంవత్సరాల వరకు విపరీతమైన కరువు సంభవించడంతో పశువులకి, మనుషులకి తిండి దొరకక చౌడు, బంక మట్టి తింటున్న సందర్భాల్లో తమ ప్రాణాన్ని నిలుపుకోవడం కోసం హీరిబాయి గత్యంతరం లేక కొత్త అవతారం ఎత్తింది.

'సింహమైనా పులైన ఆకలి అయినప్పుడు వేటాడుతాయి ఆకలి వేసినప్పుడు ఇంత దూరమైన ప్రయాణిస్తాయి ఎంత బలంతో అయినా వేటాడుతాయి వాటి ఆకలికి రాత్రి పగలు అని తేడాలు ఉండవు ఈ ప్రక్రియను ధర్మాన్ని అనుసరిస్తూ వేటాడుతాయి తప్ప తిండి నిధుల కోసం వేటాడవు మనం కూడా మన ధర్మం ప్రకారం ఆకలిని జయించే యుద్ధం మొదలు పెట్టబోతున్నాం'

భూకేన్ బాటి ఖోరాణు
తరసేన్ పాణి పరాణు
భులాడి పద్మేజేన్ వాట్ వతాణు

> **బంజారా చారిత్రక నవలపై చర్చించుకోవాల్సిన సందర్భం కూడా ఉన్నది. ప్రతి జాతికి తమ తమ ఆచార వ్యవహారాలకు సంబంధించి, జీవనానికి సంబంధించిన ధర్మం ఉంటుంది. బంజారాలకు కూడా ఓ ధర్మం ఉన్నది. ఆకలి కలిగిన వాళ్ల దగ్గరి కూడు లాక్కోకూడదని ధర్మాన్ని పాటిస్తూ విస్తారమైన పశుపోషణ నే వృత్తిగా సంచార జీవితాన్ని గడుపుతున్నారు. బంజారాలు ఎక్కడనుండి వచ్చారు అనే దానికన్నా ఎక్కడికి వచ్చారు... ఎలాంటి జీవనం కొనసాగిస్తున్నారనేది ముఖ్యం. బంజారాల ప్రధాన ఆస్తి పశువులు.**

ఆస్రో మాంగజేన్ సహారో దేణు (ఆకలితో ఉన్న వాళ్లకు రొట్టెలు పెట్టాలి దూపగొన్న వారికి నీళ్లు ఇవ్వాలి. దారి తప్పిన వారికి దారి చూపాలి. ఆశ్రయం కోరి వచ్చిన వారికి సహకారం అందించాలి) 'ఆకలి చావుల నుండి బయటపడటానికి మన గోర్ ధరమ్ ను అనుసరించే ఆకలి దాడులు చేయబోతున్నాం. తిండి గింజల కోసం ఎంత దూరమైనా నడవపోతున్నాం.

ఎంత బలమైన వాడినైనా ఢీ కొట్టబోతున్నాం. పేదోడు కడుపు కొట్టి నిలువ చేయబడిన గడీలను, వ్యాపారస్తుల ఇండ్లు ఏవైనా సరే మన దెబ్బకు ఖాళీ కావాల్సిందే. మనోళ్ల కడుపు నిండాల్సిందే. పేదలను దోచుకుని గడీల నింపుకుంటున్న దొరల లారీలు మన కోడిపర్తి మిట్టనుండే బాదేపల్లి మార్కెట్ కు పోతున్నాయి ఇక్కడి నుండే మనం లూటీ మొదలు పెడుతున్నాం.' అంటూ తూర్పు దిక్కు వేలు చూపిస్తూ హీరీబాయి అన్నది. నిజాం పాలనలో వీరిపై విధించిన పన్నులను తగ్గించుట నుండి బంజారాలను దొంగలుగా చిత్రిస్తూ మోపిన క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ 1871 ఎత్తేసే దగ్గర నుండి తాండాల్లో నీటి కోసం రెండు సార్లు నాటి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి చేదుడు బావులను ఏర్పాటు చేసుకునే అంతవరకు హీరి బాయి చరిత్ర ను చారిత్రక నవల రూపంలో వెంకట్ పవార్ రాసేదాక ఈమె చరిత్ర సమాజానికి తెలియదు. 80 ఏండ్ల వయసులో ఒంటరిగా సెక్యూర్టీని ఛేదించుకొని ఢిల్లీలో ఇందిరా గాంధీని కలవడం ఒక పోరాటం. ఆమె నాయకత్వం వహించే తండాలను దోపిడీదారులుగా చిత్రించిన ఆధిపత్య చరిత్ర కారులను ఏకపక్షం చేస్తూ హీరిబాయి చరిత్రను 'పోర్యతార' నవలగా వెలుగులోకి తెచ్చిన ఆంగోత్ వెంకట్ పవార్కి అభినందనలు. ప్రచురించిన తెలంగాణ సాహిత్య అకాడమికి ప్రత్యేక సాహిత్యాభినందనలు. నిజాం పాలనలో వీరిపై విధించిన పన్నులను తగ్గించుట నుండి బంజారాలను దొంగలుగా చిత్రిస్తూ మోపిన క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ 1871 ఎత్తేసే దగ్గర నుండి తాండాల్లో నీటి కోసం రెండు సార్లు నాటి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి చేదుడు బావులను ఏర్పాటు చేసుకునే అంతవరకు హీరి బాయి చరిత్ర ను చారిత్రక నవల రూపంలో వెంకట్ పవార్ రాసేదాక ఈమె చరిత్ర సమాజానికి తెలియదు. 80 ఏండ్ల వయసులో ఒంటరిగా సెక్యూర్టీని ఛేదించుకొని ఢిల్లీలో ఇందిరా గాంధీని కలవడం ఒక పోరాటం.

## భారతీయ కవిత

### దాంపత్యం

నువ్వు నా వెంట...
నేను నీ వెనుక నడవడం
కాదు...
ఇద్దరం ఒక్కరమై
ఒకే బాటలో సాగడం
దాంపత్యం.

నీ నవ్వులో నా సంతోషాన్ని,
నా కన్నీటిలో నీ ఓదార్పును
చూసుకుంటూ...
మాటలకన్నా ముందే
మనసులను చదవడం
దాంపత్యం.

నీ కలలకు ఆసరా నేనై,
నా ఆశలకు తోడు నువ్వై...
గెలుపోటములలో
పందిరినల్లుకున్న తీగలా
ఒకరినొకరు పెనవేసికొని
సాగడం
దాంపత్యం.

అధికారం కాదు అవగాహన,
అనుమానం కాదు నమ్మకం,
పోటీ కాదు ప్రోత్సాహం,
బంధనం కాదు
స్వేచ్ఛనిచ్చే అనుబంధం
దాంపత్యం.

సాహచర్యంలో...
ఒకరి ఎదుగుదలకు మరొకర
మెట్లుగా మారుతూ....
బలహీనతలో బలమై
నిలవడమే
దాంపత్యపు పునాది.

కాలం మారినా...
మనసులు మారకుండా,
కష్టాలు ఎదురైనా...
కలిసి నడవడం
దాంపత్యం.

వృద్ధాప్యంలోనూ...
తొలి ప్రేమను
చూసుకుంటూ...
రెండు తనువులు,
ఒకే జీవమై సాగడం
దాంపత్యం.

సప్తపదితో మొదలై...
కడ శ్వాస దాకా
వీడని ప్రయాణమై,
ఆద్యంతం అందమైన
అనుబంధమే
దాంపత్యం.



డా. ఆవుల రేణుక
939826897

## మనిషిగా ఉందాం...





ముందు మనిషిగా
స్పందిద్దాం,
మనసారా యువత
గొంతు విందాం
వారి కలలు కేవలం
వారివి కావు,
భారత
భవిష్యత్తును
వెలిగించే జ్ఞాన
దీపాలు
వారి అడుగులు
అభివృద్ధి బాటలు,
వారి ఆలోచనలు
నవ భారత
స్వప్నాలు.
రాజకీయాలకు
అతీతంగా,
వారి ఆశయాలకు
అండగా నిలుద్దాం.
జంతర్ మంతర్
ఘటనలో
వినిపించిన
విద్యార్థుల స్వరం
ఒక హెచ్చరిక.
ఆ స్వరాన్ని
అణచడం కాదు,
అర్థం
చేసుకోవడమే
మనఅందరి
బాధ్యత.
ఈగలనుకుని
తోలితే
కందిరీగలై
కుట్టాయి
చీమ లనుకుని
నలిపారే
సుశిక్షిత సైనికీలై
నిలిచారు
నిరసనలోనూ
దేశభక్తి ఉంటుంది,
ప్రశ్నలోనూ
పురోగతి దాగి
ఉంటుంది.
యువతను గెలిపిస్తే
దేశం గెలుస్తుంది,
వారి భవిష్యత్తును
కాపాడితే భారత్
వెలుగుతుంది.
మన తరం ఇచ్చే
గొప్ప వారసత్వం
ఆస్తులు కాదు...
అవకాశాలు.
యువత కలలను
కాపాడే ప్రతి చేయి
భారత
భవిష్యత్తును
నిర్మించే పునాది.

# రాయలవారి స్వర్ణయుగం

తెలుగువారి చరిత్రలో స్వర్ణయుగం రాయల పాలనా కాలం. కృష్ణదేవరాయల గురించి మనం చర్చించుకునేటప్పుడు రాయలవారి గురించి నిజాలు మనకు తెలిసింది తక్కువ, కల్పితగాథలే ఎక్కువ అనిపిస్తుంది. అందుకని పరిశోధకుడు డాక్టర్ జి వి పూర్ణచందు గారు చారిత్రిక ఆధారాలు, సాహిత్యాధారాలు, ప్రజా బాహుళ్యంలో ప్రచారంలో ఉన్న కథలను అన్నింటిని క్రోడీకరించి - హేతుబద్ధంగా, తార్కికంగా వాటిని విశ్లేషించి నిగ్గుదేల్చి ఈ వ్యాసాలను రూపొందించారు. ఆముక్తమాల్యద వ్రాయాలనే సంకల్పాన్ని ఆంధ్ర మహావిష్ణువు రాయలవారికి కలిగించాడట. రాయలవారికి దర్శనం ఇచ్చిన ఆంధ్ర మహావిష్ణువు రూపాన్ని రాయల వారు వర్ణించారు. అసలు ఆంధ్ర మహావిష్ణువు ఎవరా అని ఇతర ప్రాంతాలు, ఇతర భాషలలో వెతికి బౌద్ధ జాతక కథల ఆధారంగా వారి ఉనికిని పరిశోధకుడు ధృవీకరించారు. చివరకు కౌండిన్య సుచంద్రుడి పుత్రుడైన ఆంధ్రమహావిష్ణువు కథలో కనిపించే ఆంధ్ర విష్ణువు అనే రాజు తెలుగుజాతి ప్రతిష్టను ఇనుమడింపజేసి, అనేక జాతులుగా జీవిస్తున్న ప్రజలందరినీ ఏకం చేసి భాష పరంగా తెలుగువారు గాను, జాతి పరంగా ఆంధ్రులుగాను తీర్చిదిద్దారని "రాయలవారు ఆరాధించిన ఆంధ్రవిష్ణు కథ" లో తెలియజేశారు.

> **తెలుగు నేలపైన వజ్రాల గనులు, హంపీ వజ్ర సంపద, రాయల కాలంలో వజ్రగనుల నిర్వహణ, గనులకు ప్రైవేటు యాజమాన్యాలు ,ప్రజల వజ్రాల అంగళ్లు ,కొండపల్లి వజ్రాలు, రాయల అనంతరం తెలుగు వజ్రాలు, గోల్కొండ వజ్రాల గనులు, తెలుగు వజ్రాలకే డిమాండుల గురించి చెబుతూ , "రాయలనాటి వజ్రాల పరిశ్రమ -అనంతర పరిణామాల" గురించి చేసిన అధ్యయనాన్ని ఆసక్తికరంగా వివరించారు. విజయ నగర కాలంలో వివిధ ప్రభుత్వాధికారులకు ,వారి విధులకు విధించిన పనులకు, ఇంకా అనేక పాలనాంశాలకు సంబంధించిన పరిభాషలో తెలుగుదనం పరిమళించడమే కాదు నేటి అవసరాలకు ఉపయోగిస్తుందని "రాయలనాటి పాలనా భాష" లో తెలియజేశారు.**






తెలుగు నేలపైన వజ్రాల గనులు, హంపీ వజ్ర సంపద, రాయల కాలంలో వజ్రగనుల నిర్వహణ, గనులకు ప్రైవేటు యాజమాన్యాలు ,ప్రజల వజ్రాల అంగళ్లు ,కొండపల్లి వజ్రాలు, రాయల అనంతరం తెలుగు వజ్రాలు, గోల్కొండ వజ్రాల గనులు, తెలుగు వజ్రాలకే డిమాండుల గురించి చెబుతూ , "రాయలనాటి వజ్రాల పరిశ్రమ అనంతర పరిణామాల" గురించి చేసిన అధ్యయనాన్ని ఆసక్తికరంగా వివరించారు. విజయ నగర కాలంలో వివిధ ప్రభుత్వాధికారులకు ,వారి విధులకు విధించిన పనులకు, ఇంకా అనేక పాలనాంశాలకు సంబంధించిన పరిభాషలో తెలుగుదనం పరిమళించడమే కాదు నేటి అవసరాలకు ఉపయోగిస్తుందని "రాయలనాటి పాలనా భాష" లో తెలియజేశారు. తిమ్మరుసు జననం, మంత్రివర్గంలో తిమ్మరుసు, రాయలవారి జననం, రాయలవారి ఇంటి పేరు, పట్టాభిషేకానికి ముందు, కృష్ణరాయల మరణం, తిరుమలలో తిమ్మరుసు శేష జీవితం గురించి చెబుతూ జనసామాన్యంలో ఉన్న మేక కళ్ళ కథలో నిజం లేదని తేల్చేశారు. కృష్ణరాయల అల్లుడు అళియ రామరాజు కుటుంబీకులమని, అనెగొంది రాజ్యాన్ని తమ పూర్వికులు నిలబెట్టారని, చంద్రగిరిలో విజయనగర సామ్రాజ్యం అంతరించిపోవడంతో నిజాం ప్రభుత్వం, బ్రిటిష్ ప్రభుత్వం తమనే విజయనగర సామ్రాజ్యవారసులుగా భావించారని రాజా అచ్యుతదేవరాయలు తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా అనెగొంది సంస్థానాధీశుడిని హంపీ విజయనగర వారసుడిగా గుర్తించి భరణం కొనసాగించారు. 1984 వరకు ఆ కుటుంబానికి భరణం కొనసాగింది. హంపి ఉత్సవాలకు ఆనాటి అనెగొంది పాలకుడు కృష్ణదేవరాయలను ప్రారంభకుడిగా ఆహ్వానించి గౌరవించారు. ఆయన తరువాత అచ్యుతదేవరాయలు తండ్రి స్థానంలో ప్రతిష్ఠుడయ్యారు. ఆయన ఆనెగొంది లోని తమ వంశవృక్షం ఫోటో కాపీని పరిశోధకుడికి అందజేయగా, దాని ఆధారంగా వారు తమ విశ్లేషణను కొనసాగించారు. "తిమ్మన పెద్దన రాయలు" వ్యాసంలో రాయలవారి దిగ్విజయ యాత్రకు సాహిత్యాధారాలు అనేకం ఉన్నాయని చెబుతూ నంది తిమ్మన్న గారి పారిజాతాపహరణం, అల్లసాని పెద్దన్న గారి మనుచరిత్ర, రాయలవారి ఆముక్తమాల్యద వాటి రచనా కాలాల ఆధారంగా ,వారి దండయాత్రల గురించి తెలియజేశారు.. మొత్తం మీద రాయలవారి గురించిన కథలు ఆయన చరిత్ర కలగాపులగం అయి, నిజాలు జల్లెడకు దొరక్కుండా పోతున్నాయి."మోహనాంగి" శ్రీకృష్ణదేవరాయలు కుమార్తె అనేందుకు ఒకే ఒక సాక్ష్యం ఆమె వ్రాసిన మారీచీ పరిణయం కావ్యం. ఆమె చిత్రకారిణి కూడా.

సంస్కృతాంధ్ర భాషల్లో మంచి ప్రవేశం కలిగిన కవయిత్రి. తర్వాత కాలంలో మోహనాంగి పేరు, ఉనికి, కావ్యం మీద వచ్చిన వివాదాలను వివరించారు. ఒకవేళ మోహనాంగి పేరుతో ఎవరైనా ఈ కావ్యాన్ని కూటసృష్టి చేశారనుకున్నా, అది కూడా 400 ఏళ్ల క్రితమే జరిగి ఉండాలి. ఇటీవలి కవి ఎవరో కల్పించినదిగా భావించడం కూడా తొందరపాటే అనిపిస్తుంది అంటారు. అలాగే 'కృష్ణరాయ విజయము' రాసిన కుమార ధూర్జటి (ధూర్జటి గారి మనవడు) రాయలు పెళ్లాడిన గజపతి కూతురు పేరు తుఖ్ఖాజి అని, రాయబాచకంలో జగన్మోహిని అని, టైలరు దొర రుచీదేవి అని ,కొన్ని విజయనగర కడితాల్లో లక్ష్మీదేవి అని, 'నరపతి రాజుల చరిత్రం' లో లూఖా దేవి అని, నాదిండ్ల గోప మంత్రి ప్రబోధ చంద్రోదయంలో సుభద్ర అని వ్రాశారు. ఇంతకు తుఖ్ఖాజీ అనే వ్యక్తి ఎవరు? అసలు వారు ఉన్నారా, లేదా? అన్న చర్చతో నిగ్గు తేల్చడానికి ఈ వ్యాసంలో ప్రయత్నించారు.

"ఆముక్తమాల్యద లో ఆహారం" అంటూ వేసవికాలం, వానాకాలం, శీతాకాలంలో తీసుకునే ఆహారాల గురించి తెలియజేయడంతో పాటు, రాయలవారికి ఇష్టమైన ఆహారం ఆహార పదార్థాల గురించి ఈ వ్యాసంలో వివరించడం బాగుంది. అలాగే ఆముక్తమాల్యదని చేత్తో పుచ్చుకుంటే 500 ఏళ్ల నాటి తెలుగు గ్రామాలలోని సాంఘిక జీవనం యావత్తు మన అరచేతిలోకి వస్తుంది అని ఇంకో వ్యాసంలో తెలియజేశారు. గతంలో వచ్చిన సాహిత్య చరిత్రలలో, జనసామాన్యంలో వాడుకలో ఉన్న అష్టదిగ్గజాల పేర్లను గురించి చర్చిస్తూ, ఆనాటి ఆస్థానంలో ఉన్న కవుల గురించి తెలియజేశారు "రాయలనాటి బెజవాడ, రాయల వారి తాంబూలాల కథ, రాయలవారి దసరా ఉత్సవాలు "అంటూ రాసిన వ్యాసాలలో మంచి సమాచారాన్ని సేకరించి, దానిని విశ్లేషిస్తూ పాఠకులకు అందజేసిన విధానం బాగుంది. ప్రామాణికమైన ఆధారాలతో శ్రీకృష్ణదేవరాయల చరిత్రను నిగ్గు దేల్చి వివరంగా రాసిన చారిత్రిక వ్యాసాల సంపుటి ఇది. సమాచారాత్మకంగా, విజ్ఞానాత్మకంగా రూపొందిన ఈ పుస్తకం చారిత్రిక పరిశోధకులకే కాదు. సాహిత్య పాఠకులు కూడా తప్పకుండా చదవదగినది.

# పిల్లల ఆరోగ్య రక్షణకు సమష్టి యజ్ఞం

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 10న దేశ వ్యాప్తంగా పాటించబడే ఒక సమగ్ర ఆరోగ్య యజ్ఞం. ఇది కేవలం ఒక ప్రభుత్వ ప్రణాళిక మాత్రమే కాదు, భవిష్యత్ తరాల ఆరోగ్య భద్రతకు పునాది వేసే జాతీయ సంకల్పం. పేగుల్లో నివసించే నులి పురుగులు లేదా పరాన్న జీవులు పిల్లల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ప్రధాన కారణాలలో ఒకటి. కలుషితమైన నీరు, పరిశుభ్రత లేని ఆహారం, మట్టి ద్వారా ఇవి పిల్లల శరీరంలోకి ప్రవేశించి, ఎదుగుదలకు కావలసిన పోషకాలను తినేసి బలహీనత, పోషకాహార లోపం, రక్తహీనత వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తాయి. గుండ్రటి పురుగులు, కొక్కెం పురుగులు, చాబుకపు పురుగులు భారతదేశంలో ఎక్కువగా కనిపించే రకాలుగా గుర్తించ బడ్డాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 బిలియన్ మంది నులి పురుగుల బారిన పడ్డారు. ఇందులో పెద్ద భాగం 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలే. భారతదేశంలో 2022 నాటికి సుమారు 22 కోట్ల పిల్లలు నులి పురుగుల ప్రభావానికి లోనవుతుండగా, వీరిలో 70 శాతం గ్రామీణ ప్రాంతాలవారే. ఈ సమస్యను నిర్మూలించేందుకు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2015లో జాతీయ స్థాయిలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదీల్లో రెండు విడతలుగా ఈ కార్యక్రమం అమలవుతోంది. ఆల్బెండజోల్ అనే సురక్షితమైన మందును పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచితంగా అందిస్తున్నారు. 2023లో మాత్రమే సుమారు 26.3 కోట్ల పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేయ బడ్డాయి, ఇది లక్ష్య జనాభాలో 94 శాతం కవరేజీగా గుర్తించబడింది.నులి పురుగుల వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల లోపం, బరువు తగ్గడం, మానసిక అలసట, పాఠశాల హాజరు తగ్గడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఒక అధ్యయనం ప్రకారం, నులి పురుగుల బారినపడ్డ పిల్లల్లో విద్యా సంబంధ పనితీరు సగటున 20 శాతం వరకు పడిపోతుంది. కాబట్టి ఈ సమస్యను నిర్మూలించడం విద్యా అభివృద్ధి, శారీరక-మానసిక శ్రేయస్సు, దేశ ఆర్థికాభివృద్ధి కోసం కీలకం.

నులి పురుగుల నిర్మూలనతో పాటు, నులి పురుగుల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధుల నియంత్రణకూ ఇది పరోక్షంగా తోడ్పడుతుంది. 1953లో ప్రారంభమైన జాతీయ మలేరియా నియంత్రణ కార్యక్రమం, తరువాతి దశల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన సమగ్ర దోమ నియంత్రణ చర్యలు ఈ దిశగా పెద్ద మార్పు తీసుకు వచ్చాయి. గత పది సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా మలేరియా కేసులు 85 శాతం తగ్గాయి. అయినప్పటికీ డెంగ్యూ, చికున్ గున్యా వంటి వైరల్ వ్యాధులు పట్టణాల్లో ఇంకా విస్తృతంగా ఉన్నాయి. కాబట్టి నీటి నిల్వలను తొలగించడం, మురుగు నీటి కాలువలు, గుంతలను శుభ్ర పరచడం, నిల్వ నీటిలో లార్వా తినే చేపలను వదలడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన రసాయనాలతో పిచికారీ చేయడం, దోమ తెరలు, దోమల నివారణ క్రీములు ఉపయోగించడం వంటి చర్యలు నిరంతరంగా అమలవ్వాలి.పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రతి కుటుంబం పరిశుభ్రతను జీవన విధానంగా అలవర్చు కోవాలి. తాగే నీరు మరిగించి తాగడం, ఆహారం తినే ముందు చేతులు



సబ్బుతో కడుక్కోవడం, పండ్లు-కూర గాయలను శుభ్రంగా కడిగి తినడం, కాలుష్యం ఉన్న ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవక పోవడం వంటి అలవాట్లు నులి పురుగుల వ్యాప్తిని గణనీయంగా తగ్గిస్తాయి. అదేవిధంగా ప్రతి వారం ఒకరోజు "డ్రై డే" పాటించి నిల్వ నీటిని తొలగించడం, పాఠశాలలు-కాలనీల్లో అవగాహన సమావేశాలు నిర్వహించడం, ఆరోగ్య సిబ్బందికి సహకరించడం ప్రజల బాధ్యత.

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఒక రోజు జరిపే కార్యక్రమం మాత్రమే కాదు; ఇది నిరంతర ఆరోగ్య పోరాటం. పిల్లల ఆరోగ్యం మెరుగు పడితేనే దేశం భవిష్యత్తు బలపడుతుంది. చిన్న పరిశుభ్రత అలవాట్లు, సకాలంలో ఔషధం వాడకం, సామూహిక సహకారం కలిసివస్తే నులి పురుగులను నిర్మూలించడం సాధ్యమే. ఆరోగ్యవంతమైన పిల్లలు, శక్తివంతమైన యువత తోనే దేశం నిజమైన అభివృద్ధి మార్గంలో పయనిస్తుంది.

## జీవిత పుస్తకం

జీవితమో నిండు పుస్తకం
కాలంతో పాటు పేజీలు
దొర్లుతాయి
ఒక పేజీలో సంతోష
అక్షరాలు
మరు పేజీలో బాధల
భావనలు
ఏ పేజీని వదిలించుకోలేవు
ఒక దాని వెంట మరోటి
వస్తూనే..
పలు రకాల అనుభూతుల్ని..
వద్దన్నా వడ్డించి వెళతాయి
ఆనందముందని త్వరగా
తిప్పేయకు
కష్టాలున్నాయని పేజీల్ని
వదిలేయకు !

పుస్తకంలో పేజీలున్నట్లే..
జీవితంలో
సంవత్సరాలున్నాయి
పేజీల్లో పేరాలున్నట్లే..
ఏడాదిలో మాసాలున్నాయి
పేరాల్లో వాక్యాలున్నట్లే...
మాసాల్లో వారాలున్నాయి
వాక్యాల్లో పదాలున్నట్లే..
వారాల్లో రోజులున్నాయి
పదాల్లో అక్షకాలున్నట్లే..
రోజుల్లో గంటలు,
నిమిషాలున్నాయి
ఇష్టమైన కష్టమైనా..
అన్నింటిని దాటాల్సిందే
అన్నీ అనుభవించాల్సిందే !

ఎవరి పుస్తకం వారిదే
ఎవరి జీవితం వారిదే
ఏ రెండు పుస్తకాలు ఒకేలా
ఉండవు
మన పుస్తకం మంచి కథను
నేర్పాలి
ప్రతి పుస్తకానికి ఆఖరి పేజీ
ఉంది
ప్రతి జీవితానికి చివరి గడియ
ఉంది
మన బతుకు పుస్తకం..
చినిపోయిన తర్వాత
కూడా..
పది మంది చదువుకునేలా
ఉండాలి
మన జీవితం పరులకు దారి
దీపం కావాలి
మరణించినా కూడా
సజీవంగా ఉండాలి !

మధుపాళీ
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## జార్ఖండ్ ప్రభుత్వానివి రాజకీయ కుట్రలు




- సంస్కరణల మంచ్ ఆగ్రహం
- ఆరో విడత చర్చల కొనసాగింపు
- జెఎల్‌కెఎం నేత జైరామ్ మహతో ఒక రోజు నిరాహార దీక్ష

**రాంచీ, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్) :**
నిరసన చేపడుతున్న విద్యార్థుల తరపున ప్రతినిధులతో ఆదివారం ఆరోవిడత చర్చలు చేపట్టేందుకు జార్ఖండ్ ప్రభుత్వం సిద్ధమైంది. మొదటి ఐదు విడతల చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న అభ్యర్థులతో తాజా చర్చలు జరుపుతున్నట్లు జార్ఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. చర్చలు విఫలం కావడంతో ఆందోళన చేపడుతున్న విద్యార్థులు జార్ఖండ్ ప్రభుత్వం "రాజకీయ కుట్రలు " పన్నుతోందని జెపిఎస్‌సిజెఎస్ఎస్‌సి - సంస్కరణల మంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనకారులైన విద్యార్థుల మధ్య విభజనలు సృష్టించడం, వారి ప్రధాన డిమాండ్ల నుండి ప్రజల దృష్టిని మళ్లించడం ఈ చర్య వెనుక రాజకీయ ఎత్తుగడ అని ఆ సంస్థ మండిపడింది.

తమ ఉద్యమాన్ని చీల్చేందుకు హేమంత్ సోరెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేత రవీంద్ర పాశ్వాన్ ఆరోపించారు. తమ డిమాండ్లు నెరవేరకపోతే ఆగస్టు 10న 'విధానసభ ముట్టడి' (ఘెరావ్) నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర అసంతృప్తిని కలిగించిందని అన్నారు. తమతో పాటు మరో 67 సంస్థల నుండి వినతిపత్రాలను స్వీకరించిందని అన్నారు. ప్రభుత్వం విభజనలు సృష్టించేందుకు ఈ విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్ఎస్‌యుఐ నుండి వినతిపత్రాలు ఎందుకు స్వీకరించారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వారి డిమాండ్లు తెలియదని, వారు నిరసనలో పాల్గొనలేదని అన్నారు. ప్రభుత్వం కుట్రలు పన్నుతూ.. ఈ ఉద్యమాన్ని 23 వర్గాలుగా చీల్చడానికి ప్రయత్నిస్తోంది" అని ఆయన ఆరోపించారు.

రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జెపిఎస్‌సిజెఎస్ఎస్‌సి అభ్యర్థులు నిరసనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ఆదివారం వైద్యుల బృందం నిరసనకారుల ఆరోగ్యాన్ని పరిశీలించింది. వారు ఆస్పత్రిలో చేరేందుకు నిరాకరించారని వైద్యుల బృందానికి నేతృత్వం వహిస్తున్న ఎపి సిన్హా తెలిపారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్‌సి) నిర్వహించిన పరీక్షలలోని అక్రమాలపై నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా, జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారీ మోర్చా (జెఎల్‌కెఎం) ఎమ్మెల్యే జైరామ్ మహతో ఆదివారం రాంచీలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు.

జార్ఖండ్‌లో పోటీ పరీక్షల నిర్వహణ, నియామక ప్రక్రియపై విద్యార్థులు, యువతలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రస్తావిస్తూ, రాంచీలో జెపిఎస్‌సిజెఎస్ఎస్‌సి అభ్యర్థులు చేస్తున్న నిరసన ఒక ప్రజా ఉద్యమంగా మారిందని జెడి(యు) జాతీయ ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ ఆదివారం పేర్కొన్నారు.

## మమతా బెనర్జీ కారుపై దాడి



- తృటిలో తప్పిన ప్రాణాపాయం
- ఈ ఘటనతో తమకెలాంటి సంబంధం లేదన్న బీజేపీ

**కలకత్తా, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కారుపై దాడి జరిగింది. కొంతమంది గుర్తుతెలియని దుండగులు ఇటుకలు, రాళ్లతో తన కారుపై దాడి చేశారని, ఈ దాడిలో తృటిలో ప్రాణపాయం తప్పిందని ఆమె తెలియజేశారు. ఈ దాడిని ఆ రాష్ట్ర బీజేపీ ఖండించింది. ఈ ఘటనతో తమకు ఎలాంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. పోలీసు కస్టడీలో మరణించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ పార్టీ కార్యకర్త ఇంటికి వెళ్తున్న హాలిసహర్‌లో మార్గంలో బెనర్జీ కారుపై ఒక్కసారిగా దాడులు జరిగాయి. నిరసనకారులు తృణమూల్ అధినేత్రి కారును చుట్టుముట్టి, దానిపై బురద పూసి, బూట్లు, నీళ్ల సీసాలు విసిరినట్లు జాతీయ మీడియాలు పేర్కొన్నాయి. అప్రమత్తమైన ఆమె భద్రతా సిబ్బంది ఆమెను సురక్షితంగా అక్కడి తరలించారు.

ఘటన తర్వాత బెనర్జీ విలేకరులతో మాట్లాడుతూ.. ఆ ఇటుకలు, రాళ్లు తనకే తగిలి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదని, పోలీసుల సమక్షంలోనే బయటి నుంచి వచ్చిన అసాంఘిక శక్తులు నా కారుపై రాళ్లు విసిరాయి. ఒకవేళ నా కారు కిటికీలు మూసి లేకపోయి ఉంటే, అవి నా తలకు తగిలి ఉండేవి, అప్పుడు నేను చనిపోయేదాన్ని కూడా. ఇలాంటి దాడిని నేను ఎప్పుడూ ఎదుర్కోలేదు. మమ్మల్ని రక్షించడానికి పోలీసులు ఏమీ చేయలేదు. వారు కేవలం బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.




## ప్రధాని మోడీ స్పందించాలి

- అయోధ్య విరాళాలపై మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
రామ్ మందిర్ విరాళాల చోరీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభలో స్పందించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం డిమాండ్ చేశారు. ప్రజల తరపున ప్రతిపక్షం ఈ అంశాన్ని లేవనెత్తిందని ఆయన పేర్కొన్నారు. ఆలయంలో భద్రపరిచిన నగలు, వెండి, బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువుల అపహరణపై సమగ్ర విచారణ జరగాలని ఖర్గే జాతీయ మీడియాతో మాట్లాడారు. ఆలయ వ్యవహారాలను నిర్వహించే ట్రస్ట్ పనితీరుపై ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు.

ఆలయం నుంచి ఆభరణాలు, వెండి, బంగారం, నగదు, బంగారు ఇటుకలు, బంగారు రామచరితమానస్ గ్రంథంతో సహా వివిధ విలువైన వస్తువులు కన్పించడంలేదని, వాటిని పరిరక్షించంలో ఆలయా ట్రస్ట్ విఫలమైందని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆయన ఆరోపించారు.

## డిప్యూటీ సీఎం కాన్వాయ్ ఢీకొని వ్యక్తి మృతి

- జమ్మూలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

**శ్రీనగర్, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
వేగంగా వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి కాన్వాయ్ లోని వాహనం ఢీకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ షాకింగ్ సంఘటన జమ్మూ నగర శివార్లలోని గంగ్యా ప్రాంతంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. జమ్మూ కాశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి కాన్వాయ్‌కి చెందిన



స్పీడింగ్ స్కార్పియో వాహనం ఢీకొని భరత్ కాపర్ (55) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన భరత్, స్థానిక షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి సుమారు 9:05 గంటల సమయంలో ఆయన సాధారణంగా రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఉప ముఖ్యమంత్రిని ఆయన నివాసం వద్ద దింపి తిరిగి వస్తుండగా ఈ వాహనం బాధితుడిని బలంగా ఢీకొట్టింది.

ప్రమాదం జరిగిన వెంటనే స్కార్పియో డ్రైవర్ కిందకు దిగి, తీవ్రంగా గాయపడిన భరత్‌ను తక్షణమే ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించాడు. అయితే ఆస్పత్రికి చేరుకునేసరికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## వీక్లీ ఆఫ్ కూడా ఇవ్వని యాజమాన్యం



**కర్నాటకలో యువతి ఆత్మహత్య**

**మైసూరు, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
కర్నాటకలోని మైసూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పై అధికారి వేధింపులు, మితిమీరిన పని ఒత్తిడిని తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. గత నాలుగు నెలలుగా తనకు కనీసం వారాంతపు సెలవు (వీక్లీ ఆఫ్) కూడా ఇవ్వకుండా వేధించారని ఆరోపిస్తూ ఆమె రాసిన ఆత్మహత్య లేఖ (సూసైడ్ నోట్) ప్రస్తుతం కలకలం రేపుతోంది. మైసూరులోని హినకల్ ప్రాంతంలో శనివారం ఈ ఘటన వెలుగుచూసింది.

వివరాల్లోకి వెళితే, నాగేశ్వరి (24) అనే యువతి టాటా సంస్థలో ప్రమోటర్‌గా విధులు నిర్వహిస్తోంది. నాలుగు నెలల క్రితం డాలీ అనే మహిళ సూపర్‌వైజర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, తనను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురిచేస్తున్నారని నాగేశ్వరి తన సూసైడ్ నోట్‌లో పేర్కొంది. గత నాలుగు నెలలుగా ఒక్క వీక్లీ ఆఫ్ కానీ, ఇతర సెలవులు కానీ మంజూరు చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల అత్యవసర పని నిమిత్తం ఒకరోజు సెలవు కోరగా, అందుకు నిరాకరించడమే కాకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆమె వాపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన నాగేశ్వరి బలవన్మరణానికి పాల్పడింది.

## రన్‌వేపై అదుపు తప్పిన విమానం



- సురక్షితంగా బయటపడ్డ పైలెట్లు

**పుణే, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
మహారాష్ట్ర పుణేలో ఆదివారం విమానం ప్రమాదం చోటుచేసుంది. మధ్యాహ్నం బారామతి విమానాశ్రయంలో ఒక ప్రైవేట్ కంపెనీకి చెందిన శిక్షణా విమానం కూలిపోయింది. విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లకు సురక్షితంగా బయటపడ్డారు. ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదని సంబంధిత అధికారులు తెలియజేశారు.

ప్రమాద ధాటికి స్వల్పంగా విమానం దెబ్బ తిన్నంది. ల్యాండ్ అయ్యే క్రమంలో ఒక్కసారిగా విమానం అదుపు తప్పి ప్రమా

**విమానంలో ఉన్న ఇద్దరు పైలట్లకు సురక్షితంగా బయటపడ్డారు. ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదని సంబంధింత అధికారులు తెలియజేశారు. ప్రమాద ధాటికి స్వల్పంగా విమానం దెబ్బ తిన్నంది.**

దానికి గురైందని అధికారులు తెలిపారు. బారామతి శిక్షణలో భాగంగా ఎయిర్‌ఫీల్డ్‌లో విమానం రన్‌వే పై అదుపుతప్పిందని, ప్రమాద సమయంలో విమానంలో కెప్టెన్ చిరాగ్ శశికాంత్ దోయిఫోడే, క్యాడెట్ అభిజీత్ జుంద్రే ఉన్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పూణే రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ మీడియాకు తెలిపారు.

## ఆటగాళ్లకు గాయాలపై బీసీసీఐ ఆందోళన

**ముంబయి, ఆగస్టు 09 (ఎ.ఎం.ఎస్):**
భారత క్రికెట్ జట్టులో పెరుగుతున్న ఆటగాళ్ల గాయాల సమస్యపై బీసీసీఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో, బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో ఆదివారం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్,




చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కూడా వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్ నిర్వహణ, పునరావాస పురోగతిపై చర్చించారు. ప్రస్తుతం ఆకాష్‌దీప్,

బుమ్రా, సాయి సుదర్శన్, హర్షిత్ రాణా, నితీష్‌కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్ వంటి పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో బాధపడుతున్నారు.

## ఫుట్ బాల్ స్టార్ మెస్సీకి పితృవియోగం

**బ్యూనస్ ఎయిర్స్, ఆగస్టు 09:**
అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సి తండ్రి హోర్‌హే మెస్సి శనివారం కన్నుమూశారు. 68 ఏళ్ల హోర్‌హే.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. మెస్సి ఫుట్‌బాల్‌లో పెద్ద స్టార్‌గా ఎదగడంలో హోర్‌హే కీలక పాత్ర పోషించారు. మెస్సికి ఏజెంట్‌గా ఉన్నారు. అతడి వ్యాపార వ్యవహారాలు చూసుకున్నారు. మెస్సి ప్రపంచకప్ ముగిసిన అనంతరం కొన్ని రోజులు తన తండ్రితో గడిపాడు. వారం కిందే ఇంటర్ మయామి క్లబ్‌తో చేరాడు. హోర్‌హే మృతికి దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్య సంతాపం తెలిపింది.



## యుద్ధం నుంచి వైదొలగాల్సిందే

- అమెరికా జాయింట్ చీఫ్స్ చైర్మెన్ కెయిన్ వ్యాఖ్యలు
- మంత్రులు, అధికారులకు మార్గనిర్దేశం
- ట్రంప్ సలహాదారులతో రహస్య భేటీలు
- వాస్తవాలను గ్రహించిన అగ్రరాజ్యం



**వాషింగ్టన్, ఆగస్టు 09 :**
ఇరాన్ యుద్ధం నుంచి అమెరికా వైదొలగాల్సిన అవసరం ఎంతో ఉన్నదని సాయుధ దళాలలో అత్యున్నత స్థాయి సైనికాధికారి అయిన జాయింట్ చీఫ్స్ చైర్మెన్ జనరల్ డాన్ కెయిన్ అభిప్రాయపడ్డారు. అమెరికా జాయింట్ చీఫ్స్ చైర్మెన్‌దేశాధ్యక్షుడికి, రక్షణ మంత్రికి సైనిక వ్యవహారాలలో సలహాదారుగా ఉంటారు. యుద్ధం నుంచి బయటికి రావాల్సిన అవసరాన్ని ఆయన గత కొన్ని వారాలుగా ట్రంప్ సన్నిహితులకు రహస్యంగా నొక్కి చెబుతున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సంఘర్షణలను తీవ్రతరం చేయడానికి అందుబాటులో ఉన్న సైనిక మార్గాలు వికటించే అవకాశం ఉన్నదని, కేవలం గగనతల దాడులతో ట్రంప్ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడం కష్టమని ఆయన తేల్చి చెబుతున్నారు. 'యుద్ధం నుంచి వైదొలిగే దారి కోసం కెయిన్ ఎదురు చూస్తున్నారు' అని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

యుద్ధం ఓ కూడలికి చేరుకున్నదని కెయిన్ మాత్రమే కాదు...అనేక మంది సీనియర్ అధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు. యుద్ధాన్ని తీవ్రతరం చేస్తే ఎదురయ్యే పరిస్థితులను గురించి, పోరు నుంచి బయటపడే మార్గం గురించి సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర కీలక క్యాబినెట్ మంత్రులతో కెయిన్ చర్చించారని తెలిసింది. భావసారూప్యత కలిగిన కొందరు కీలక సలహాదారులతో కూడా ఆయన ఏకాంతంగా భేటీ అయ్యారు. సైన్యంతో సంబంధం లేని ప్రత్యామ్నాయాలు, సైనిక దళాలకు ఉన్న పరిమితులు, వాటిలోని లోపాలను నిర్ధారించడమే ఈ సమావేశాల ఉద్దేశం. 'ఇది ప్రాణనష్టం జరగకుండా నివారించి సైన్యాన్ని రక్షించుకోవడానికి కెయిన్ చేస్తున్న ప్రయత్నం' అని ఓ అధికారి చెప్పారు. భూతల దాడులపై ట్రంప్ మొదటి నుంచీ విముఖత వ్యక్తం చేస్తూనే ఉన్నారు. వైమానిక దాడులను ఉధృతం చేయడం ద్వారా ఇరాన్‌ను లంగదీసుకోవచ్చునని ఆయన అనుకుంటున్నారు. అయితే అది జరిగే పని కాదని కెయిన్‌తో పాటు ట్రంప్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు అభిప్రాయపడుతున్నారు. అధ్యక్షుడి ఆలోచనలకు అనుగుణంగా ఇతర ప్రత్యామ్నాయాల కోసం వారు అన్వేషిస్తున్నారు.

కెయిన్ ఆలోచనలపై ఆయన ప్రతినిధి జోసెఫ్ హోల్‌స్టెన్‌ను ప్రశ్నించగా 'దేశాధ్యక్షుడు, మంత్రులు, ఇతర సీనియర్ నేతలతో కెయిన్ జరిపే రహస్య సంభాషణలను మేము బయటపెట్టం. అలాగే వాటిపై అవగాహన లేని వ్యక్తులు చేసే వ్యాఖ్యల పైనా స్పందించం' అని అన్నారు. కాగా ట్రంప్ జాతీయ భద్రతా బృందానికి కెయిన్ అందిస్తున్న సేవలను అధ్యక్షభవనం ప్రతినిధి ఒకరు ప్రశంసించారు. 'ఆయన ఎప్పుడూ కమాండర్ ఇన్‌చీఫ్‌కు కచ్చితమైన, నిస్పాక్షికమైన సమాచారాన్ని అందజేస్తారు. దాని ఆధారంగా దేశ భద్రతకు ఏది ఉత్తమమో పరిశీలించి దానిపై అంతిమ నిర్ణయం తీసుకుంటారు' అని చెప్పారు. ఈ నెలాఖరులో ఇరాన్‌పై తీవ్రమైన దాడులు జరపాలన్న ట్రంప్ ప్రణాళికపై కెయిన్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. భారీ సైనిక చర్యకు సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్)లోని కొన్ని విభాగాలు మాత్రమే సానుకూలంగా ఉన్నాయి. చివరికి మధ్యప్రాచ్యంలోని మిత్రదేశాలతో మాట్లాడిన తర్వాత ట్రంప్ వెనకడుగు వేశారు.

## ఆ మూడు దేశాలపై అమెరికా కక్షసాధింపు

- ఆ మేరకు ఓ చట్టానికి ఆమోదం
- ఆర్థిక సంస్థలపైనా ఆంక్షల విధింపు
- కీలక నిర్ణయం ఆలోచనలో ప్రధాన దేశాలు




**వాషింగ్టన్, ఆగస్టు 09 :**
రష్యా పైన, భారత్, చైనా సహా దాని నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ప్రధాన దేశాల పైన డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఉపక్రమించింది. దీనికి సంబంధించిన 'లిండ్సే ఓ గ్రహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026'ను సెనెట్ 86 11 ఓట్లతో ఆమోదించింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న ఐదు ప్రధాన దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై వంద శాతం సుంకాన్ని విధించేందుకు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ బిల్లు వీలు కల్పిస్తోంది. సెనెట్ ఆమోదం పొందిన ఈ బిల్లు ఈ నెల 31న సమావేశమయ్యే ప్రతినిధుల సభ ముందుకు వెళుతుంది. ప్రస్తుతం రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేస్తున్న దేశాలలో చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగరీ, స్లోవేకియా ప్రధానమైనవి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా పలువురు నేతలు, అధికారులు, ఆర్థిక సంస్థలపై కూడా ఆంక్షలు విధించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది.

కాగా ఇరాన్‌పై అమలులో ఉన్న ఆంక్షలను 2031 వరకూ కొనసాగించేందుకు సైతం ఈ బిల్లు వీలుకల్పిస్తోంది. ఇరాన్ ఇంధన రంగం లో పెట్టుబడులు పెట్టే కంపెనీలపై జరిమానాలు విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. బిల్లును ముందుకు తెచ్చిన రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రహమ్ ఈ నెల 11న మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బిల్లుకు ఆయన పేరును చేర్చారు. బిల్లుకు ప్రధాన పార్టీలు రెండూ మద్దతు తెలిపాయి. లిండ్సే గ్రహమ్ స్థానంలో సెనెట్‌లో నియమితురాలైన ఆయన సోదరి డార్లిన్ గ్రహమ్ మాట్లాడుతూ 'రష్యా ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్న ప్రధాన దేశాలు ఇప్పుడు కీలకమైన నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. అమెరికాతో వ్యాపారం చేయాలా లేక చౌకైన రష్యా ఇంధనాన్ని కొనాలా అనేది అవి నిర్ణయించుకోవాలి' అని చెప్పారు.

## బాల్‌రూమ్ నిర్మాణాన్ని ఆపేయండి



- ట్రంప్ ప్రభుత్వానికి ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఆదేశాలు
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానంటున్న అధ్యక్షుడు

**వాషింగ్టన్, ఆగస్టు 09 :**
అధ్యక్షభవనంలో కూల్చివేసిన తూర్పు వింగ్ ప్రాంతంలో 400 మిలియన్ డాలర్ల వ్యయంతో చేపట్టిన బాల్‌రూమ్ నిర్మాణ పనులను నిలిపివేయాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాన్ని అమెరికా ఫెడరల్ అప్పీల్స్ కోర్టు ఆదేశించింది. దీంతో అధ్యక్ష అధికారా లకు పరీక్షగా నిలిచిన ఈ కేసులో ట్రంప్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. 'ప్రతి అధ్యక్షుడు ఓ తాత్కాలిక టెనెంటే. ఆయన అధ్యక్ష భవనానికి యజమాని కాదు. కాంగ్రెస్ అనుమతి తీసుకోకుండా దానికి ఆయన కొత్త రూపు ఇవ్వలేరు' అని వాషింగ్టన్‌లో కొలంబియా సర్క్యూట్ జిల్లాకు చెందిన అప్పీల్స్ కోర్టు 21 మెజారిటీతో తీర్పు చెప్పింది. కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ ప్రభుత్వం ఈస్ట్ వింగ్‌ను కూల్చేసి 90 వేల చదరపు అడుగుల బాల్‌రూమ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. దీనిని వ్యతిరేకిస్తూ 'నేషనల్ ట్రస్ట్ ఫర్ హిస్టారిక్ ప్రిజర్వేషన్' అనే సంస్థ గత సంవత్సరం కోర్టును ఆశ్రయించగా ప్రిలిమినరీ ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది. అప్పీల్స్ కోర్టు తన తాజా తీర్పులో దానిని సమర్ధించింది. 'భారీ బాల్‌రూమ్‌ను నిర్మించాలా వద్దా అనేది కాంగ్రెస్ నిర్ణయించాల్సిన విషయం. అంతేకానీ అది కార్యనిర్వాహకవర్గం యొక్క సొంత నిర్ణయానికి సంబంధించింది కాదు' అని అప్పీల్స్ కోర్టు ప్యానల్‌లోని మెజారిటీ సభ్యులు తమ తీర్పులో రాశారు. సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా తీర్పు అమలును 14 రోజుల పాటు నిలిపివేశారు. అప్పీల్స్ కోర్టు తీర్పును దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుపట్టారు. ఆ నిర్ణయం భయంకరమైనదని, రాజకీయ ప్రేరేపితమైనదని విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. బాల్‌రూమ్ అనేది సైనిక కేంద్రమని చెప్పుకొచ్చారు. ఈ అన్యాయమైన తీర్పును రద్దు చేయాలని ఆయన సుప్రీంకోర్టును కోరారు. కాగా అమెరికా ప్రజలకు ఇది ఓ గొప్ప రోజు అని నేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు బ్రెంట్ లెగ్స్ అన్నారు.

## బ్రెజిల్‌లో ఘోర విమాన ప్రమాదం

రియో డి జెనీరో, ఆగస్టు 09: బ్రెజిల్‌లోని రియో డి జెనీరో టిజుకా జాతీయ ఉద్యానవనంలో హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కొలంబియన్ మహిళా పర్యాటకులతో పాటు పైలట్ మరణించారు. బాలిక 15వ పుట్టినరోజు వేడుకల కోసం వచ్చిన కుటుంబంలో ముగ్గురు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో మృతదేహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై బ్రెజిల్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

## వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

**ఆదివాసీ భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: మంత్రి సీతక్క**

**అశ్వారావుపేటలో ఘనంగా కొమరం భీమ్ విగ్రహావిష్కరణ**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)**

కొమరం భీమ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, జీవన విధానమే వారి అస్తిత్వమని, వాటిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఆదివాసీ ప్రజలతో కలిసి మంత్రి సీతక్క భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అశ్వారావుపేట ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులను అభినందించారు. ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు. కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాలు ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం సాగిన ఉద్యమాలకు నిదర్శనమన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని, తమకు న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు. అడవిపై హక్కులు, భూమిపై హక్కులు, విద్య, ఉపాధి, గృహాలు వంటి ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.ఆదివాసీ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు, చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా ఓపికగా వారి వినతులను విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులు మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.కొమరం భీమ్ "జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాటం చేశారని గుర్తుచేసిన మంత్రి.. ఆయన పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మన భాష, మన వేషం, మన సంస్కృతి, మన సంప్రదాయాలే మన గుర్తింపు అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమ మూలాలను, మాతృభాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మరచిపోకూడదని సూచిం చారు. కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఆదివాసీ విద్యాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధిని పెంపొందించేందుకు అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు.ఆదివాసీ యువత ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం, గిరిజన విద్యా వికాస భవనం ఏర్పాటుకు అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.

**ఆదివాసీ సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత: కలెక్టర్ అంకిత్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్క-సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆదివాసీ ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం, ఐక్యతను పెంపొందించడంతో పాటు హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో**

**భారీ ర్యాలీ, జెండా ఆవిష్కరణ, సభ బహుమతుల ప్రధానోత్సవం**

**పాల్గొన్న ఎం ఎల్ ఏ కుంభం, ప్రభుత్వ విప్ బీర్ల, ఎంపీ చామల**



**యాదాద్రి భువనగిరి, 09/08/2026**

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ గారి విగ్రహానికి పూల మాలలు వేసి డోలు వాయిద్యాలతో బాణాసంచా పేలుళ్లతో గంజి ప్రాంతంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ చేసి సభ నిర్వహించి గత వారం రోజులుగా వివిధ విభాగాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానోత్సవం చేయడం జరిగింది.ఈ కార్యక్రమాలలో అతిథులుగా భువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు,ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు , డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య గారు, భువనగిరి ఎంపీ, పీసీసీ మీడియా విభాగం అధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గార్లు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక అయిన యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా వారోత్సవాలు నిర్వహిస్తూ యువతకు క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సందేశంతో 2 కే రన్, శ్రమదానం, ఈరోజు ఇంత పెద్ద ఎత్తున యువతతో కలిసి భారీ ర్యాలీ జండా ఆవిష్కరణ బహుమతుల ప్రధానోత్సవం సభ నిర్వహించడం అభినందనీయమని, మంగ ప్రవీణ్ ను అందరం కలిసి ప్రోత్సహించి ఎల్లవేళలా యువజన కాంగ్రెస్కు అందుబాటులో ఉంటామని అన్నారు. దేశంలో అధిక శాతం ఉన్న యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు అని, ఇటీవల ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దీనికి నిదర్శనమని దేశ యువత రాహుల్ గాంధీ వైపు చూస్తున్నారని దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు యువజన కాంగ్రెస్ శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ కైసర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేస్ చిస్తి, సీనియర్ నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎలిమినేటి సురేష్, పుట్ట గిరీష్, జిల్లా నాయకులు ఏడుమెకల మహేష్, బత్తిని వరుణ్, కత్తి సాయిప్రసాద్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు బట్టు సందీప్, భూషపాక శివతేజ, పోత్నక్ సన్నీ, ఎండి జలీల్,రేగు రమేష్, నాయకులు చిక్కుల వెంకటేష్, ఎల్లంల జంగయ్య, ఎనగండ్ల సుధాకర్, సుర్పంగ చందు , బొల్లెపల్లి వినయ్, భువనగిరి ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యువతి యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కొమరం భీమ్ ఆశయాలే స్ఫూర్తి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**జయశంకర్ భూపాలపల్లి ఆగస్టు 09(వుదయం జిల్లా ప్రతినిధి):**

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కొమరం భీమ్ ఆశయాలే స్ఫూర్తి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొమరం భీమ్ విగ్రహానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్ జంగల్-జమీన్ పరిరక్షణ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఆదివాసీ ప్రజల భూమి, అటవీ సంపదపై వారికి హక్కు ఉండాలని, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడాలని కొమరం భీమ్ పోరాటం చేశారని గుర్తు చేశారు.కొమరం భీమ్ ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ సోదరుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆదివాసీ కుటుంబాల అభివృద్ధి, విద్య, ఉపాధి, సంక్షేమం మరియు వారికి రాజ్యాంగబద్ధంగా లభిస్తున్న హక్కులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వారిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ఆదివాసీ సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే విద్య, ఉద్యోగ, రాజకీయ మరియు సామాజిక రంగాల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొమరం భీమ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని నేటి తరం ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివాసీ యువత, ఆదివాసీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తగిన గుర్తింపు: మేరు సంఘం రాష్ట్ర చైర్మన్ సంగ వెంకట్రాజం

**– మేరు సంఘం రాష్ట్ర చైర్మన్ సంగ వెంకట్రాజంకు ఘన సన్మానం**



**వరంగల్ టౌన్, ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి) :**

సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేరు సంఘం రాష్ట్ర చైర్మన్ సంగ వెంకట్రాజంతో పాటు ప్రముఖ మహిళా నాయకురాళ్లను ఘనంగా సన్మానించారు.సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన సలహాదారు కొమ్మినేని భూపాల్ రావు పటేల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వరంగల్ జిల్లా అధ్యక్షుడు యాతం శెట్టి రాజేందర్, గౌరవ అధ్యక్షుడు సామల సుధాకర్, ప్రధాన కార్యదర్శి, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చ వినోద్ కుమార్, నాయకులు సుధీర్, మురళీ, రాయబారపు సంతోష్ తదితరులు చైర్మన్ సంగ వెంకట్రాజంతో పాటు మహిళా నాయకురాళ్లు పబ్బ ఉమా రాజేందర్ గౌడ్, రేపల్లె స్వర్ణ, ఐత స్వరూప, జోడుముంతల సుమలతలను శాలువాలు కప్పి, పూలబోకేలు అందించి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత, మేరు సంఘం రాష్ట్ర చైర్మన్ సంగ వెంకట్రాజం మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలకు పెద్దపీట వేస్తోందని, సామాజిక న్యాయం చేకూరేలా ప్రతి కులానికి చైర్మన్ పదవులు ఇచ్చి గౌరవిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని పేర్కొన్నారు.మహిళా జనాభా దామాషా ప్రకారం పదవులు, నిధులు కేటాయించాలిసన్మానం అందుకున్న మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి చైర్మన్ పదవుల్లో మహిళలకు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం ప్రత్యేక నిధులు కేటాయించి మహిళా సాధికారతకు కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేషబోయిన సాంబయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన సలహాదారు కొమ్మినేని భూపాల్ రావు పటేల్, లంబాడా న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దేవా నాయక్, ములుగు జిల్లా అధ్యక్షుడు బాణాల ప్రభాకర్ రావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు కందకట్ల కృష్ణతో పాటు వివిధ సామాజిక, మహిళా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు




**భూపాలపల్లి ఆగస్టు 9 వుదయం ప్రతినిధి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా వివిధ ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇట్టి ర్యాలీలో పాల్గొన్న సంఘాలు తుడుం దెబ్బ నాయక పోడ్ సేవా సంఘం,తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసి సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూమహాదేవపూర్ కేంద్రంగా ఇటీడీఏ ఏర్పాటు చేయాలనికాటారం కేంద్రంగా ఎస్టీ నియోజకవర్గ ఏర్పాటు చేయాలని పలిమెల మండలాన్ని ఆదివాసి మండలంగా ఒకటించాలనిబోర్ల గూడెం కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేసి ఆదివాసి మండలంగా ప్రకటించాలని ఫిఫ్త్ షెడ్యూల్ హక్కులను వర్తింప చేయాలని ఫారెస్ట్ శాఖ దాడులు ఆపాలి. మరియు పోడుభూములకు పోడుపట్టాలి ఇవ్వాలనిఆర్ ఓ ఎస్ ఆర్ పట్టాలకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని నాయకపోడ్ తెగకు ప్రత్యేక నెంబర్ కేటాయించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అత్యంత వెనుకబడిన పీవీ టిజి తెగల జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజనకు పూనుకుంటున్న నేపథ్యంలో కాటారం కేంద్రంగా ఎస్టీ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని. పలిమెల మండలాన్ని ఆదివాసి మండలాలుగా ప్రకటించాలని మహాముత్తారం మండలంలోని బోర్ల గూడెం కేంద్రంగా మండల ఏర్పాటు చేసి ఆదివాసి మండలంగా ప్రకటించాలని ఫిఫ్త్ షెడ్యూల్ హక్కులను వర్తింపచేయాలని, ఆర్వో ఎఫ్ ఆర్ పట్టాలకు బ్యాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ ముఖ్య కూడలి నుండి బస్టాండ్ వద్ద కొమరం భీం విగ్రహం వరకు వందలాది మందితో ఆదివాసి తెగలు అయినటువంటి కోయ, నాయక పోడ్ సెంచు, వలసదివాసిల కళా సంస్కృతుల తోటి కళారూపాలతోటి నృత్యాలు చేస్తూ ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల నాయకులు మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి, కాటారం ,మహదేవూరు, పలిమల, మహాముత్తారం, మలహర్ మండలాలలో అత్యధికగంగ నాకపోడులు కోయ చెంచు వలసదివాసులు నివసిస్తున్నారని అన్నారు, ఇంత పెద్ద మొత్తంలో జనాభా ఉన్నప్పటికీ వీరి అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేసే క్రమంలో గోదావరిని హద్దుగా చేసుకొని తెలంగాణ గడ్డకు సంబంధించిన సిరివంచ ప్రాంతాన్ని వేరుచేసి కుట్రపూరితంగా ఈ ప్రాంత ఆదివాసి హక్కులను అప్పటి పాలకులు హరించారని మండిపడ్డారు, అప్పటి నుంచి మొదలుకుంటే ఆ తర్వాత 1970 దశకంలో ఐటీడీఏలు ఏర్పాటు చేసే క్రమంలో కూడా తప్పుడు సమాచారాలు ఇచ్చి ఆదివాసులకు వ్యతిరేకంగా వారి అభివృద్ధికి సంబంధించిన గిరిజన అభివృద్ధి సంస్థలను కాకుండా అడ్డుపడ్డారని అన్నారు. అదేవిధంగా మాదాపూర్ మండల కేంద్రంగా మాడ ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాట తర్వాత జిల్లాల పునర్విభజన పేరుతోటి ములుగు ,భూపాలపల్లి ప్రాంతాన్ని కలుపుకొని ఉమ్మడి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటుచేసి ఒకే ప్రాంతంలో రెండు ఆదివాసులకు సంబంధించిన అభివృద్ధికి సంబంధించిన సంస్థలు ఉండవని అని చెప్పి మాడను ఎత్తివేయడం జరిగింది. అనేక సందర్భాల్లో పోరాటాలు చేసినప్పటికీ పునరుద్ధరిస్తామని ఇప్పటివరకు ఆ దిశగా పాలకుల ఆలోచన చేయటం లేదని వారు ప్రశ్నించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలి అని వారు కోరారు, అదేవిధంగా ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామన్న హామీని అమలు చేయాలని పోడు పట్టాలు ఇచ్చినటువంటి వాటికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాయకపోడు తెగకు ప్రత్యేక నెంబర్ కేటాయించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అత్యంత వెనుకబడిన టీవీ టీజీ తెగల జాబితాలో చేర్చాలని అన్నారు వలసాదివాసులు గత 25 సంవత్సరాల క్రితం చతిస్గడ్ రాష్ట్రంలో సవాభించడం పేరుతోటి దాడులు ధమనకాండలు జరుగుతున్నాయని అన్నారు. ఈ భారత దేశంలో 75 తెగలు ఉంటే అందులో ఆదిమ తెగలకు సంబంధించినటువంటి జాతే ఈ గుత్తి కోయ అని అన్నారు. అందుకనే ఈ ప్రాంత ఆదివాసులుగా ఆదివాసి సంఘాల నాయకులుగా వారికి ఎస్టీ సర్టిఫికెట్ ఇచ్చి అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు ఎస్టీ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు చదువు నోచుకోలేక చదువు విరమిస్తున్నటువంటి పరిస్థితి నెలకొందని వారు గుర్తు చేశారు.

# బాలాజీ నగర్ గిరిజన వసతి గృహంలో ఘనంగా ఆదివాసి దినోత్సవ వేడుకలు



**కోదాడ ఆగస్టు 9(వుదయం)**

కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్ ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించారు. వార్డెన్ పద్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్, రాష్ట్ర నాయకుడు రాజు నాయక్ పాల్గొని గిరిజన పోరాటయోధుడు కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గిరిజనుల చరిత్ర, సంస్కృతి, హక్కుల పరిరక్షణపై వారు విద్యార్థినులకు అవగాహన కల్పించారు.విద్యార్థినులు కొమరం భీం త్యాగాలను స్మరించుకుంటూ గిరిజన సంప్రదాయాలను ప్రతిబింబించే వివిధ వేషధారణలతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించగా, అవి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో గిరిజన నాయకులు గోపి రాథోడ్, నిఖిల్ నాయక్, ధారావత్ వెంకటేశ్వర్లు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సింగరేణి జిఎం కార్యాలయంలో ఏరియా స్ట్రక్చర్ కమిటీ సమావేశం



**సత్తుపల్లి, ఆగస్టు 09 ( వుదయం ప్రతినిధి )**

సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటా చారి అధ్యక్షతన స్ట్రక్చర్ సమావేశం జి.ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు.సత్తుపల్లి ఏరియా పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏరియా అధికారులతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఐ.ఎన్.టి.యూ.సీ నాయకులు కోరారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా సత్తుపల్లి జి.ఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఏర్పాటు, ఉద్యోగులకు రెయిన్ కోట్లు పంపిణీ, కిష్టారం ఓసిలో అదనంగా రెస్ట్ షెల్టర్, వాష్ రూమ్ ల ఏర్పాటు, డిస్పెన్సరీ ఆధునికరణ, స్టాఫ్ పెంపు, ఆర్వో ప్లాంట్, పర్మనెంట్ టెలిఫోన్ ఏర్పాటు చేయాలని, జే.వి.ఆర్ సి.హెచ్.పి లో డస్ట్ నియంత్రణ, క్యాంటీన్ మెరుగుపరచుట, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. అదేవిధంగా గతంలో జరిగే స్ట్రక్చర్ మీటింగ్ అంశాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జనరల్ మేనేజర్ సరికొండ వెంకటా చారి మాట్లాడుతూ ప్రాతినిధ్య సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం, బుధవారం, శుక్రవారం ఫైనాన్స్, క్వాలిటీ, ఐటి, సర్వే డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డి లు, మంగళవారం, గురువారం, శనివారం పర్సనల్, ఐ.ఇ.డి, సెక్యూరిటీ, వివిధ డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డి లు అందుబాటులో ఉండే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని , ఇప్పటివరకు ఏ విధంగా ఉత్పత్తి లక్ష్యసాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరించి సంస్థ పురోఅభివృద్ధిలో తోడ్పడాలని జనరల్ మేనేజర్ సరికొండ వెంకటా చారి కోరారు.ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు బొల్లం శ్రీనివాస్ ( ఎస్ ఓ టు జి.ఎం ), ప్రహ్లాద్ (ప్రాజెక్ట్ ఆఫీసర్ , జే.వి.ఆర్ ఓసి ), సునీల్ వర్మ (ప్రాజెక్ట్ ఆఫీసర్, కిష్టారం ఓసి), శ్రీనివాస్ రావు ( ప్రాజెక్ట్ ఇంజినీర్), సోమశేఖర్ (ఏరియా ఇంజనీర్ ), తిరుపతి ( పర్సనల్ ఆఫీసర్ ), సాయి నాథ్ ( డీ.జీ.ఎం , జే.వి.ఆర్ సి.హెచ్.పి ), ప్రదీప్ , రవి కుమార్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు , సివిల్, ఐ.ఇ.డి డిపార్ట్మెంట్ ల అధికారులు, సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఇతర డిపార్ట్మెంట్ల అధికారులు , ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘం నాయకులు కోటేశ్వరరావు, క్రాంతి కుమార్, నాగ ప్రకాష్ పాల్గొన్నారు.

# ఉప్పుగూడలో శ్రీ మహంకాళి అమ్మనీ సందర్శించిన తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి ఆగస్టు 09**

ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా ఓల్డ్ సిటీలోని ఉప్పుగూడలో శ్రీ మహంకాళి అమ్మవారికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నూతన పట్టువస్త్రాలు రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా సమర్పించారు. ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ, మరియు వేద అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను అందజేసిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు." ఉప్పుగూడ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. గత సంవత్సరం కూడా ఉప్పుగూడ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి వానలు సంవృద్ధిగా పడాలని, ప్రజలను సుభిక్షంగా ఉండేలా చూడాలని వేడుకోవాడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం వానలు సంవృద్ధి గా పడాలని, పంటలు పుష్కలంగా పండాల



ని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికి దక్కలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ అలంపల్లి నర్సింహా, ఆలయ కమిటీ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి నూతన పట్టువస్త్రాలు రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా సమర్పించారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఎలినినో ప్రభావంతో నీటి సంక్షోభం తీవ్రం కానుంది...

**వరి సాగు మానుకొని ప్రత్యామ్నాయ పంటలను పండించాలి...**

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**



**జగిత్యాల ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)**

ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో ఎలినినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగును విస్తరించకుండా తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు దీనివల్ల చెరువుల్లో నీటి నిల్వలు భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,010 చెరువులు ఉండగా ప్రస్తుతం కేవలం 268 చెరువులు మాత్రమే నిండి ఉన్నాయని ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గిందని ఆగస్టు సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భ జలాలు ఇంకా దిగజారే అవకాశం ఉందన్నారు. తాగునీటికే ప్రాధాన్యత... వరి సాగుపై అప్రమత్తంగా ఉండాలిశ్రీ రాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున వరి సాగుకు పూర్తి స్థాయిలో నీటి సరఫరాపై ఆధారపడలేమని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం వరి సాగు విస్తీర్ణాన్ని పెంచడం పూర్తిగా నివారించాలని సూచించారు ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించండివ్యవసాయ శాఖ సూచించిన కందులు పెసర మినుములు ఆముదం జొన్న సజ్జలు తగిన తేమ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరం కలిగిన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక విత్తనాల లభ్యత సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ ఈ ప్రకటనలో సూచించారు.

## కొడుకును గొడ్డలితో నరికి చంపేందుకు యత్నం

**తండ్రి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**కోనరావుపేట మండలంలో ఘటన**

**సిరిసిల్ల / కోనరావుపేట, ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి) :**

కొడుకు వేధింపులు భరించలేక తండ్రే అతనిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో నిందితుడైన గుడిపేట రాఘవులు అలియాస్ రాఘవరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రవీందర్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. రాఘవరెడ్డి కుమారు డు రాజేందర్ ఎలాంటి ఉపాధి చేయ కుండా ఇంట్లోనే ఉంటూ తరచూ తండ్రి తో గొడవపడటం, వేధించడం, అప్పుల విషయమై వివాదాలు సృష్టించడం చేసేవాడు ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఫ్యాన్ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సమయంలో రాజేందర్ తండ్రిపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన రాఘవరెడ్డి, అదే రోజు సాయంత్రం ఇంట్లో నిద్రిస్తున్న రాజేందర్‌పై గొడ్డలితో తల, ముఖంపై దాడి చేయడమగా




తీవ్రంగా గాయపడిన రాజేందర్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసిన కోనరావుపేట ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, పోలీసు సిబ్బందిని చందుర్తి సీఐ రవీందర్ అభినందించారు.

## అంతర్ జిల్లా మోటార్ సైకిల్ దొంగల ముఠా అరెస్ట్: 4 బైక్‌లు స్వాధీనం

**ఐదుగురు నిందితుల అరెస్ట్ – దొంగిలించిన 3 బైక్‌లు,**

**నేరానికి ఉపయోగించిన మరో బైక్ స్వాధీనం**



**కామారెడ్డి, ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి):**

సదాశివనగర్ గ్రామానికి చెందిన హనుమంత్ రాజు తన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ నం. TS-08-HY-8176ను 24.07.2026 రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేయగా, మరుసటి రోజు మోటార్ సైకిల్ కనిపించకుండా పోయింది. దీంతో బాధితుడు సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి డీఎస్పీ పర్యవేక్షణలో సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సదాశివనగర్ ఎస్ఐ పుష్పరాజ్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు తదితర అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.కేసు దర్యాప్తులో A1 షేక్ ఇమ్రాన్, A2 అద్నాన్ ఖాన్, A4 సయ్యద్ జుబేర్, A5 షేక్ అయాన్, A6 సచిన్ విశ్వనాథ్ ఖండేవాల్ కలిసి ఒక ముఠాగా ఏర్పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలిస్తున్నట్లు వెల్లడైంది. A1 ఇమ్రాన్, A2 అద్నాన్ ఖాన్‌లు A2కు చెందిన TVS Rider TG-16-0674పై తిరుగుతూ హోటళ్లు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను గుర్తించేవారు. అనుకూలమైన వాహనాలను గుర్తించిన అనంతరం వాటిని దొంగిలించి A4, A5, A6లకు తక్కువ ధరలకు విక్రయించేవారు. దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేసిన A4, A5, A6లు వాటి అసలు నంబర్ ప్లేట్లను తొలగించి నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చుకుని పోలీసులకు అనుమానం రాకుండా వినియోగించేవారు. అనంతరం వాటిని అధిక ధరకు విక్రయించి అక్రమంగా లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది.సదాశివనగర్‌లో హనుమంత్ రాజుకు చెందిన Bajaj Pulsar TS-08-HY-8176ను A1 ఇమ్రాన్, A2 అద్నాన్ ఖాన్‌లు దొంగిలించి A6 సచిన్‌కు రూ.7,000లకు విక్రయించినట్లు వెల్లడైంది. A6 సచిన్ అసలు నంబర్ ప్లేట్‌ను తొలగించి MH-26-CB-1576 నకిలీ నంబర్ ప్లేట్‌ను అమర్చినట్లు పోలీసులు గుర్తించారు. 08.08.2026న పద్మాజీవాడి ఎక్స్ రోడ్ బ్రిడ్జి వద్ద పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. A4 జుబేర్, A5 అయాన్, A6 సచిన్‌లు నకిలీ నంబర్ ప్లేట్లు అమర్చిన దొంగిలించిన పల్సర్ మోటార్ సైకిళ్లపై ప్రయాణిస్తుండగా, A1 ఇమ్రాన్, A2 అద్నాన్ ఖాన్‌లు మరో మోటార్ సైకిల్‌ను దొంగిలించి హైదరాబాద్‌లో విక్రయించాలనే ఉద్దేశంతో TVS Riderపై వెళ్తున్నారు.పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని గమనించిన A1, A2లు తప్పించుకునేందుకు యూ-టర్న్ తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా, అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పద్మాజీవాడి ఎక్స్ రోడ్ బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మిగతా నిందితులను కూడా అదుపులోకి తీసుకుని విచారించగా, మోటార్ సైకిల్ దొంగతనాలకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి.

నిందితుల వద్ద నుండి మొత్తం 4 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులు పరస్పరం సంప్రదించేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్ జిల్లా స్థాయిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, దొంగిలించిన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకోవడంలో సమర్థవంతంగా పనిచేసిన ఎల్లారెడ్డి డీఎస్పీ, సదాశివనగర్ సీఐ బి. సంతోష్ కుమార్, ఎస్ఐ పుష్పరాజ్, సిద్ధిఖీ సిబ్బంది ఎండీ అజహర్ ఫరూక్, ఏఆర్ పీసీ శంకర్, సీసీఎస్ టీంకు చెందిన రవి, గణపతిలు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అభినందించారు.

## నూతన పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ...



**కోరుట్ల ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)**

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్లతో కలిసి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ నూతన ఆసరా సామాజిక భద్రత పెన్షన్ దరఖాస్తు చేసుకొనుటకు ఆధార్ కార్డు తెల్ల రేషన్ కార్డు వయస్సు ధ్రువీకరణ పత్రము బ్యాంకు పాస్పోర్ట్ జిరాక్స్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో వర్గాన్ని బట్టి కులా లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి వితంతు పెన్షన్ అయితే భర్త ధ్రువీకరణ పత్రం దివ్యాంగుల పెన్షన్ అయితే సదరం సర్టిఫికెట్ గీత చేనేత కార్మికులు అయితే సంబంధిత సొసైటీ సభ్యత్వ ధ్రువీకరణ పత్రం తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా తప్పకుండా పెన్షన్ వచ్చేలా కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ షాహిద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం నాయకులు ఎడ్ల రమేష్ వాసిద్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు పెన్షన్ దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



**పెద్దపల్లి, ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి)**

ఆషాఢమాస బోనాల సందర్భంగా హైదరాబాద్ అలీజా కోట్లలోని శ్రీ కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి మరింతగా పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బోనాల పండుగను ఘనంగా నిర్వహించే ఆలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని మైసమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**- కొమురం భీం, రాంజీ గోండుకు ఘన నివాళులు**

**- గిరిజనులతో కలిసి నృత్యం చేసిన కలెక్టర్, ఎస్పీ**



**ఆదిలాబాద్, ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి):**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఆదివారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కొమురం భీం, రాంజీ గోండు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు.అనంతరం ఆదివాసీ కళాకారులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. వారి ఉత్సాహంలో కలిసిపోయిన కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ గిరిజనులతో కలిసి నృత్యం చేసి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అధికారుల భాగస్వామ్యంతో కార్యక్రమ ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తుచేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి గిరిజన నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గిరిజన నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కులను హరిస్తున్న ప్రభుత్వ విధానాలను అడ్డుకోవాలి

**1/70, అటవీ హక్కుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి**



**పెద్దపల్లి ఆగస్టు 9 (వుదయం ప్రతినిధి)**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పౌరహక్కుల కమిటీ (CLC) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి మాట్లాడుతూ..ఆదివాసీల హక్కులు, భూమి, అడవి, జీవనాధారాల పరిరక్షణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన ప్రత్యేక రక్షణలు ఉన్నప్పటికీ, నేటికీ వారి భూములు, అడవులు, సహజ వనరులపై దోపిడీ కొనసాగుతుండటం ఆందోళనకరమని అన్నారు.మైనింగ్, పరిశ్రమలు, ప్రాజెక్టులు, రహదారులు తదితర అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ఆదివాసీలను వారి నివాస ప్రాంతాల నుంచి తరలించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల ఉనికినే దెబ్బతీసే విధానాలను అభివృద్ధిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.ఆదివాసీల భూములకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, అక్రమంగా బదలాయించిన గిరిజన భూములను తిరిగి ఆదివాసీలకే అప్పగించాలని కోరింది. అలాగే అటవీ హక్కుల చట్టం–2006 ప్రకారం సాగు భూములు, నివాస హక్కులు, సామూహిక అటవీ హక్కులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ మాట్లాడుతూ...అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసీలను ఆక్రమణదారులుగా చిత్రీకరించడం సరికాదని, అడవిని కాపాడుతూ జీవిస్తున్న వారికే అటవీపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు . PESA చట్టం ప్రకారం గ్రామ సభలకు ఉన్న అధికారాలను పూర్తిస్థాయిలో అమలు చేసి, ఆదివాసీ ప్రాంతాల్లో భూమి, నీరు, అడవి, ఖనిజ వనరులపై నిర్ణయాలు తీసుకునే ముందు స్థానిక గ్రామసభల అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. IFTU రాష్ట్ర అధ్యక్షులు కె. విశ్వనాథ్ మాట్లాడుతూ..ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధి, రహదారులు, గృహ వసతులు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ తగిన స్థాయిలో లేవని, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను బలోపేతం చేయడంతో పాటు ఆదివాసీ యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ...ఆదివాసీలను వారి భూమి, అడవి, సంస్కృతి, జీవనాధారాల నుంచి వేరు చేయకుండా అభివృద్ధి విధానాలను రూపొందించాలని, నిర్వాసితులకు న్యాయమైన పునరావాసం, పరిహారం కల్పించిన తరువాతే ఏ ప్రాజెక్టునైనా ముందుకు తీసుకెళ్లాలని,ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు, పౌర సమాజం నిరంతరం పోరాడాల్సిన సందర్భంగా గుర్తించాలని అన్నారు.

## గిరిజనుల విద్య హక్కులు సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం...

**గిరిజన సంక్షేమానికి 18 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు...**

**ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)**

ఆదివాసీ సమాజం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి హక్కులను కాపాడటంతో పాటు ఆత్మగౌరవం విద్య ఉపాధి సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బంజారా హిల్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలలు వసతి గృహాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అందించే డైట్ కాస్మెటిక్ ఛార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన ఆహారం మెరుగైన వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు త్వరలో మరింత మెరుగైన నాణ్యత కలిగిన కాస్ట్యూమ్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన విద్యార్థులు పాఠశాల విద్యతోనే పరిమితం కాకుండా ఉన్నత విద్య ఉన్నత చదువుల వరకు అత్యుత్తమంగా రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి అన్నారు. రాష్ట్ర గిరిజన విద్యార్థులకు సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి ఇటీవల హామీ ఇచ్చారని తెలిపారు.

**గిరిజన హక్కులు, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యం**

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణ విద్యాభివృద్ధి గిరిజన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ మహిళల గౌరవం సాధికారత ఆరోగ్యం అభివృద్ధి వంటి అంశాలకు శాఖ ప్రాధాన్యతనిస్తూ పని చేస్తోందన్నారు. గిరిజనుల సాంప్రదాయ జ్ఞానం జీవన విధానం కళలు భాషలు ఆచారాలను భావితరాలకు అందించేందుకు టిఆర్ఐ ఆధ్వర్యంలో సంస్కృతి పరిరక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**రిజర్వేషన్లతో గిరిజనుల అభివృద్ధి**

మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ సమతల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు ప్రతి జిల్లాలో గిరిజన జనాభా ప్రాతిపదికన కనీసం ఒక శాసనసభ స్థానాన్ని కల్పించే దిశగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు 2014కు పూర్వం ఉన్న గిరిజన ఏజెన్సీ ప్రాంతాల వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు అనంతరం శ్రీరాములు నాయక్ మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో లంబాడీలకు కల్పించిన రిజర్వేషన్ల వల్ల ఆ సమాజం విద్య ఉద్యోగాలు రాజకీయాలు తదితర రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు అనంతరం సామేల్ మాట్లాడుతూ గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులు ప్రయోజనాలను కాపాడేందుకు గిరిజనేతరుల అక్రమ ప్రవేశం భూముల ఆక్రమణ వంటి అంశాలపై కఠినమైన నియంత్రణ అవసరమన్నారు.

**సంప్రదాయ మూలాలను కాపాడుకోవాలి**

ట్రికర్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాజం వేల సంవత్సరాలుగా కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయాలు ఆచారాలు కళలు భాషలు జీవన విధానాల మూలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమాజంలో విద్య ద్వారానే శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందన్నారు ప్రతి గిరిజన కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీతాలక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలను కేవలం నగరాలకే పరిమితం చేయకుండా గిరిజన ఆశ్రమ పాఠశాలలు గురుకులాలు ఇతర పాఠశాలల్లో కూడా ఘనంగా నిర్వహించాలని సూచించారు. తద్వారా విద్యార్థులకు గిరిజన చరిత్ర సంస్కృతి వారసత్వంపై అవగాహన కల్పించవచ్చన్నారు. గిరిజన విద్యార్థులు స్పేస్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలి**

మాజీ కేంద్ర మంత్రి ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని ఒక కొత్త సంకల్పానికి ప్రారంభ దినంగా భావించాలన్నారు. ఈ రోజునే వచ్చే ఏడాదికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని దానిని విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు గిరిజన ప్రాంతాల్లో అర్హులైన కుటుంబాలకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**తొమ్మిది మంది ప్రముఖులకు సన్మానం**

ఆదివాసీ సమాజం గిరిజన సంక్షేమం విద్య సంస్కృతి హక్కుల పరిరక్షణ తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులను ఈ సందర్భంగా సన్మానించారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు గిరిజన సంఘాల ప్రతినిధులు విద్యార్థులు కళాకారులు ఉద్యోగులు వివిధ గిరిజన సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అవసరాలను బట్టి నీటి వినియోగం జరగాలి: కలెక్టర్



**నిర్మల్ జిల్లా 9 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

రైతుల పంటల అవసరాలను, ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికాబద్ధంగా నీటి వినియోగం చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన లక్ష్మణ చందా మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఉన్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులోని నీటి మట్టం, గ్రామంలోని వ్యవసాయ సాగు నీటి అవసరాలను బేరీజు వేసుకొని నీటిని విడుదల చేయాలని సూచించారు. ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా, వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం చెరువు తూము పరిస్థితిని, కట్ట దృఢత్వాన్ని అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడే ఉన్న స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, చెరువు కింద సాగవుతున్న పంటల రకాలు, మొత్తం ఆయకట్టు విస్తీర్ణం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర దినోత్సవ వేడుకలో భాగంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఏగరాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపు**



**కరీంనగర్ ఆగస్టు 09(వుదయం ప్రతినిధి):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో విజయవంతం చేసేందుకు తగిన కృషి చేయాలని , ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా బిజెపి శ్రేణులు తగిన కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పిలుపునిచ్చారు. మండల పార్టీల ఆధ్వర్యంలో తిరంగా కార్యక్రమాలను మరియు 'తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా, ఆగస్టు 12 నుంచి 14 వరకు మహాపురుషులు మరియు స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుద్ధి చేసి, స్మారక చిహ్నాల చుట్టూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులను కోరారు.కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో తిరంగా ర్యాలీలు, దేశభక్తి ప్రదర్శనలు మరియు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ప్రతి పౌరుడిని మానసికంగా దేశంతో అనుసంధానించే ఒక గొప్ప సామాజిక ఉద్యమంగా ఈ కార్యక్రమం రూపాంతరం చెందిందని, ప్రతి ఏటా ఇది ఘనంగా జరుగుతుంది అని గుర్తు చేశారు.మన జాతీయ పతాకం త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరి ఐక్యతకు, సమైక్యతకు మరియు అఖండతకు ప్రతీక. జిల్లాలో దేశభక్తి వాతావరణం పరిమళించేలా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూసి 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌ను విజయం చేయాలని ఆయన కోరారు. అనంతరం బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ కోలగా ని శ్రీనివాస్ ,రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు, బాస సత్యనారాయణ రావు, కన్న బోయిన ఓదెలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, గుజ్జ శ్రీనివాస్ లతో పాటు జిల్లా ముఖ్యనేతలు, మండలాల, జోన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పటాన్‌చెరు నియోజకవర్గ TUWJ–IJU సమావేశం

- ఆగస్టు 11న రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహణ



**పటాన్‌చెరు (వుదయం):**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ-IJU) ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశాన్ని ఆగస్టు 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ తెలిపారు.పటాన్‌చెరు నియోజకవర్గానికి TUWJ-IJU నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ సమావేశానికి తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**జర్నలిస్టుల సమస్యలపై చర్చ**

సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్, జర్నలిస్టుల ఆరోగ్య భద్రత తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సభ్యులతో చర్చించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశానికి TUWJ-IJU రాష్ట్ర ఉపాధ్యక్షులు M.A.K. ఫైజల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బందారు యాదగిరి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఆసిఫ్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి చెన్న బసవేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్ తదితరులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.స్థలం: లక్ష్మీ గార్డెన్, రామచంద్రాపురం తేదీ: 11 ఆగస్టు 2026, మంగళవారం సమయం: ఉదయం 11:00 గంటలకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని జర్నలిస్టు మిత్రులందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## అక్షరాల బడి..ఆరోగ్యం ఇచ్చే గుడి!

- సేవా యజ్ఞంలో 'దయానంద విద్యామందిర్' సరికొత్త చరిత్ర!
- అప్రతిహతంగా 88వ ఉచిత వైద్య శిబిరం దిగ్విజయం.. సీజనల్ ముప్పుపై వైద్యుల గర్జన!

**గద్వాల ఆగస్టు 09 (వుదయం బ్యూరో)**



చదువును వ్యాపారంగా మార్చేసి, విద్యార్థుల నుంచి పిండుకోవడమే ధ్యేయంగా సాగుతున్న నేటి కార్పొరేట్ విద్యావ్యవస్థకు చెంపపెట్టులా నిలుస్తోంది గద్వాల పట్టణంలోని 'దయానంద విద్యామందిర్'. కేవలం అక్షర జ్ఞానానికే పరిమితం కాకుండా, తమ విద్యార్థుల, స్థానిక చిన్నారుల ప్రాణ రక్షణను భుజానికెత్తుకొని నిజమైన విద్యాసంస్థకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. గద్వాల వేదనగర్‌లోని పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 88వ ఉచిత వైద్య శిబిరం సామాజిక చైతన్యానికి నిలువుటద్దంలా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ పట్ల శ్రీనివాస్ ఆర్య నాయకత్వంలో జరిగిన ఈ నిరంతర సేవా యజ్ఞంలో ప్రముఖ చిన్నారుల వైద్య నిపుణులు డాక్టర్ శ్యామ్, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ జయరాజు పాల్గొని వందలాది మంది చిన్నారుల ఆరోగ్యానికి భరోసానిచ్చారు. ఉచిత మందుల పంపిణీ.. ప్రాణ రక్షణే ధ్యేయం: శిబిరానికి పోటెత్తిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం అత్యంత నిశితంగా పరిశీలించింది. పేద, మధ్యతరగతి కుటుంబాలపై వైద్య భారం పడకుండా పాఠశాల యాజమాన్యం తీసుకుంటున్న ఈ చొరవ స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మెడికల్ షాపుల సొంత వైద్యం ప్రాణాలకే ముప్పు: వైద్యుల తీవ్ర హెచ్చరిక మారుతున్న కాలంతో పాటు విరుచుకుపడుతున్న సీజనల్ వ్యాధులపై తల్లిదండ్రుల నిర్లక్ష్యాన్ని వైద్యులు తీవ్రంగా తప్పుపట్టారు. లక్షణాలను తేలిగ్గా తీసిపడేస్తే ప్రమాదమే: జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వహించడం అంటే పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అని స్పష్టం చేశారు. సొంత వైద్యం స్వయంకృతాపరాధం: డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో కొని యాంటీబయోటిక్స్ పిల్లల రోగనిరోధక వ్యవస్థను నాశనం చేస్తాయని హెచ్చరించారు. పరిశుభ్రతే రక్ష: కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారమే సగం రోగాలకు మూలమని, కాచి చల్లార్చిన నీటినే అందించాలని హితవు పలికారు.

**అభినందనల నీరాజనాలు:** ఏకంగా 88 వైద్య శిబిరాలను ఒక క్రతువులా పూర్తి చేసి, ప్రజారోగ్యానికి సరికొత్త అర్థాన్ని ఇచ్చిన దయానంద విద్యామందిర్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కొనియాడారు. వ్యాపార ధోరణిలో సాగుతున్న సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యా రంగానికే దిక్సూచిగా నిలుస్తాయని మేధావులు కొనియాడారు.

## సర్ సకాలంలో పూర్తి చేయాలి

- ప్రభుత్వ పాఠశాలలు గురుకులాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్ నగర్, ఆగస్టు 09(వుదయం ప్రతినిధి):**

దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు,ఎఈఆర్ఓలు, బీఎల్ఓ, సూపర్‌వైజర్‌లతో సర్ 2026 పై, జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.పి.డి.ఓ.లు, ఎం.ఈ.ఓ.లు, పాఠశాలలు, కె.జి.బి.వి.లు, గురుకుల పాఠశాలలలో ఈ నెల 11,12 తేదీలలో చేపట్టే ప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్ పై, పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, నిర్వహణ పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.ఐ.ఆర్ 2026కు సంబంధించిన కొనసాగుతున్న కార్యకలాపాలను కూడా సమీక్షించి సూచనలు చేశారు.అభివృద్ధి పనుల పురోగతిని నిశితంగా పర్యవేక్షించాలని, ప్రభుత్వ సంక్షేమ ప్రతిష్టాత్మక పథకాలను సరైన అమలును నిర్ధారించాలని, ఎస్ఐఆర్ 2026 సంబంధిత కార్యకలాపాలను నిర్దేశిత కాలపరిమితిలోగా విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఆశించిన ఫలితాలను సాధించడానికి క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వివిధ విభాగాల మధ్య సమన్వయం, సమస్యల సత్వర పరిష్కారం యొక్క ప్రాముఖ్యతను అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు వివరించారు. ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల హెడ్ మాస్టర్ లు,ఉపాధ్యాయులకు పాఠశాల భద్రత,నిర్వహణపై ఆయన ముఖ్యమైన సూచనలు చేశారు. పాఠశాలలు పరిశుభ్రత ,విద్యార్థుల భద్రతకు సంబంధించి ఎం.ఈ.ఓ.లు, ఎం.పి.డి.ఓ లకు కొన్ని సూచనలు ఇచ్చారు.ఇటీవల నారాయణపేట జిల్లాలో జరిగిన దురదృష్టకర సంఘటనలో, ఒక చిన్నారి పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషయం మనందరికీ తెలిసిందే. ఇలాంటి సంఘటనలు మన జిల్లాలో చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల కూడా జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. 11,12వ తేదీలలో పాఠశాలల్లో ప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు పాఠశాలల్లో, కె.జి.బి.వి.ల లో, గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆయన తెలిపారు. గురువారం నుండి వచ్చే జిల్లా స్థాయి తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలి. తనిఖీలలో ఏమైనా లోపాలు గుర్తిస్తే, సంబంధిత బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.సమావేశం లో జిల్లా విద్యా శాఖ అధికారిని విజయ కుమారి పాల్గొన్నారు.

## రోడ్డుపైనే దినసరి కూలీల అడ్డా

- కనీస సౌకర్యాలు లేక కూలీలు, వ్యాపారులు ఇబ్బందులు
- ప్రత్యేక లేబర్ అడ్డా ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

**నాగర్ కర్నూల్, ఆగస్టు 09 (వుదయం బ్యూరో):**



జిల్లా కేంద్రం నాగర్ కర్నూల్ సంతబజార్ ప్రాంతంలో దినసరి కూలీలకు ప్రత్యేక లేబర్ అడ్డా లేకపోవడంతో వారు రోడ్డుపైనే ఉపాధి కోసం నిరీక్షిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ, వర్షంలోనే నిలబడి పనికోసం ఎదురుచూసే కూలీల పరిస్థితి దయనీయంగా ఉంది.లేబర్ అడ్డా లేకపోవడంతో కూలీలు దుకాణాల ముందు, రోడ్డు పక్కన గుమికూడుతున్నారు. దీంతో కాఫీ షాపులు, మెడికల్ షాపులు, బంగారు దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలకు కస్టమర్లు రాలేకపోతున్నారు. షాపుల ముందు జనం గుంపులుగా ఉండటంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ప్రతి శుక్రవారం జరిగే సంత రోజున రద్దీ అధికంగా ఉంటోంది. రోడ్డంతా జనసందోహంతో నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ జామ్ కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది.ఈ సమస్యపై స్థానికులు, వ్యాపారులు పలుమార్లు ట్రాఫిక్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.కూలీల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం వెంటనే సంతబజార్ సమీపంలో ప్రత్యేక లేబర్ అడ్డా ఏర్పాటు చేయాలని, అక్కడ నీడ, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీ సంఘాలు కోరుతున్నాయి.కూలీలకు గౌరవప్రదమైన పని ప్రదేశం కల్పించడంతో పాటు వ్యాపారులకు, ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్



- పర్యవేక్షించిన అధ్యక్షులు రవికుమార్ గౌడ్

**నారాయణపేట టౌన్, ఆగస్టు 09(వుదయం ప్రతినిధి):**

పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్‌లో గ్రాండ్ టెస్ట్వారియర్స్ డిఫెన్స్ అకాడమీ నారాయణపేట ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 320 ఏ వారి సహకారంతో పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ క్లాసులు లేట్ శ్రీ ఆసారం భట్టాడ్ లయన్స్ భవన్‌లో విజయవంతంగా నిర్వహించారు.పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తూ, వారి ప్రతిభను, పరీక్షా సన్నద్ధతను అంచనా వేస్తున్నారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ లయన్ రవికుమార్ గౌడ్ పర్యవేక్షణలో కోచింగ్ క్లాసులు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ లయన్ డాక్టర్ ఆంజనేయులు (ఆర్మీ), లయన్ శాంత, లయన్ ఎస్. చక్రవర్తి, లెక్చరర్లు వెంకన్న, శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో శిక్షణ పొందుతూ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. విద్యార్థులు రాస్తున్న గ్రాండ్ టెస్ట్ ను లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ పర్యవేక్షించారు.

## ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న చింత సాయినాథ్



**సంగారెడ్డి వుదయం**

ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయినాథ్ గారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,పార్టీ నాయకులు , భక్తులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగులో దక్షిణ భారతదేశంలోనే సిద్దిపేటదే అగ్రస్థానం





- వరికి బదులు ఆయిల్‌పామ్‌తో రైతులకు అధిక ఆదాయం
- ఐదేళ్ల కల సాకారం
- మేడిపల్లిలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

రాబోయే రోజుల్లో ఆయిల్‌పామ్ సాగులో దక్షిణ భారతదేశంలోనే సిద్దిపేట అగ్రస్థానంలో నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలన్న తన ఐదేళ్ల కల ఆయిల్‌పామ్ సాగుతో సాకారమవుతోందని హర్షం వ్యక్తం చేశారు. చిన్నకోడూరు మండలం మేడిపల్లి గ్రామంలో రైతు ముక్కిస పాపిరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై ఆయిల్‌పామ్ సాగుతో అద్భుతమైన దిగుబడులు సాధిస్తున్న రైతులను అభినందించారు.2021 జూన్ 5న నంగునూరులో ఎల్లారెడ్డి అనే రైతు పొలంలో తొలి ఆయిల్‌పామ్ మొక్కను నాటగా, మూడేళ్ల తర్వాత 2024 జూన్ 15న అక్కెనపల్లికి చెందిన నాగేందర్ పొలంలో తొలి గెలను కోశామని హరీశ్‌రావు తెలిపారు. తొలి గెలను ఫ్యాక్టరీకి పంపిన కొద్ది రోజులకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో నమ్మకం పెరిగిందన్నారు.ప్రస్తుతం సిద్దిపేట నియోజకవర్గంలో 5,322 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతుండగా, 301 ఎకరాల్లో కోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నంగునూరు మండలం 2,750 ఎకరాలతో మొదటి స్థానంలో, చిన్నకోడూరు మండలం 1,050 ఎకరాలతో రెండో స్థానంలో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఆయిల్‌పామ్ సాగును 50 వేల ఎకరాలకు విస్తరించి సిద్దిపేటను రాష్ట్రానికే దిక్సూచిగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

**రెండు ఎకరాలతో నెలకు రూ.50 వేల ఆదాయం**

పర్యావరణానికి మేలు చేసే పంటఆయిల్‌పామ్ సాగు రైతులకు ఆదాయం అందించడంతో పాటు పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల వల్ల ఆక్సిజన్ పెరగడంతో పాటు తోటలు ఉన్న ప్రాంతాల్లో సాధారణం కంటే సుమారు రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతుందని చెప్పారు. వర్షపాతం పెరగడానికి కూడా ఇవి దోహదపడతాయన్నారు.మామిడి తదితర పండ్ల తోటలతో పోలిస్తే వడగళ్ల వానలు, గాలిదుమారాలతో ఆయిల్‌పామ్‌కు నష్టం తక్కువగా ఉంటుందని, కోతుల బెడద కూడా ఉండదన్నారు.వంట నూనె దిగుమతులకు స్వస్తి పలకాలిభారతదేశం ఏటా భారీ మొత్తంలో వంట నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోందని హరీశ్‌రావు తెలిపారు. దేశీయంగా ఆయిల్‌పామ్ సాగును పెంచడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడంలో సిద్దిపేట రైతులు కీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సిద్దిపేటలో ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించేందుకు గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. సాగు కోసం గుంతలు తీసుకుని మొక్కల కోసం ఎదురుచూస్తున్న సుమారు వెయ్యి ఎకరాలకు వారం రోజుల్లో 30 వేల నుంచి 40 వేల మొక్కలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. తక్కువ ఎత్తులో పెరిగి అధిక దిగుబడినిచ్చే సరికొత్త సిరాయిడ్ వెరైటీ మొక్కలు చందలాపూర్ నర్సరీలో సిద్ధమవుతున్నాయని, మరో నాలుగు నెలల్లో అవి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

**సిద్దిపేటలోనే ఆయిల్‌పామ్ రిఫైనరీ**

సిద్దిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఇప్పటికే పూర్తయిందని, మరో మూడు నాలుగు నెలల్లో ప్రభుత్వ రంగంలోనే తొలి ఆయిల్‌పామ్ రిఫైనరీ కూడా సిద్దిపేటలో ప్రారంభం కానుందని హరీశ్‌రావు తెలిపారు. ఆయిల్‌పామ్ గెలల నుంచి నూనెను తయారు చేసి, ప్యాకెట్ల రూపంలో సిద్దిపేట నుంచే మార్కెట్‌కు సరఫరా చేసే స్థాయికి జిల్లా ఎదుగుతోందన్నారు.సర్పంచులు, ప్రజాప్రతినిధులు కేవలం రోడ్లు, భవనాల నిర్మాణానికే పరిమితం కాకుండా రైతుల ఆదాయం పెంచే ప్రత్యామ్నాయ పంటల వైపు యువత, రైతులను ప్రోత్సహించాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఆయిల్‌పామ్ సాగును విస్తరించి రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.

## ఆదివాసీల సంప్రదాయాలు గొప్పవి



- వాటిని కాపాడుకుంటూ విద్యలో ముందుకు సాగాలి
- షెడ్యూల్డ్ ప్రాంత హక్కుల రక్షణ కోసం పోరాటం తప్పదు
- పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.. అటవీ అధికారుల దాడులు ఆపాలి

**వికారాబాద్, ఆగస్టు 9 (వుదయం బ్యూరో)**

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానం ఎంతో గొప్పవని, వాటిని పరిరక్షించుకుంటూనే విద్యలో ముందుకు సాగాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (TAGS) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీను నాయక్, వెంకట్ రాములు అన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

**ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన వసతి గృహంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (TAGS), లంబాడీ హక్కుల సంఘం, KVPS ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను వివరించారు. యువత, విద్యార్థులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**విద్యతోనే సమాజ మార్పు**

ఈ సందర్భంగా శ్రీను నాయక్, వెంకట్ రాములు మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ఆదివాసీ విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి స్థానాల్లో స్థిరపడాలని, తద్వారా సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**1994లో ఐక్యరాజ్యసమితి పిలుపు**

ఐక్యరాజ్యసమితి 1994లో ఆదివాసీల అభివృద్ధి, వారి హక్కులు, భాష, సంస్కృతి పరిరక్షణకు అన్ని దేశాల ప్రభుత్వాలు కృషి చేయాలని పిలుపునిచ్చిందని నాయకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ సమాజాల హక్కులు, గౌరవం, అభివృద్ధి, స్వయం నిర్ణయాధికారం వంటి అంశాలపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఒక ముఖ్యమైన సందర్భమని పేర్కొన్నారు.

**నేటికీ కనీస సౌకర్యాలకు దూరమే**

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దేశంలోని అనేక ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలు నేటికీ కనీస వసతులకు దూరంగా జీవిస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి తదితర ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందక ఆదివాసీ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.ఆదివాసీల భూమి, జీవనాధారం, సంస్కృతి, అస్తిత్వాన్ని కాపాడేందుకు ఉన్న చట్టాలను బలహీనపరిచే చర్యలను అడ్డుకోవాలని అన్నారు. ఆదివాసీల అస్తిత్వానికి కీలకమైన 1/70 చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

**GO3 పునరుద్ధరణకు డిమాండ్**

GO3ను పునరుద్ధరించాలని, ఆదివాసీ ప్రాంతాల్లో స్థానికులకు న్యాయం జరిగేలా ఉద్యోగ అవకాశాల్లో రక్షణ కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ యువత తమ హక్కులపై అవగాహన పెంచుకుని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి**

తరతరాలుగా ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పోడు సాగు చేస్తున్న ఆదివాసీలపై అటవీ అధికారుల దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భూమిపై హక్కు, జీవనాధారం, అటవీ వనరులపై ఆధారపడే ఆదివాసీల జీవన విధానాన్ని రక్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలు ప్రతి గ్రామానికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

**యువత ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి**

ఆదివాసీ యువత చదువుతో పాటు తమ రాజ్యాంగ హక్కులపై అవగాహన పెంచుకోవాలని నాయకులు సూచించారు. తమ హక్కుల కోసం శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం అంటే కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడం కాదని, భవిష్యత్ తరాలకు తమ మూలాలను అందించడం కూడా అని వారు పేర్కొన్నారు. విద్య, హక్కుల సాధన, సామాజిక అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణతోనే ఆదివాసీ సమాజం మరింత ముందుకు సాగుతుందని అన్నారు.

**పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్, KVPS, TGS, DYFI జిల్లా నాయకులు విజయ, రాజు, రామచంద్ర నాయక్, కిషన్, శ్రవణ్, గోపాల్‌తో పాటు గిరిజన విద్యార్థులు, సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

* ఐదో షెడ్యూల్ హక్కులను సమర్థవంతంగా అమలు చేయాలి
* 1/70 చట్టాన్ని పరిరక్షించాలి
* GO3ను పునరుద్ధరించాలి
* పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి * అటవీ అధికారుల దాడులను నిలిపివేయాలి * ఏజెన్సీ గ్రామాలకు రహదారులు, తాగునీరు, వైద్యం, విద్య వంటి కనీస సౌకర్యాలు కల్పించాలి

## పోతారంలో ఘనంగా బోనాల జాతర

- మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 9, వుదయం:**



బోనాల పండుగను పురస్కరించుకుని దుబ్బాక మండలం పోతారం గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి తన సొంత గ్రామమైన పోతారంలో జరిగిన బోనాల జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. దీంతో పోతారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.తన సొంత గ్రామంలో జరిగిన బోనాల జాతరలో ఎమ్మెల్యే పాల్గొనడంతో గ్రామస్తులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను ఆప్యాయంగా కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పుతో వార్డు ప్రజలకు ఊరట

- పాలకవర్గానికి,విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన వార్డ్ ప్రజలు

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలోని 7వ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డులో విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటంతో స్థానికులు ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ వేముల అరుణ రాజేశం, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సర్పంచ్ విద్యుత్ శాఖ ఏఈ, డీఈ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు స్పందించి వార్డులోని విద్యుత్ స్తంభంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రమాదం లేని ప్రదేశానికి మార్చారు. దీంతో వార్డు ప్రజలకు ఊరట కలగడంతో పాటు భవిష్యత్‌లో జరగబోయే ప్రమాదాన్ని నివారించినట్లయింది.సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సర్పంచ్, పాలకవర్గానికి వార్డు ప్రజలు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ వేముల అరుణ రాజేశం తెలిపారు.

## యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భరత్ గౌడ్

**వెల్దండ ఆగస్టు 9 (వు దయం)**

మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి మోతిలాల్ నాయక్, మట్ట వెంకటయ్య గౌడ్ వెల్దండ గ్రామం సర్పంచ్,మండల పార్టీ అధ్యక్షులు హరికిషన్, నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముందుగా మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువకులు కృషి చేయాలని కోరారు. పార్టీలో యువతకు సముచితస్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో:సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఫుల్ సింగ్ నాయక్,,ఉప సర్పంచ్ శీను, బాధపెల్లి మల్లయ్య వెల్దండ టౌన్ అధ్యక్షుడు, వెల్దండ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిలి ఆనంద్, గోసుల కొండయ్య వార్డు నెంబర్, కాషారపు వెంకటయ్య, తారా సింగ్, దుర్గయ్య, దూల చంద్రశేఖర్ చుక్కనపెల్లి అధ్యక్షుడు, రేవెల్లి రాజు, రచూరు గ్రామ అధ్యక్షుడు సతీష్, బొక్కల చంద్రశేఖర్, మట్ట శివ గౌడ్,ఎండి సమీర్, ఈదులపెల్లి శ్రీనివాస్, పుట్ట శివ, డేవిడ్, దార చిన్న, మాదుగుల రమేష్, గుద్దటి అశోక్,పాల్గొన్నారు

## టన్నెల్ బాధితులకు న్యాయం చేయాలి





- ప్లాట్ల కింద అండర్‌గ్రౌండ్ టన్నెల్ పనులు - 200-300 కుటుంబాలకు ఇబ్బంది

**నాగర్ కర్నూల్, ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)**

: పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అండర్‌గ్రౌండ్ టన్నెల్ పనుల వల్ల నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ పరిధిలోని ప్లాట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. టన్నెల్ గురించి ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండానే ప్లాట్లను విక్రయించారని ఆరోపించారు. ఇప్పుడు టన్నెల్ పనుల కారణంగా ప్లాట్లపై మార్కింగ్ రాళ్లు వేయడంతో ప్లాట్లను అమ్ముకోలేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని వెల్లడించారు. ఏళ్ల కిందట రూపాయి రూపాయి కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేశామని, టన్నెల్ ప్రభావంతో 200-300 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో పాలమూరు-రంగారెడ్డి టన్నెల్ బాధితుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా వహీద్ ఖాన్, అధ్యక్షుడిగా అమరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డి, సెక్రటరీగా శివరామ దీక్షిత్, ప్రచార కార్యదర్శిగా గురుబ్రహ్మం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, తగిన పరిహారం అందించాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.




# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ప్రారంభం

చర్ల, ఆగస్టు 9:(వుదయం ప్రతినిధి) చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్ కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కుర్నపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శ్యామల తిరుపతిరావు పాల్గొని ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో మహిళలు సంప్రదాయ ఆదివాసీ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జానపద గీతాలు, ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో గ్రామంలో సందడి నెలకొంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు ఐక్యతను చాటేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

## ఘనంగా అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు





చర్ల, ఆగస్టు 9: (వుదయం ప్రతినిధి) గిరిజన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి వరదల వరలక్ష్మీ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చర్ల మండల కేంద్రంలోని విజయకాలనీలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బందెల చంటి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. గిరిజన చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. సహజ వనరుల దోపిడీకి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ చట్టాలను ఏకపక్షంగా తీసుకొస్తోందని విమర్శించారు. అడవి, భూమి, నీటిపై ఆదివాసీలకే హక్కు ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు మచ్చ రామారావు, బి.నవీన్, ఐద్వా మండల కార్యదర్శి పొడుపుగంటి సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం మండల మహిళా కన్వీనర్ ఉడుగుల షారోను తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బ్రష్ తో ప్రాణం పోస్తున్న అమీనాబాద్ అక్కచెల్లెలు

## పోటీల్లో కాదు... ప్రజల మెప్పుతోనే గుర్తింపు తెచ్చుకుంటున్న చిన్నారుల కళాకారులు







అనంతగిరి ఆగష్టు 09 వుదయం అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన ఈ అక్క చెల్లెళ్ళు కాగితంపై గీత వేస్తే కథ అవుతుంది. రంగు వేస్తే ప్రాణం వస్తుంది. చిన్న వయసులోనే బ్రష్ పట్టి రంగులతో మాయాజాలం చేస్తున్నారు. కాగితంపై తమ ఊహలను బొమ్మలుగా మలుస్తున్నారు. ఇంటి గోడలే వారికి కాన్వాస్ అయ్యాయి. వారే అమీనాబాద్ ఊరి అక్క చెల్లెలు గరిడేపల్లి సనా, గరిడేపల్లి హనీష లు వీరు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకున్నారు. నేడు ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. పల్లెటూరి పచ్చదనం, రైతుల కష్టం, పండుగ సంబరాలు, ప్రకృతి అందాలు వారి బొమ్మల్లో సజీవంగా కనిపిస్తాయి. ఈ అక్క చెల్లెళ్లు చెల్లెలు సొంతం. వాళ్ళు ఎలాంటి పోటీల్లో పాల్గొనలేదు. ఎలాంటి బహుమతులు అందుకోలేదు. అయినా వాళ్ల బొమ్మలు చూసిన అమీనాబాద్ వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా "ఇది మన పిల్లలు వేశారా" అని ఆశ్చర్యపోతున్నారు. చిన్న వయసులోనే కళను ప్రేమించిన ఈ అక్క చెల్లెళ్ళు స్కూల్ నుంచి రాగానే పుస్తకాలు పక్కన పెట్టి రంగులు బ్రష్ లు తీసుకుంటారు. ఇంటి గోడలపై, పాత నోటు పుస్తకాలపై, దొరికిన ప్రతి కాగితంపై తమ ఊహలను చిత్రిస్తారు.

**ఊరే వాళ్లకు గ్యాలరీ అయ్యింది**

అక్క వేసే ప్రకృతి దృశ్యాలు చూస్తే నిజంగా పొలం గట్టు మీద ఉన్న ఫీలింగ్ వస్తుంది. చెల్లెలు వేసే మనుషుల బొమ్మల్లో కళ్ళు మాట్లాడతాయి. సంక్రాంతి ముగ్గులు, రైతు నాగలి పట్టిన దృశ్యం, వర్షంలో తడుస్తున్న పిల్లలు... ఇవన్నీ చూసిన గ్రామస్తులు వాళ్లను దగ్గరికి పిలిచి అభినందిస్తున్నారు. అమీనాబాద్ బజార్లో, గుడి దగ్గర "అదిగో ఆ అమ్మాయిలేరా...మన ఊరి బంగారు తల్లులు. చాలా బాగా బొమ్మలు వేస్తారు" అని జనం చెప్పుకోవడం వాళ్లకు అన్నిటికంటే పెద్ద బహుమతి అయ్యింది.

**ఇంట్లోనే పుట్టిన కళ**

ఎవరూ నేర్పలేదు. యూట్యూబ్ లో వీడియోలు చూసి, పుస్తకాల్లో బొమ్మలు చూసి తమంతట తామే నేర్చుకున్నారు. అక్క వేగంగా నేర్చుకోవడం చూసి చెల్లెలు కూడా ప్రయత్నించింది. ఇప్పుడు ఇద్దరూ కలిసి ఒకరికొకరు టీచర్లు య్యారు. తల్లిదండ్రులు మొదట్లో సరదాగా అనుకున్నారు. కానీ రోజు రోజుకు వాళ్ల బొమ్మల్లో వచ్చిన పరిణితి చూసి ఆశ్చర్యపడుతున్నారు. చదువుతో పాటు కళ కూడా ఉండాలి. కళ ఉన్నవాళ్ళు ఎక్కడికైనా వెళ్తారని అంటున్నారు.

**మాటలు రాని భావాలకు రంగు రూపం**

మాటల్లో చెప్పలేని ఎన్నో విషయాలను వాళ్లు బొమ్మల ద్వారా చెబుతారు. పేద రైతు కష్టం, పండుగ సంతోషం, కరువులో రైతు బాధ... ఇవన్నీ వాళ్ల బ్రష్ లోంచి కాగితంపైకి వస్తాయి. చూసిన వాళ్ళు ఆగి 2 నిమిషాలు చూసి వెళ్తారు.

**కల పెద్దది**

మాకు పెద్ద సర్టిఫికెట్లు అవసరం లేదు. మా బొమ్మలు చూసి 4 మంది నవ్వితే చాలు అని అక్క చెల్లెలు అంటున్నారు. భవిష్యత్తులో మంచి చిత్రకారులు అయి, తమ బొమ్మలతో సమాజానికి సందేశం ఇవ్వాలని వారి కోరిక. పోటీలు లేకుండానే, బహుమతులు లేకుండానే ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్న అమీనాబాద్ అక్క చెల్లెలు నేటి తరం పిల్లలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# చేనేత కార్మికులకు సహకార సంఘ సభ్యత్వమే పెన్షన్ కు ప్రామాణికం కావాలి

## – చేనేత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ యలగందుల సాయినేత



సూర్యాపేట, ఆగష్టు 8: వుదయం ప్రతినిధిరాష్ట్ర ప్రభుత్వం అలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకంలో చేనేత కార్మికుల పట్ల సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చేనేత పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ యలగందుల సాయినేత ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానంలోని అసమానతలను ఎత్తి చూపారు. కల్లు గీతకు ఒక నిబంధన – చేనేతకు మరొకటా? కల్లు గీత కార్మికులకు వారి సహకార సంఘ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాన్నే అర్హతకు ప్రామాణికంగా గుర్తిస్తున్నారని, అదే సమయంలో చేనేత కార్మికులకు మాత్రం చేనేత ఉ జౌలి శాఖ ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేయడం సరికాదన్నారు. "ఒకే ప్రభుత్వ పథకానికి రెండు రకాల నిబంధనలు ఉండడం సబబు కాదు. ఇది చేనేత కార్మికుల పట్ల వివక్ష" అని ఆయన అన్నారు. చేనేత సహకార సంఘాల్లో సభ్యుల పూర్తి వివరాలు, సభ్యత్వం, వృత్తి సంబంధిత సమాచారం అంతా అధికారికంగా నమోదై ఉంటుందని తెలిపారు. సంఘమే కార్మికుడి జీవనాధారం అని, నూలు సరఫరా నుండి ఉత్పత్తుల అమ్మకం వరకు అన్నీ సంఘం ద్వారానే జరుగుతాయన్నారు. అలాంటప్పుడు సంఘ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాన్ని పక్కనపెట్టి అదనంగా శాఖ ధ్రువీకరణ కోరడం వల్ల పేద చేనేత కార్మికులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి చేనేత సహకార సంఘ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాన్నే చెల్లుబాటు అయ్యే ఆధారంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సంఘంలో సభ్యత్వం కలిగి 50 సంవత్సరాలు పూర్తి చేసిన అర్హులైన పేద చేనేత కార్మికులందరికీ వెంటనే చేయూత పెన్షన్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కి వినతిపత్రం సమర్పించనున్నట్లు, అలాగే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.



# కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు – కౌన్సిలర్లు తన్వీర్, సైదులు

అక్షర ఫౌండేషన్, శంకర కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

సూర్యాపేట, ఆగస్టు 10: వుదయం ప్రతినిధికంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని, నిర్లక్ష్యం చేయకుండా వసరమైన సమయంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు తన్వీర్ హుస్సేన్, బానోత్ సైదులు సూచించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డులో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ శంకర కంటి హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా కంటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. చిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షల ద్వారా తీవ్రమైన అనారోగ్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ ఉచిత శిబిరంలో 220 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 42 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రంగరి కాళిదాసు తెలిపారు. గుర్తించిన వారిని సోమవారం ఉదయం హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయిస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ ఉ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు మండది రమాదేవి, డాక్టర్లు నుమాన్, అనిల్ తో పాటు బత్తుల దామోదర్ రెడ్డి, నరాల తిరుమలరెడ్డి, షేక్ నజీర్ పాషా, గడ్డం వీరబాబు, క్యాంపు ఇంచార్జి నాయిని స్టాలిన్, రమేష్, అక్షయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ ఆశయాలు ఆదివాసీ యువతకు మార్గదర్శకం

## కొమురం భీమ్ విగ్రహావిష్కరణ చేసిన పొదెం వీరయ్య



చర్ల, ఆగస్టు 09:(వుదయం ప్రతినిధి) ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చర్ల మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని భద్రాచలం మాజీ శాసనసభ్యులు, ఏఐసీసీ సభ్యులు, పొదెం వీరయ్య ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ ఆదివాసీ సమాజం యొక్క నిష్కల్మషమైన మనస్తత్వం, స్వచ్ఛమైన సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయత, మంచితనం దేశానికి ఎంతో గొప్ప ఆదర్శమని అన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని చర్ల మండలంలోని ఆదివాసీ ప్రజలు డోలు చప్పుళ్లు , సంప్రదాయ నృత్యాలతో పొదెం వీరయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమురం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆదివాసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులను పొదెం వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు. కొమురం భీమ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి ఆదివాసీ యువతకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నారగుట్ట క్రషర్ అనుమతి రద్దు కోసం ఎమ్మెల్యేకు వినతిపత్రం



యాదాద్రి భువనగిరి ఆగస్టు 9:(వుదయం ప్రతినిధి)భువనగిరి మండలం నారగుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న క్రషర్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ తుక్కాపురం, గౌస్ నగర్, ఎర్రంబెల్లి, నమాత్ పల్లి గ్రామాల ప్రజలు మరియు గ్రామాల నాయకులు జేపీస్ -(జీఆర్‌జ) ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిగారికి ఆదివారం ఉదయంక్యాంప్ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా కన్వీనర్ పుట్ట వీరేష్ యాదవ్ కో కన్వీనర్ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, నారగుట్టపై క్రషర్ ఏర్పాటుకు అనుమతి ఇస్తే భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ కాలుష్యం, దుమ్ము మరియు శబ్ద కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయ భూములకు నష్టం కలగడంతో పాటు పశువులకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నారగుట్టపై క్రషర్‌కు ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారిని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి గారు సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు ఎల్లంల జంగయ్య యాదవ్ జేపీస్ కో కన్వీనర్ లు ఎల్లంల వెంకటేష్ యాదవ్ జనగాం సత్యయ్య పెట్టెటి కొండల్ రెడ్డి పాక జహంగీర్ గుండెబోయిన దానయ్య గడ్డల నరేష్ యాదవ్, నల్లమాస రవి గౌడ్,మరి సోమిరెడ్డి, రత్నపురం శ్రీను,ముంతా సతీష్ యాదవ, రాసాల వెంకటేష్ యాదవ్ కాసాని వెంకటేష్,వల్లపు లింగస్వామి యాదవ్,వడమటి జంగారెడ్డి, రత్నపురం సురేందర్,సిరికొండ శ్రీకాంత్ ,గొర్ల శ్రీను,పాశం ప్రసాద్ వల్లపు పర్వతాలు జక్కుల సత్తయ్య గజ్జ పరమేష్ యాదవ్,నల్లమాస సాయిరాం గౌడ్, గడగొట్ల వెంకటేష్, పిట్టల కిరణ్, రాచకొండ ప్రకాష్, ఏదునూరి సాయికుమార్, గడసందుల వర్దన్, వల్లపు నిఖిల్, వల్లపు మని, గుంటి చింటూ, రసాల శివ, రాసాల మని, గుండెబోయిన సంపత్, గోపగాని ప్రశాంత్, కల్లెం దావీద్, కల్లెం ఏసు, తదితరులు పాల్గొన్నారు.

# కొమురం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

## కేశవాపురంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



చర్ల, ఆగస్టు 9: ( వుదయం ప్రతినిధి)ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేశవాపురం గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాపుల శారద అధ్యక్షతన కొమురం భీమ్ విగ్రహానికి నివాళులర్పించి, జెండా ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపుల శారద మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ అని కొనియాడారు. "జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. ఆదివాసీ సమాజం కోసం ఆయన చేసిన సేవలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కొమురం భీమ్ ఆశయాలను ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, తమ హక్కులపై అవగాహన పెంచుకుని సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాపుల శారద, కూనారపు సతీష్, కాపుల నాగరాజు కోరం నాగేంద్ర , తాటి పాపారావు, హిమగిరి బాబు, వెంకటేశ్వరరావు,వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, సూరిబాబు, రామారావు , , కృష్ణ, సుబ్బారావు, శ్రీను,రాధ, సోడి వెంకటరమణ గ్రామ ప్రజలు, ఆదివాసీ నాయకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొని కొమురం భీమ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# త్యాగాల స్ఫూర్తితో దేశ సమైక్యతకు కృషి చేయాలి

## రుద్రంపూర్ వజ్రాల గుట్టపై ఘనంగా క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి )క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకొని చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్ వద్ద ఉన్న వజ్రాల గుట్టపై శనివారం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు, ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా "క్విట్ ఇండియా" ఉద్యమానికి పిలుపునిస్తూ 'చేయి లేదా చావు' అనే నినాదాన్ని దేశ ప్రజలకు అందించారని నాయకులు గుర్తు చేశారు. ఆగస్టు 9 నుంచి ఉద్యమం దేశవ్యాప్తంగా ఉధృతమైందని, వేలాది మంది ప్రజలు, కార్మికులు, యువత, మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు శిక్షలు, లాఠీ దెబ్బలు, అనేక కష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలక మలుపుగా నిలిచిందని పేర్కొంటూ మహాత్మా గాంధీతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాట స్ఫూర్తితో దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రజాక్ ఆధ్వర్యంలో 26 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లోని వజ్రాల గుట్టపై 2022 ఆగస్టులో ఎం.డి. రజాక్ ఆధ్వర్యంలో 26 అడుగుల ఎత్తైన జాతీయ జెండాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 9న జెండాను ఆవిష్కరించి క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తితో పాటు సర్వతోముఖ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు అన్నారు. భవిష్యత్ తరాలకు స్వాతంత్ర్య పోరాట చరిత్ర, దేశభక్తి, జాతీయ సమైక్యత విలువలను తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జాతీయ జెండా దేశ ఐక్యతకు ప్రతీకమూడు రంగుల జాతీయ జెండా భారతదేశ అస్తిత్వం, ఐక్యమత్యం, ఆశలు, ఆశయాలకు ప్రతీకగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. జెండాలోని కాషాయ రంగు త్యాగం, ఆత్మస్థైర్యాన్ని; తెలుపు రంగు శాంతి, స్వచ్ఛత, నిజాయితీని; ఆకుపచ్చ రంగు ప్రకృతి, పాడిపంటలు, సంపదను ప్రతిబింబిస్తాయని వివరించారు. మధ్యలోని అశోక ధర్మచక్రం ధర్మం, న్యాయం, చలనశీలతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. 'విజయీ విశ్వ తిరంగా ప్యారా.. జండా ఊంచా రహే హమారా' అంటూ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేయడం మాత్రమే కాకుండా, జాతీయ జెండా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతతో పాటు కార్మికుల ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, గౌతమ్, జునైద్, ఆర్ నాగభూషణం, బారుగుల హనుమంతరావు, బోస్, విశాల్, సాగర్, దోటి దినేష్, దిలీప్, పృథ్వి, హరీష్, ఫాతిమా, సఫూరా, ప్రవీణ్, శివ, నిశాల్‌తో పాటు మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేజ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి

## సోమవారం జీఎం కార్యాలయం వద్ద ధర్నా -- ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ పిలుపు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 09 (వుదయం ప్రతినిధి)సింగరేణి కార్మికుల వేతన సవరణకు సంబంధించిన 12వ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం (ఆగస్టు 10) కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం వద్ద జేసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 12వ వేజ్ బోర్డు ఏర్పాటులో అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ సింగరేణి వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనలో భాగంగా ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలకు జీఎం కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ సెంట్రల్, బ్రాంచ్, పిట్ కార్యదర్శులు, ఐక్యూర్లు, కమిటీ సభ్యులు, సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, సెంట్రల్ కమిటీ సభ్యులు, బ్రాంచ్ కమిటీ సభ్యులు, పిట్ కార్యదర్శులు, కోశాధికారులు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇతర కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎండీ రజాక్ కోరారు. 12వ వేజ్ బోర్డు ఏర్పాటు కోసం కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

# వానల వేళ... అందం జాగ్రత్త!

## చక్కని ఆరోగ్యం



వాన చినుకులు పడటం ఆలస్యం... అప్పటిదాకా వేడి కారణంగా కలిగిన చిరాకంతా పోతుంది. అందుకే చూస్తూ, హాయిగా వాటిలో తడుస్తూ ఆనందిస్తాం. కానీ జాగ్రత్త! ఎండలే కాదు... వర్షాల వేళా చర్మం, కురులకు కలిగే హాని తక్కువేం కాదు.ఈకాలం వాతావరణంలోని తేమ జిడ్డుని పెంచుతుంది. అంతేనా, చర్మరంధ్రాలు మూసుకుపోయి యాక్నే రావడానికి కారణమవుతుంది. కాబట్టి, స్కిన్ కేర్ తప్పనిసరి. రెండు పూటలా ముఖాన్ని తప్పక శుభ్రం చేసుకోవాలి. అయితే మీ చర్మానికి తగ్గ జెంటిల్ క్లెన్సర్‌ని వాడాలి. వాతావరణం తేమగా ఉంది కదా... మాయిశ్చరైజర్ అవసరం లేదు అనుకోవద్దు. తేలికపాటి, నాన్ కమడోజెనిక్ క్రీములు రాయాలి.

చల్లగా ఉన్నా యూవీ కిరణాల ప్రభావం ఉంటుంది. అందుకని కనీసం 30 ఎస్పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌ని రొటీన్‌లో భాగం చేసుకోవాలి. మృత కణాలు చర్మరంధ్రాల్ని మూసుకుపోయేలా చేస్తాయి. కాబట్టి, వారానికో సారి స్క్రబ్ చేయడం తప్పనిసరి చేసుకోండి. వానలో తడిస్తే వీలైనంత త్వరగా దుస్తులు మార్చుకోవడం, తడిలేకుండా చూసుకోవాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్ల బారిన పడే ప్రమాదముంది. చల్లదనానికి బద్ధకంగా అనిపిస్తుంది కానీ... తలస్నానాన్ని అశ్రద్ధ చేయొద్దు. వారానికి కనీసం రెండుసార్లు మైల్డ్ షాంపూతో తప్పక చేయాలి. కండిషనర్ కూడా వాడితే మేలు.

తడిగా ఉన్నప్పుడు బిగుతుగా జడ వేయొద్దు. పూర్తిగా ఆరాకే వేసుకోవాలి. లేదంటే చుండ్రు, ఇన్‌ఫెక్షన్లకు దారితీసి కురులు రాలే ప్రమాదముంది. తలస్నానానికి కనీసం అరగంట ముందైనా గోరువెచ్చని కొబ్బరి లేదా బాదం నూనెతో తలకి మసాజ్ చేస్తే మేలు. అయితే ఈ కాలం రాత్రంతా నూనె మాత్రం పెట్టి ఉంచకూడదు.

తడి తలతో పడుకోవద్దు. తువాలు, దువ్వెనలను పంచుకోవద్దు... ఇన్‌ఫెక్షన్లకు దారితీయొచ్చు. అలాగే, ఈ కాలం విటమిన్ సి ఎక్కువగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లను తీసుకోవాలి. నీళ్లూ తగినంతగా తాగాలి. ఇవి ఆరోగ్యానికే కాదు... చర్మానికీ మేలు చేస్తాయి. గుడ్డు, చేప, పప్పుదినుసులు, నట్స్, సీడ్స్ వంటివీ చేర్చుకోండి. వీటిల్లోని ప్రొటీన్, ఐరన్, బయోటిన్, జింక్ కురులకు మేలు చేస్తాయి.

# క్యారెట్ జ్యూస్ ఎందుకంటే...

రోజూ క్యారెట్ తింటే ఆరోగ్యానికి... అందులోని ఎ-విటమిన్ కళ్లకు మంచిదన్నది తెలిసిందే. అయితే మహిళలకీ ముఖ్యంగా గర్భిణులకి క్యారెట్ జ్యూస్ ఎంతో మేలు చేస్తుంది అంటున్నారు పోషకాహార నిపుణులు. ఇందులోని ఫోలేట్ గర్భస్థ శిశువులో నాడీ సంబంధిత లోపాలు తలెత్తకుండా చేస్తుంది. అలాగే కాల్షియం, ఇతర ఖనిజాలు శిశువు ఎముకల పెరుగుదలకి తోడ్పడతాయి. తల్లి పాలల్లో అన్ని రకాల పోషకాలు ఉండేందుకూ తద్వారా శిశువులో రోగనిరోధకశక్తిని పెంచేందుకూ తోడ్పడుతుంది. కాబట్టి గర్భం దాల్చడానికి ముందు నుంచే రోజూ తగు మోతాదులో క్యారెట్ జ్యూస్‌ను తీసుకోవడం లేదా వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవడం మేలు అంటున్నారు. అలాగే ఇందులోని సి-విటమిన్ కొలాజన్ ఉత్పత్తిని పెంచి తద్వారా చర్మం సాగే గుణానికి తోడ్పడుతుంది. బీటా కెరోటిన్, ఇతర యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాలను అతినీలలోహిత కిరణాలనుంచి కాపాడతాయి. దాంతో చర్మం ఆరోగ్యంగా మెరుస్తుంది. గర్భిణులకే కాదు, రక్తంలో చక్కెర శాతం నియంత్రించేందుకూ క్యాన్సర్ కణాలతో పోరాడేందుకూ క్యారెట్‌లోని పోషకాలు తోడ్పడతాయి. అయితే దీన్ని ఉదయాన్నే తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఎందుకంటే కాలేయంలోని టాక్సిన్లను తొలగిస్తుంది. అలాగని మరీ ఎక్కువ అవసరం లేదు. వారానికి మూడు నాలుగు రోజులపాటు 120 మి.లీ. నుంచి 150 మి.లీ. వరకూ తీసుకోవచ్చు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వైద్యుల సలహాతో తీసుకోండి.



# దంతాల ఆరోగ్యానికి బ్రషింగ్ చేయడమే కాదు, వీటికి కూడా దూరంగా ఉండాలి

దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కేవలం రోజూ బ్రష్ చేయడం మాత్రమే కాదు, తీసుకునే ఆహారం, పానీయాల విషయంలో కూడా జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మనకు ఆరోగ్యకరంగా అనిపించే కొన్ని పానీయాలు కూడా దంతాల ఎనామెల్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల దంతాలను బలంగా, ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను డైట్‌లో చేర్చుకోవడం ఎంతో ముఖ్యం. బ్రిటిష్ డెంటల్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం నిమ్మరసం కలిపిన తీపి టీ లేదా ఫ్లేవర్డ్ వాటర్‌ను తరచూ తాగడం వల్ల దంతాల ఎనామెల్ క్రమంగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే వెనిగర్, ఊరగాయలు, అధిక ఆమ్లత్వం ఉన్న మందులను తరచూ తీసుకోవడం కూడా దంతాలను అరిగిపోవడానికి కారణాలుగా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే జీర్ణాశయంలో అధిక ఆమ్లం ఏర్పడే సమస్యలు, కొన్ని ఆహార సంబంధిత రుగ్మతలు కూడా దంతాల ఎనామెల్‌ను దెబ్బతీసే అవకాశం ఉంటుందని అధ్యయనం తెలిపింది. స్పోర్ట్స్ డ్రింక్స్, శీతల పానీయాలు వంటి అధిక ఆమ్లత్వం కలిగిన పానీయాలను తరచూ తీసుకోవడం కూడా దంతాలు అరిగిపోవడానికి కారణమవుతుంది. కెనడియన్ డెంటల్ అసోసియేషన్ ప్రకారం పాలు, మజ్జిగ, తాజా పండ్లు, పచ్చి కూరగాయలు, ప్లెయిన్ పెరుగు, చీజ్, కాటేజ్ చీజ్, గుడ్లు, నట్స్, విత్తనాలు వంటి ఆహారాలు దంతాలను బలంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. యాపిల్ దంతాల ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో ఒకటి. ఇందులో నీరు, పీచు అధికంగా ఉండటం వల్ల సహజ శుభ్రపరిచే గుణం ఉంటుంది. అలాగే ఇందులో ఉండే మాలిక్ యాసిడ్ లాలాజల ఉత్పత్తిని పెంచి, నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించడంలో సహాయపడుతుంది. పచ్చి క్యారెట్ నమలడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీనివల్ల లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. లాలాజలం నోటిలోని ఆమ్లాలను తటస్థీకరించి, దంతాల ఎనామెల్‌ను రక్షించడంలో సహాయపడుతుంది.

స్ట్రాబెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. వీటిలోని పాలీఫినాల్స్ బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుని, నోటి పరిశుభ్రతను మెరుగుపరచడంలో తోడ్పడతాయి. దీంతో దంతాల ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది. పాలకూరలో మెగ్నీషియం అధికంగా ఉంటుంది. ఇది దంతాల ఎనామెల్‌ను బలంగా ఉంచడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులోని ఐరన్ దంతాలను మెరిసేలా ఉంచడంతోపాటు ఎనామెల్ అరిగిపోకుండా రక్షించడంలో కూడా ఉపయోగపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



# బరువు తగ్గించే మసాలా దినుసులు..

బరువు తగ్గాలనుకునేవారు ఆహార నియమాలు, వ్యాయామం, సరైన నిద్ర వంటి అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. అయితే రోజువారీ వంటల్లో ఉపయోగించే కొన్ని మూలికలు, సుగంధ ద్రవ్యాలు కూడా శరీర జీవక్రియకు తోడ్పడతాయి. ముఖ్యంగా కొన్ని మసాలా దినుసులు ఆహారానికి రుచిని పెంచడమే కాకుండా, బరువు నియంత్రణకు ఉపయోగపడే లక్షణాలను కలిగి ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రతి ఒక్కరి శరీర జీవక్రియ ఒకేలా ఉండదని, వీటి ప్రభావం వ్యక్తికి వ్యక్తికి మారుతుందని గుర్తుంచుకోవాలి. పసుపు అందరి వంటిళ్లలోనూ సాధారణంగా కనిపించే సుగంధ ద్రవ్యం. ఇది శరీరంలో వేడిని పెంచడం ద్వారా జీవక్రియను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారు సూప్‌లు, తాజా కూరగాయలు, నట్స్ వంటి వాటిపై కొద్దిగా పసుపు చల్లుకుని తీసుకోవచ్చు. దాల్చిన చెక్క కూడా బరువు నియంత్రణకు ఉపయోగపడే మసాలా దినుసుల్లో ఒకటి. ఇది తీపి పదార్థాలపై కోరికలను తగ్గించడంలో, ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో సహాయపడుతుంది. ఓట్స్, పాలు, పెరుగు, టీ లేదా కాటేజ్ చీజ్ వంటి వాటిలో కొద్దిగా దాల్చిన చెక్క పొడి కలుపుకోవచ్చు. కారం ఎక్కువగా ఉండే కేయెన్ పెప్పర్ శరీర జీవక్రియను పెంచే మసాలాగా పనిచేస్తుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను పెంచడం ద్వారా జీవక్రియను ప్రేరేపిస్తుంది. అయితే దీన్ని అధికంగా తీసుకోకుండా పరిమితంగా ఉపయోగించడం మంచిది. జీలకర్ర కూడా బరువు తగ్గడానికి అనుకూలమైన మసాలాగా ఉంటుంది. ఆహారంలో ఒక టీస్పూన్ జీలకర్రను ఉపయోగించడం వల్ల కొవ్వు దహనం పెరుగుతుంది. జీలకర్రను నేరుగా వంటల్లో ఉపయోగించడంతోపాటు, వేయించి పొడి చేసుకుని కూడా తీసుకోవచ్చు. జీలకర్ర నీటిని కూడా బరువు తగ్గడానికి ఉపయోగించే పానీయంగా తీసుకోవచ్చు. అల్లంలో కూడా పసుపు, కేయెన్ పెప్పర్ మాదిరిగా జీవక్రియను ప్రోత్సహించే లక్షణాలు ఉన్నాయి. ముఖ్యంగా చక్కెర, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా అల్లం సహాయపడుతుంది. వంటల్లో కొద్దిగా తురిమిన అల్లం కలుపుకోవడం ద్వారా రుచితోపాటు జీవక్రియకు కూడా తోడ్పాటు లభిస్తుంది. మిరియాలు కూడా బరువు నియంత్రణకు ఉపయోగపడే మసాలాల్లో ఒకటిగా ఉన్నాయి. శరీరంలో కొత్త కొవ్వు కణాలు ఏర్పడకుండా నిరోధించడంలో ఇవి సహాయపడతాయి. అందువల్ల వివిధ రకాల ఆహారాల్లో మిరియాలను పరిమితంగా ఉపయోగించవచ్చు. యాలకులు కూడా శరీర ఉష్ణోగ్రతను, జీవక్రియను పెంచే థర్మోజెనిక్ మసాలాగా పనిచేస్తాయి. భారతీయ వంటకాల్లో విస్తృతంగా ఉపయోగించే యాలకులను బిర్యానీ, ఖీర్ వంటి వంటకాల్లో రుచి, సువాసన కోసం ఉపయోగిస్తారు. మెంతులు కూడా ఆరోగ్యానికి ఉపయోగపడే ముఖ్యమైన మసాలా దినుసుల్లో ఒకటిగా ఉన్నాయి. ఇవి జీర్ణవ్యవస్థను శాంతపరచడంతోపాటు, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాల నుంచి జీర్ణవ్యవస్థను రక్షించడంలో సహాయపడతాయి. మెంతులను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం వడకట్టి ఖాళీ కడుపుతో తాగడం వల్ల జీవక్రియకు, బరువు తగ్గే ప్రక్రియకు తోడ్పడుతాయి. అయితే బరువు తగ్గడంలో ఒక్క మసాలా దినుసుపైనే ఆధారపడటం సరైన పద్ధతి కాదు. ప్రతి వ్యక్తి శరీర జీవక్రియ భిన్నంగా ఉంటుంది కాబట్టి, ఈ మసాలాల ప్రభావం కూడా ఒక్కొక్కరిపై ఒక్కో విధంగా ఉంటుంది. బరువు తగ్గేందుకు వీటిని ఉపయోగించే ముందు పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.



# గోర్లలో ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త.. నిర్లక్ష్యం చేయకండి..

గోర్లు మన శరీర ఆరోగ్యానికి అద్దంలా పని చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గోర్ల రంగు, ఆకారం లేదా వాటి ఉపరితలంలో కనిపించే మార్పులు కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. గోర్లలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా గమనిస్తే కొన్ని వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే గోళ్లలో మార్పులు కనిపించాయంటే తప్పనిసరిగా తీవ్రమైన వ్యాధే ఉందని అర్థం కాదు. కానీ అవి ఎక్కువకాలం కొనసాగితే వైద్యులను సంప్రదించడం మంచిది. గోర్లు శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం చాలా ముఖ్యం. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించడం, శుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. అదే సమయంలో గోర్లలో కనిపించే చిన్నచిన్న మార్పులు కూడా శరీరంలోని అంతర్గత ఆరోగ్య పరిస్థితిని సూచించే అవకాశం ఉంటుంది. గోర్లు పాలిపోయినట్లు లేదా తెల్లగా కనిపిస్తే అది రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపం లేదా కాలేయానికి సంబంధించిన సమస్యలకు సంకేతంగా ఉంటుంది. ఈ లక్షణం ఎక్కువకాలం కొనసాగితే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది.




గోర్లు ఎక్కువ భాగం తెల్లగా ఉండి, అంచులు మాత్రం ముదురు రంగులో కనిపిస్తే అది కొన్ని కాలేయ వ్యాధులతో సంబంధం కలిగి ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గోర్లు పసుపు రంగులోకి మారడం వెనుక అత్యంత సాధారణ కారణం ఫంగల్ ఇన్‌ఫెక్షన్. ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగే కొద్దీ గోరు మందంగా మారడం, గోరు అడుగు భాగం విడిపోవడం, గోరు పెళుసుగా మారి ముక్కలుగా విరిగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అరుదైన సందర్భాల్లో పసుపు రంగు గోర్లు థైరాయిడ్ సమస్యలు లేదా ఊపిరితిత్తుల వ్యాధులకు కూడా సంకేతంగా ఉంటాయి. గోర్లకు నీలిరంగు ఛాయ కనిపిస్తే శరీరానికి తగినంత ఆక్సిజన్ అందడం లేదనే సూచన అని భావించాలి. ఇలాంటి లక్షణాలు ఊపిరితిత్తులు లేదా గుండెకు సంబంధించిన సమస్యలతో ముడిపడి ఉండే అవకాశం ఉంటుంది. గోర్ల ఉపరితలంపై అలల మాదిరిగా గీతలు లేదా ఎత్తుపల్లాలు కనిపిస్తే అది సోరియాసిస్ ప్రారంభ లక్షణంగా ఉంటుంది. కొన్నిసార్లు ఇది ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్‌కు కూడా సంకేతం అవుతుంది. ఇలాంటి గోర్లు రంగు మారడంతోపాటు వాటి కింద చర్మం ఎర్రని-గోధుమ రంగులో కనిపించే అవకాశం ఉంటుంది. గోర్లు పగిలిపోవడం లేదా చీలిపోవడం, ముఖ్యంగా పసుపు రంగుతో కలిసి కనిపిస్తే దాన్ని కూడా ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌లకు సంకేతంగా భావిస్తారు. కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ వ్యాధులు కూడా దీనికి కారణం అవుతాయి. గోర్ల చుట్టూ ఉన్న చర్మం వాపులకు గురైనట్లు, ఎర్రగా కనిపిస్తే అది నెయిల్ ఫోల్డ్‌లో ఇన్‌ఫ్లమేషన్ కారణంగా ఉంటుంది. కొన్ని రకాల కనెక్టివ్ టిష్యూ సంబంధిత వ్యాధులు కూడా ఈ లక్షణానికి కారణమయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గోర్లలో ఇలాంటి మార్పులు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా గమనించడం ముఖ్యం.

# ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు పాటించాల్సిన డైట్ ఇదే..

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటి. జీర్ణవ్యవస్థ నుంచి వచ్చే రక్తాన్ని శుద్ధి చేయడం, శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, మందులను జీర్ణక్రియకు అనుకూలంగా మార్చడం, పిత్తరసాన్ని ఉత్పత్తి చేయడం వంటి అనేక కీలక విధులను నిర్వహిస్తుంది. ప్రోటీన్ల తయారీ, రక్తం గడ్డకట్టడం, కొలెస్ట్రాల్ నియంత్రణ, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడం, ఇన్ఫెక్షన్లతో పోరాడటం వంటి పనుల్లోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కాలేయంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే ఫ్యాటీ లివర్ సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. ఫ్యాటీ లివర్‌లో ప్రధానంగా రెండు రకాలున్నాయి. ఒకటి ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ కాగా, మరొకటి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్. కాలేయం తన సాధారణ విధులను సక్రమంగా నిర్వహించలేని స్థాయిలో కొవ్వు పేరుకుపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. సాధారణంగా మనం తీసుకునే కార్బొహైడ్రేట్లు, కొవ్వులు శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువగా ఉన్నప్పుడు వాటిలో కొంత భాగం కొవ్వుగా నిల్వ అవుతుంది. కొంతకాలానికి ఈ అదనపు కొవ్వు కాలేయంలోనూ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ పేరుకుపోతుంది. కాలేయ బరువులో 5 నుంచి 10 శాతానికి పైగా కొవ్వు ఉంటే దాన్ని ఫ్యాటీ లివర్‌గా పరిగణిస్తారు. ఫ్యాటీ లివర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా పరిస్థితిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు ప్రత్యేకమైన లక్షణాలు తప్పనిసరిగా కనిపించవు. కొందరిలో అలసట, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో కాలేయం పరిమాణం పెరిగినట్లు కూడా గుర్తిస్తారు. కాలేయంలో పేరుకుపోయిన కొవ్వు వాపులకు దారితీస్తే అలసట, గందరగోళం, పొత్తికడుపు నొప్పి, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, శారీరక బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన పరిస్థితుల్లో పొత్తికడుపు ఉబ్బడం, కామెర్లు రావడం, సులభంగా రక్తస్రావం కావడం వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఊబకాయం, మధుమేహం ఫ్యాటీ లివర్‌కు ముఖ్యమైన కారణాల్లో భాగంగా ఉన్నాయిజ. వీటితో పాటు కొవ్వు, చక్కెర అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, అధికంగా మద్యం సేవించడం, జన్యుపరమైన కారణాలు, వేగంగా బరువు తగ్గడం, కొన్ని మందుల దుష్ప్రభావాలు, రక్తంలో కొవ్వు స్థాయిలు అధికంగా ఉండటం వంటి కారణాలు కూడా ఫ్యాటీ లివర్‌కు దారితీస్తాయి.

ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడంలో ఆహారపు అలవాట్లకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా ప్రాసెస్డ్ ఫుడ్స్, చక్కెర అధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం ఉపయోగకరంగా ఉంటుంది. మైదా, తెల్ల చక్కెర వినియోగాన్ని తగ్గించడంతోపాటు మద్యం తీసుకోవడం పూర్తిగా మానేయడం లేదా గణనీయంగా తగ్గించడం కూడా ముఖ్యం. తాజా పండ్లు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందడంతోపాటు అదనపు కొవ్వును తగ్గించుకోవడంలో సహాయపడతాయి. తీసుకునే కేలరీలను నియంత్రించడం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి, తీసుకునే ఆహారం మధ్య సమతుల్యతను పాటించవచ్చు. తాజా పండ్లు, కూరగాయలు, ఆలివ్ ఆయిల్, చేపలు ఎక్కువగా ఉండే మెడిటరేనియన్ ఆహార విధానం కూడా ఫ్యాటీ లివర్ ఉన్నవారికి ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ కొవ్వుతో కూడిన ఆహారం, శారీరక వ్యాయామంతో కలిపి తీసుకోవడం కూడా ఫ్యాటీ లివర్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి.



వెల్లుల్లి ఫ్యాటీ లివర్ ఉన్నవారి ఆహారంలో చేర్చుకోదగిన పదార్థాల్లో ఒకటిగా చెప్పవచ్చు. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ ఉన్నవారిలో శరీర బరువు, కొవ్వు తగ్గే అవకాశం ఉందని ఒక అధ్యయనం సూచించింది. కాఫీలో ఉండే కొన్ని సమ్మేళనాలు నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ నుంచి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అందువల్ల ఫ్యాటీ లివర్ ఉన్నవారి ఆహార ప్రణాళికలో కాఫీని కూడా చేర్చుకోవచ్చు. బ్రోకలీ కూడా కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా సహాయపడే కూరగాయగా ఉంది. దీర్ఘకాలం పాటు బ్రోకలీని తీసుకోవడం వల్ల ఎలుకల్లో కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం తగ్గినట్లు ఒక అధ్యయనంలో గుర్తించారు. బ్రోకలీతో పాటు పాలకూర, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి క్రూసిఫెరస్ కూరగాయలు కూడా కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గ్రీన్ టీ కూడా ఫ్యాటీ లివర్ ఆహారంలో చేర్చుకోదగిన పానీయం. ఇందులో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలోని కొవ్వు శాతం, రక్తంలో కొవ్వు స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది.

సోయా లేదా వెయ్ ప్రోటీన్ కూడా కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా సహాయపడతాయి. ముఖ్యంగా టోఫులో కొవ్వు తక్కువగా, ప్రొటీన్ ఎక్కువగా ఉండటం వల్ల ఇది ఫ్యాటీ లివర్ ఉన్నవారికి అనుకూలమైన ఆహారం. వాల్‌నట్స్‌లో ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ ఉన్నవారు వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల కాలేయ పనితీరుకు సంబంధించిన పరీక్షల్లో మెరుగుదల కనిపిస్తుంది. సన్‌ఫ్లవర్ సీడ్స్‌లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తూ కాలేయాన్ని మరింత నష్టం నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. అందువల్ల వీటిని కూడా ఆహారంలో పరిమితంగా చేర్చుకోవచ్చు. ఆలివ్ ఆయిల్‌లో ఉండే ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు కాలేయ ఎంజైమ్‌ల స్థాయిలను తగ్గించడంలో, బరువును నియంత్రించడంలో సహాయపడతాయి. అందువల్ల ఫ్యాటీ లివర్ ఉన్నవారు ఆరోగ్యకరమైన కొవ్వుల వనరుగా ఆలివ్ ఆయిల్‌ను పరిమితంగా ఉపయోగించవచ్చు. అదే సమయంలో ఫ్యాటీ లివర్ ఉన్నవారు మద్యం, అదనపు చక్కెర, రెడ్ మీట్, అధిక ఉప్పు, వేయించిన పదార్థాలు, వైట్ బ్రెడ్, తెల్ల బియ్యం, పాస్తా వంటి ఆహారాలను తగ్గించడం లేదా నివారించడం మంచిది. అయితే ఫ్యాటీ లివర్ పరిస్థితి ఒక్కొక్కరిలో ఒక్కో విధంగా ఉంటుంది. కాబట్టి సరైన చికిత్స, ఆహార ప్రణాళిక కోసం వైద్య నిపుణుల సలహా తీసుకోవడం అవసరం.

## ఆడి నుంచి 3 కొత్త కార్లు




జర్మనీకి చెందిన విలాస కార్ల తయారీ సంస్థ ఆడి, వచ్చే మూడేళ్లలో మన దేశంలో మార్కెట్ వాటాను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పండుగ సీజన్ నుంచి కొత్త క్యూ3 ఎస్‌యూవీ, వచ్చే ఏడాది చివర్లో క్యూ9 మోడళ్లను ఆవిష్కరించనున్నట్లు ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ వెల్లడించారు. 2027 ద్వితీయార్ధం నాటికి ఏ5 కారునూ విడుదల చేస్తామని ధిల్లాన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో చిన్న నగరాలకు నెట్‌వర్క్ విస్తరిస్తూ, బ్రాండ్‌తో వినియోగదార్ల ప్రయాణాన్ని మరింత మెరుగుపరుస్తామన్నారు.




# ఏఐతో ఉద్యోగాల మిగులు




కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఫలితంగా భారత్‌లోనూ కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పోతున్నాయి. ఇదే సమయంలో కోల్పోయిన ఉద్యోగాలకు మించి నూతన నియామకాలు చోటు చేసుకుంటున్నాయి' అని జపాన్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ నొమురా వెల్లడించింది. ఈ సంస్థ రూపొందించిన 'ఏషియా ఎకనామిక్ మంత్లీ' మనదేశంలో

ఏఐ ఆధారిత నియామకాలు 83,100

లేఆఫ్‌లు, వలసల వల్ల పోయిన ఉద్యోగాలు 31,921

నికరంగా ఏఐ వల్ల లభించిన ఉద్యోగాలు 51,000.

లేఆఫ్‌లు, నియామకాలు ఇక్కడే ఎక్కువ

అధిక జనాభాకు తోడు అంతర్జాతీయ బ్యాక్‌ఆఫీస్ కేంద్రంగా భారత్‌కున్న స్థానం వల్ల, ఏఐకి కీలక మార్కెట్‌గా మారుతోందని నివేదిక వివరించింది. అందువల్లే ఆసియా దేశాల్లో ఏఐ సంబంధిత 1.31 లక్షల ఉద్యోగాల సృష్టి జరగ్గా, అందులో 83,100 వరకు భారత్‌లోనే సంభవించాయి. అత్యధికంగా ఏఐ ఆధారిత లేఆఫ్‌లు (31,921) కూడా భారత్‌లోనే ఉన్నాయి.

ఏఐ వల్ల ప్రారంభ స్థాయి ఉద్యోగులకు గిరాకీ తగ్గుతున్నా, సీనియర్ సిబ్బందికి డిమాండ్ అధికమవుతోంది. భారత ఐటీ రంగంలోని 651 సంస్థలను ఐసీఆర్ఈఆర్ సర్వే చేయగా, ప్రారంభ స్థాయి నియామకాలు 55% తగ్గితే, మధ్య స్థాయిలో 25%, సీనియర్ లెవెల్‌లో 14% చొప్పునే తగ్గాయి. అంటే కంపెనీలు తమ సాధారణ లావాలు, కస్టమర్ సర్వీస్ క్వాలిటీ అస్యూరెన్స్ టెస్టింగ్ కోడింగ్ వంటి జూనియర్ స్థాయి టెక్నికల్ ఉద్యోగాలు. (జూనియర్ ఉద్యోగులు చేసే) పనిని ఆటోమేట్ చేయడం పెరిగింది. 2021-22లో భారత ఐటీ కంపెనీల నికర నియామకాలు 6 లక్షలు ఉండగా, 2025-26లో 1.4 లక్షలకు పరిమితమయ్యాయని నివేదిక పేర్కొంది.

ఏఐ ఇంకా ప్రారంభ స్థాయిలోనే ఉందని, కార్మిక మార్కెట్‌పై అది చూపే ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇంకా కొన్నేళ్లు పడుతుందని నొమురా అంటోంది. ప్రస్తుతానికి ఏఐ వల్ల నికరంగా నియామకాలే కనిపిస్తున్నాయని వివరించింది.

బ్యాంకింగ్ బ్యాక్‌ఆఫీస్ కార్యక

## మీ ఈపీఎఫ్ ఖాతాల మెర్జ్ వల్ల లాభాలు ఇవే..




ఉద్యోగ జీవితంలో ఒక చోటు నుంచి మరో కంపెనీకి మారడం సహజం. యూఏఎన్ ఒకటే ఉన్నా.. యాజ మాన్యం మారినప్పుడల్లా కొత్త ఈపీఎఫ్ ఖాతా జనరేట్ అవుతుంది. అయితే, చాలా మంది ఈ ఖాతాలను విలీనం చేయకుండా అలానే విడిచిపెట్టేస్తుంటారు. ఉద్యోగం మారినప్పుడు పాత పీఎఫ్ అకౌంట్‌లోని సొమ్మును కొత్త అకౌంట్‌కు మార్చడం చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల మీ రిటైర్మెంట్ పొదుపు అంతా ఒకేచోట సురక్షితంగా ఉంటుంది. విత్‌డ్రా చేసుకునేటప్పుడు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

సర్వీసు హిస్టరీ: పీఎఫ్ నిబంధనల ప్రకారం ఉద్యోగం మారినా సర్వీస్ కంటిన్యూటీ (5 ఏళ్లు) ఉండేలా చూసుకోవాలి. పాత బ్యాలెన్స్‌ను కొత్త అకౌంట్‌కు బదిలీ చేయడం వల్ల మీ సర్వీస్ హిస్టరీ కంటిన్యూ అవుతుంది. 5 ఏళ్ల సర్వీస్ పూర్తి కాకముందే పీఎఫ్ డ్రా చేస్తే మూలం వద్ద పన్ను కోత పడుతుంది. విలీనం వల్ల ట్యాక్స్ మినహాయింపు లభిస్తుంది.

సెటిల్‌మెంట్లు సులువు: రిటైర్మెంట్ సమయంలో లేదా అత్యవసర పరిస్థితుల్లో పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేయాలంటే నిధులు ఒకచోట ఉంటే తీసుకోవడం సులువు. వివిధ అకౌంట్ల నుంచి విత్‌డ్రా చేయాల్సిన అవసరం తప్పుతుంది.

ఈపీఎఫ్ఓ మెంబర్ సేవా పోర్టల్ ఓపెన్ చేసి యూఏఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. అందులో వన్ మెంబర్– వన్ ఈపీఎఫ్ అకౌంట్ ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ మీ వ్యక్తిగత వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిని ధ్రువీకరించుకోవాలి. మీ పాత ఖాతాలన్నీ ఒకే చోట చేర్చేందుకు యూఏఎన్ ఐడీ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఆపై మీ మొబైల్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే వెరిఫికేషన్‌కు వెళుతుంది. మీ నుంచి వెళ్లిన రిక్వెస్ట్ ప్రస్తుత ఎంప్లాయర్ ఆమోదించాల్సి ఉంటుంది. అక్కడ ఆమోదం పొందాక ఈపీఎఫ్ఓ మీ రిక్వెస్ట్‌ను ప్రాసెస్ చేస్తుంది. ఒకసారి ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక పాత ఖాతాల్లో ఉన్న నగదు కూడా ఒకే ఖాతాలో దర్శనమిస్తుంది.

## ఫోన్‌పేలో ఫిక్స్‌డ్ డిపాజిట్, ఆర్‌డీ సేవలు





డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే, ఫిక్స్‌డ్ డిపాజిట్ పంపిణీ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల భాగస్వామ్యంతో తమ యాప్‌లోనే ఫిక్స్‌డ్ డిపాజిట్లను పోల్చిచూసి.. సులభంగా డిపాజిట్ చేసుకునే ఎఫ్‌డీ మార్కెట్‌ప్లేస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో కలిసి డైలీ రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) సేవలను ప్రారంభించింది.

ఎఫ్‌డీ మార్కెట్‌ప్లేస్: ఫోన్‌పే యాప్‌లోని మ్యూచువల్ ఫండ్స్, డిపాజిట్‌లో వినియోగదారులు ఎటువంటి పేపర్‌వర్క్ లేకుండా 100% డిజిటల్ విధానంలో ఎఫ్‌డీలను బుక్ చేసుకోవచ్చు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం.. రూ.5 లక్షల వరకు డిపాజిట్‌పై బీమా లభిస్తుంది.

డైలీ రికరింగ్ డిపాజిట్: వినియోగదారులు రోజుకు రూ.100 నుంచి రూ.1000 వరకు తమకు నచ్చిన మొత్తాన్ని పొదుపు చేయొచ్చు. యూపీఐ ఆటోపే సదుపాయం ద్వారా, ఆటోమేటిక్‌గా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు ఆర్‌డీలోకి జమ అవుతుంది. పెట్టుబడి పెట్టిన 7 రోజుల తర్వాత వినియోగదారులు తమ సొమ్మును ఎప్పుడైనా వెనక్కి తీసుకోగలరు లేదా యూపీఐ ఆటోపే మ్యాండేట్‌ను నిలిపివేయొచ్చు.

# ఔషధ ఎగుమతులకు సుంకాల సెగ



దేశీయ ఔషధ పరిశ్రమ నిర్దేశించుకున్న వృద్ధి లక్ష్యాలకు, అంతర్జాతీయ అనిశ్చితులు అడ్డుగా నిలుస్తున్నాయి. అమెరికా సుంకాల (టారిఫ్)పై నెలకొన్న సందిగ్ధత, పశ్చిమాసియాలో రవాణా అంతరాయాలు మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2030 నాటికి 130 బిలియన్ డాలర్ల (రూ.12.35 లక్షల కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని అందుకోవాలన్న భారత ఫార్మా రంగం కలలు నెరవేరేలా కనిపించడం లేదు. అప్పటికి భారత ఫార్మా పరిశ్రమ విలువ 80-90 బిలియన్ డాలర్ల (రూ.7.60 - 8.55 లక్షల కోట్ల)కు మాత్రమే పరిమితం కావొచ్చని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెగ్జిల్) ఛైర్మన్ నమిత్ జోషి ఒక వార్తా సంస్థతో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం దేశీయ ఫార్మా రంగం విలువ రూ.5.70 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో ఎగుమతుల వాటా రూ.2.95 లక్షల కోట్లు.

అమెరికాకు అతిపెద్ద జనరిక్ మందుల సరఫరాదారుగా మనదేశం ఉంది. అక్కడ వినియోగించే ప్రతి రెండు జనరిక్ ప్రిస్క్రిప్షన్లలో ఒకటి భారత్ నుంచి వెళ్లే మందులేనని చెబుతారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నూతన సుంకాల విధానం భారత ఫార్మా కంపెనీలకు పెద్ద సవాలుగా మారనుంది. అమెరికా బయట తయారయ్యే జనరిక్స్‌పైనా 2028 ఆగస్టు 1 నుంచి 100%, ఆ తర్వాత ఏడాది నుంచి 200% ఈ సుంకాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. ఇంతటి భారాన్ని తట్టుకునే సామర్థ్యం భారత ఫార్మా కంపెనీలకు లేదని జోషి విశ్లేషించారు. అమెరికాలో తయారీ కేంద్రాన్ని నిర్మించి, సరఫరా పునరుద్ధరించేందుకు కనీసం అయిదేళ్ల సమయం పడుతుందని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల సరకు రవాణా నౌకల వ్యయాలు, ప్రయాణ సమయం భారీగా పెరిగాయి. ఈ ప్రభావం అమెరికాకు జరిగే ఎగుమతులపై పడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత ఫార్మా ఎగుమతులు రూ.92,150 కోట్ల (9.7 బి.డాలర్ల)కు పడిపోయాయి. 2024-25లో ఇవి రూ.99,750 కోట్లు (10.5 బి.డాలర్లు) కావడం గమనార్హం. అయితే బ్రెజిల్, ఐరోపా దేశాల నుంచి గిరాకీ లభించడంతో, మన మొత్తం ఫార్మా ఎగుమతులు 2.13% వృద్ధిని నమోదు చేయగలిగాయని నమిత్ జోషి వివరించారు.

రాబోయే మూడేళ్లలో ఫార్మా పరిశ్రమ వార్షిక వృద్ధి రేటు 6-10% మధ్య కొనసాగొచ్చని ఫార్మెగ్జిల్ అంచనా వేస్తోంది. ఆ తర్వాత బయోసిమిలర్స్, పెప్టైడ్స్ వంటి అధిక విలువ కలిగిన ఉత్పత్తుల జోరు పెరిగితే, వృద్ధి రేటు రెండంకెల స్థాయికి చేరుకుంటుందని భావిస్తోంది.




### తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ నెగ్గిన యువ షట్లర్



భారత యువ షట్లర్ అస్మిత చాలిహా అద్భుత ప్రదర్శన చేసింది. తన కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. కొరియా మాస్టర్స్ 300 టోర్నీ ఫైనల్‌లో 14-21, 21-14, 21-14 తేడాతో చైనా క్రీడాకారిణి హాన్‌ను చిత్తు చేసింది. అస్మిత తొలి గేమ్‌ను కోల్పోయినప్పటికీ మిగతా రెండు గేముల్లో అదరగొట్టింది. కేవలం గంటలోపే విజయం సాధించి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

## అప్పుడు నాలుగు మ్యాచుల నిషేధం తప్పించి..
## యశస్విని కాపాడిన రహానే!




దేశవాళీలో అజింక్య రహానే ముంబయి జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అలాగే దులీప్ ట్రోఫీలో వెస్ట్ జోన్ సారథి కూడా అతడే. నాలుగేళ్ల కిందట భారత యువ ఆటగాడు యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడకుండా అజింక్య రహానే తీసుకున్న నిర్ణయమే కాపాడింది. రహానే సమయస్ఫూర్తితో వ్యవహరించి జైస్వాల్‌ను రక్షించాడు. అప్పుడు జరిగిన ఓ ఘటనను తాజాగా రహానే వెల్లడించాడు.

దులీప్ ట్రోఫీ 2022 ఫైనల్‌లో సౌత్ జోన్ – వెస్ట్ జోన్ తలపడ్డాయి. అప్పుడు వెస్ట్ జోన్‌కు రహానే కెప్టెన్‌గా ఉన్నాడు. కుర్రాడు యశస్వి జైస్వాల్ సత్తా చాటుతున్న రోజులవి. అయితే, క్రమశిక్షణ తప్పడంతో నాలుగు మ్యాచుల నిషేధం విధించేందుకు అంపైర్లు సిద్ధమయ్యారు. కానీ, రహానే తీసుకున్న నిర్ణయంతో యశస్వి బయటపడ్డాడు. సౌత్ జోన్ బ్యాటర్ రవితేజను పదేపదే స్లెడ్జ్ చేస్తూ యశస్వి రెచ్చగొడుతూ వచ్చాడు. అది మరీ ఎక్కువై.. ఇద్దరు ప్లేయర్లూ మాటామాటా అనుకొన్నారు. దీంతో రహానే వద్దకు అంపైర్లు వచ్చి మాట్లాడారు. వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు జైస్వాల్‌ను మైదానం వీడాలని సూచించాడు. అప్పటికీ జైస్వాల్ స్లెడ్జింగ్ చేస్తూనే ఉండటం గమనార్హం. చివరికి కెప్టెన్ చెప్పడంతో అయిష్టంగానే జైస్వాల్ డగౌట్‌కు వెళ్లాడు. "గేమ్‌లో స్లెడ్జింగ్ అనేది సర్వసాధారణమే. ఒక్కోసారి ఆటకు ఫన్ తీసుకొస్తుంది. కానీ, అది శ్రుతి మించకూడదు. ఇలాగే వదిలేస్తే పరిస్థితి చేజారిపోతుందని అనిపించింది. బయటకు పంపించినందుకు యశస్వి కూడా బాధపడ్డాడు. కానీ, ముందు జరగబోయే పరిణామాలు ఎలా ఉంటాయో నాకు తెలుసు. కొందరు ఆటగాళ్లు నిషేధం ఎదుర్కొన్నారు. సమయం ఎలా మారిపోతుందో అంచనా వేయలేం. అవకాశం చేజారితే అందుకోవడం చాలా కష్టం. అందుకే అలా వ్యవహరించా. కెప్టెన్‌గా సహచరుడిని ఆపాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆ మ్యాచ్ రిఫరీ వెంగలిల్ నారాయణన్ నేను చేసిన పనిని ఊహించలేకపోయారు. అప్పటికే నాలుగు మ్యాచులు నిషేధం విధించేందుకు సిద్ధమైపోయారు. లెటర్‌ను కూడా సిద్ధం చేశారు. మ్యాచ్ తర్వాత 'ఇదిగో బ్యాన్ లెటర్. కానీ, నువ్వు చేసిన దానికి ఇక్కడే చించేస్తున్నా' అని నారాయణన్ అన్నారు. అలాగే ఆ లెటర్‌ను నా ముందే ముక్కలు చేసేశారు. చివరికి జైస్వాల్‌మీద నిషేధం పడలేదు. ఇప్పుడు అతడు భారత జట్టులో సూపర్ ప్లేయర్. ఒకవేళ అతడిపై నిషేధం పడి ఉంటే పరిస్థితులు ఎలా ఉండేవో అంచనా వేయలేం" అని రహానే గుర్తు చేసుకున్నాడు.

## వైభవ్‌కు నిజంగానే 15 ఏళ్లేనా? అనుమానాలపై బ్రెట్‌లీ ఆసక్తికర కామెంట్స్



ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ (Cricketer Viabhav Sooryavanshi) హాట్ టాపిక్. కేవలం 15 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. ఈ క్రమంలో ఆసీస్ మాజీ స్టార్ పేసర్ బ్రెట్ లీ వైభవ్ టాలెంట్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. సూర్యవంశీ వయసుపైనా బయట చాలా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించాడు. కానీ, అతడి నైపుణ్యం, ఫామ్‌ను చూస్తుంటే ముచ్చటేస్తోందని తెలిపాడు.

'వైభవ్ సూర్యవంశీ ఓ అద్భుతం. విదేశాల్లో చాలా మంది వైభవ్ వయసు గురించి ప్రశ్నిస్తూ ఉంటారు. అతడికి నిజంగానే 15 ఏళ్లేనా? ఎందుకంటే చూసేందుకు 17 లేదా 18 ఏళ్ల కుర్రాడిలా కనిపిస్తాడనేది వారి అభిప్రాయం. కానీ, నేనెప్పుడూ అతడి వయసు గురించి ఆలోచించలేదు. కేవలం బ్యాటింగ్ సత్తానే చూస్తా. అతడి ఏజ్ ఎంతైతే ఏంటి? కుర్రాడు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నాడు. భారత్‌కు దొరికిన మంచి ఆటగాడు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆశిస్తున్నా. ఐపీఎల్‌లోనే అతడి నైపుణ్యం ఏంటో చూశాం. సన్‌రైజర్స్‌పై 97 పరుగుల ఇన్నింగ్స్ సూపర్. ఆసీస్‌కు చెందిన స్టార్ బౌలర్లపైనా విరుచుకుపడ్డాడు. క్రికెటింగ్ షాట్లకు పవర్‌హిట్టింగ్ తోడైతే ఎలా ఉంటుందో అలా ఉంది. అయితే, అతడు ఇంకా చిన్న పిల్లాడే. లేనిపోని ఒత్తిడిని దరిచేరనీయొద్దు. హుక్ లేదా పుల్లర్ షాట్లను కొట్టే ఆటగాళ్లంటే నాకు ఇష్టం. వారికి బౌలింగ్ చేసేందుకు ఇష్టపడతా. పోటీ బాగుంటుంది. ఒక బంతికి సిక్స్ కొట్టినా నిరుత్సాహపడను. మళ్లీ అదే బాల్ వేసేందుకు ప్రయత్నిస్తా" అని బ్రెట్‌లీ స్పష్టం చేశాడు. "క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్ ఎవరంటే మాత్రం సచిన్ తెందుల్కర్ అని ఎప్పుడో చెప్పా. కానీ, బెస్ట్ క్రికెటర్ మాత్రం దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ జాక్వెలిస్ కలిస్ అని చెబుతా. అతడి గణాంకాలే ఆ మాట చెబుతాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించాడు. ఎంతటి క్లిష్టపరిస్థితులైనా కలిస్ చాలా ప్రశాంతంగా ఉంటాడు'' అని బ్రెట్ లీ తెలిపాడు.

## టెన్నిస్ ప్లేయర్ ఆర్యానా సబలెంకాకు షాక్

మహిళా టెన్నిస్ నంబర్ వన్ ప్లేయర్ ఆర్యానా సబలెంకాకు టొరంటో మాస్టర్స్‌లో షాక్ తగిలింది. నాలుగో రౌండ్‌లోనే ఆమె ఇంటిముఖం పట్టింది. ఆమెతోపాటు మరో స్టార్ జెస్సికా పెగులా కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరికొద్ది రోజుల్లో యూఎస్ ఓపెన్ ప్రారంభం కానుంది. ఇలాంటి సమయంలో సబలెంకాకు చుక్కెదురైంది. రష్యాకు చెందిన 16వ సీడ్ ఎకటెరినా అలెక్జాండ్రోవా 7-6 (7/3), 4-6, 6-4 తేడాతో సబలెంకాపై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్విటోలినాతో ఎకటెరినా తలపడనుంది. రష్యాకు చెందిన 15వ సీడ్ ష్నైడర్ చేతిలో వరల్డ్ నంబర్ 3 ప్లేయర్ జెస్సికా పెగులా ఓడిపోయింది. కేవలం 73 నిమిషాల్లోనే పెగులాను 23 ఏళ్ల ష్నైడర్ ఓడించడం గమనార్హం. ష్నైడర్ 6-2, 6-4 తేడాతో వరుస సెట్లలో పెగులాపై విజయం సాధించింది. ఇక క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ ప్లేయర్ ఇగా స్వైటెక్‌తో ష్నైడర్ తలపడనుంది.



## రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన శ్రీలంక ఎలెవన్..




భారత్‌తో జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 200/6 వద్ద డిక్లేర్ చేసింది. ఈ క్రమంలో భారత్‌కు 207 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నిషాన్ ఫెర్నాండో (63; 73 బంతుల్లో 10 ఫోర్లు), నిపుణ్ ధనంజయ (46; 56 బంతుల్లో), అంజల బండార (35) రాణించారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 2, రవీంద్ర జడేజా 2, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 స్కోరుకు డిక్లేర్ చేయగా.. టీమ్‌ఇండియా 357/6 వద్ద డిక్లేర్ చేసింది. ఈ మ్యాచ్‌లో ఇదే ఆఖరి రోజు కాగా.. ఇంకా 45 ఓవర్లు మిగిలి ఉన్నాయి. భారత బ్యాటర్లు లక్ష్యాన్ని ఛేదించడానికి ప్రయత్నిస్తారా? లేక డిఫెన్స్ ఆడతారా చూడాలి మరి.

# 'వారణాసి' నుంచి రెండు స్పెషల్ స్టిల్స్‌ను విడుదల



వుదయం సినిమా: సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వారణాసి' చిత్రం నుండి రెండు ప్రత్యేక స్టిల్స్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ స్టిల్స్‌తో రుద్ర తన నేచురల్ లుక్‌లో ప్రపంచానికి తొలిసారిగా కనిపించాడు. మొదటి స్టిల్‌లో దట్టమైన అడవి మధ్యలో ఒక వెదురు తెప్పపై విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా రుద్ర కనిపిస్తున్నాడు. ఇక ఆ స్టిల్‌ను చూస్తే పాలసంద్రంలో ఆదిశేషుపై సేదతీరే శ్రీ మహా విష్ణువులా కనిపిస్తున్నారు. ఇంకో స్టిల్‌లో కెన్యాలోని మసాయి మారా విశాలమైన మైదానాలకు చెందింది. అక్కడ రుద్ర జిరాఫీలు, వైల్డ్‌బీస్ట్‌ల మధ్య నిలబడి, వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ఈ రెండు స్టిల్స్‌ను గమనిస్తే 'వారణాసి' సినిమాలోని సోల్, రుద్ర పాత్ర తీరు గురించి అందరికీ అర్థమయ్యేలా ఉంది. శతాబ్దాలను దాటి ప్రపంచాన్ని చుట్టివచ్చే ఓ వ్యక్తి ప్రయాణంగా సాగే ఇతిహాసం ఇది. ఇందులో ఒక వ్యక్తి అసాధారణ ప్రయాణం అతడిని భారతదేశంలోని పవిత్ర జలాల నుండి భూమి మారుమూల ప్రాంతాలకు తీసుకువెళుతుంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ మేరకు పోస్ట్ వేస్తూ.. 'రుద్ర తనకంటే ఎంతో గొప్పదైన, పెద్దదైన ఒక ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి జన్మించాడు. అతను కోరుకోని విధిని మోస్తున్నాడు. అతను చమత్కారి, సున్నితమైనవాడు, ఉగ్రరూపం దాల్చగలడు. మహేష్ అతనికి తీసుకువచ్చింది అదే. ఉగ్రంగా కనిపించే పాత్రను ఎవరైనా పోషించగలరు. కానీ ఒకేసారి ఉగ్రంగా, సున్నితంగా నటించగలవారు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ ఫ్రేమ్‌లు మా ఆఫ్రికా షెడ్యూల్ నుండి తీసుకోబడ్డాయి. ఏ సెట్ ఇవ్వలేని అనుభూతిని ఆ నేల మాకు ఇచ్చింది. కిలిమంజారో చుట్టూ మసాయి మారాలో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను నివ్వెరపోయాను. కొన్ని ఉదయాన్నే, మా కళ్ల ముందు ఉన్నదాన్ని 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్ కూడా ఇమడ్చలేదని నాకు అనిపించింది' అని అన్నారు. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో, ఎం.ఎం. కీరవాణి సంగీతంతో రూపొందుతున్న 'వారణాసి' చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ నిర్మిస్తోంది. ఈ చిత్రం ఏప్రిల్ 7, 2027న ప్రపంచవ్యాప్తంగా ఐమాక్స్‌లో విడుదల కానుంది.

వుదయం సినిమా

# 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్




వుదయం సినిమా: ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' ట్రైలర్ విడుదలైంది. రాకింగ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ ట్రైలర్.. అధికారం, ప్రేమ, ద్రోహం, ప్రతీకారం చుట్టూ తిరిగే ఓ భారీ గ్యాంగ్‌స్టర్ ప్రపంచాన్ని పరిచయం చేసింది. అదిరిపోయే యాక్షన్ సీక్వెన్సులు, అబ్బురపరిచే విజువల్స్, బలమైన క్యారెక్టర్లతో 'టాక్సిక్' ఒక భారీ యాక్షన్ మాగ్నమ్ ఓపస్‌గా కనిపిస్తోంది. ఈ కథలో రాయా, అత కుమారుడు మధ్య ఉండే సంక్లిష్టమైన సంబంధం ప్రధాన భావోద గంగా కనిపిస్తోంది. తండ్రి, కొడుకుల మధ్యే సంఘర్షణకు దారితీ పరిస్థితులు ఆసక్తిని పెంచుతున్నాయి.

# "ది మేజ్" చిత్రంతో దర్శకుడిగా ప్రతిభ చాటనున్న డా. రవికిరణ్ గడలాయ్



వుదయం సినిమా: డాక్టర్ కాబోయి యాక్టర్ కావడం చూస్తుంటాం కానీ డా. రవికిరణ్ గడలాయ్ ఎం.డి, పాథాలజిస్ట్ డాక్టర్‌గా తన వృత్తిలో కీర్తి ప్రతిష్టలు గడించి ఇప్పుడు దర్శకుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. శ్రీరామ్ (శ్రీకాంత్) హీరోగా సైకలాజికల్ థ్రిల్లర్ కథతో "ది మేజ్" చిత్రాన్ని తన తొలి ప్రయత్నంగా తెరకెక్కిస్తున్నారు. రవికిరణ్ గడలాయ్ గతంలో "ది రాంగ్ స్వైప్" అనే షార్ట్ ఫిలింను తన ఫోన్‌తో తెరకెక్కించారు. ఈ లఘుచిత్రం రూపొందించే క్రమంలో కథ చెప్పే విధానం, కెమెరా, నటన, సన్నివేశ నిర్మాణం, ఎడిటింగ్ వంటి అంశాలపై అవగాహన తెచ్చుకున్నారు. ఈ రోజు పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా డైరెక్టర్ డా.రవికిరణ్ గడలాయ్ పాత్రికేయులతో ముచ్చటించారు. డా. రవికిరణ్ గడలాయ్ మాట్లాడుతూ – నేను ఎక్కడా అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేయలేదు. ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ అయ్యే ముందు ఇండస్ట్రీలో నా అనుభవం కూడా చాలా తక్కువే. కానీ చిన్నప్పటి నుంచే ఒక సినిమా తీయాలనే కల ఉండేది. ఎన్నో సినిమాలు చూస్తూ, వాటిని విశ్లేషిస్తూ, నా మొబైల్‌తోనే ప్రాక్టీస్ చేస్తూ సినిమా భాషను నేర్చుకున్నాను. ఎడిటింగ్‌పై ఉన్న అవగాహన వల్ల ప్రతి సన్నివేశాన్ని ముందుగానే ఊహించుకోగలిగాను. అదే దర్శకత్వాన్ని నాకు మరింత సులభం చేసింది. ఫిలింమేకింగ్ లో దర్శకులు అకిరా కురోసావా, సెల్వరాఘవన్, సందీప్ రెడ్డి వంగా నాకు స్ఫూర్తినిస్తుంటారు. ఇప్పుడు "ది మేజ్" చిత్రంతో దర్శకుడిగా తొలి ప్రయత్నం చేస్తున్నా. మీ అందరి సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నా. అన్నారు. "ది మేజ్" మూవీలో ప్రియాంక, ప్రీతిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# 'కపాలి' నుంచి హన్సిక మోత్వాని ఫస్ట్ లుక్



వుదయం సినిమా: హీరో రోహిత్ నారా ప్రస్తుతం పోలీస్ నేపథ్యంలో సాగే సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'కపాలి'లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రామ్ గన్ని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సప్త అశ్వ మీడియా వర్క్స్ బ్యానర్‌పై కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మించగా, విజయ్ కృష్ణ లింగమనేని సమర్పిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన టైటిల్, ఫస్ట్-లుక్ పోస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా హన్సిక మోత్వానీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ లుక్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంటెన్స్ లుక్‌లో హన్సిక కనిపిస్తున్న ఈ పోస్టర్.. 'కపాలి' కథలో ఆమె పాత్రకు ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. ఆమె చుట్టూ ఉన్న మిస్టీరియస్ ఎలిమెంట్స్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈ చిత్రంలోని మిగతా నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

# ఫ్రెండ్లీ ఘోస్ట్ టీజర్




వుదయం సినిమా: ఫోనిక్స్ పిక్చర్స్ బ్యానర్‌పై, మాస్టర్ జియాన్స్ సమర్పణలో సత్యం రాజేష్, రియా సచ్‌దేవ్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న "ఫ్రెండ్లీ ఘోస్ట్" ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఇటీవల హీరో మంచు మనోజ్ విడుదల చేశారు. సస్పెన్స్‌తో పాటు వినోదానికి ప్రాధాన్యమిస్తూ దర్శకుడు జి. మధుసూదన్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తాజాగా ఫ్రెండ్లీ ఘోస్ట్ టీజర్ ను చిత్ర యూనిట్ లహరి మ్యూజిక్ ద్వారా విడుదల చేసింది, సోషల్ మీడియాలో టీజర్కు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. "మంచి కాన్సెప్ట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'ఫ్రెండ్లీ ఘోస్ట్' త్వరలో థియేటర్లలో రానుంది. నిర్మాత విశ్వనాథ్.డి.కె , దర్శకుడు జి. మధుసూదన్ రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.

# 'అమీర్ లోగ్' నుంచి సాంగ్

వుదయం సినిమా: పక్కా లోకల్, హైదరబాద్ గల్లీని, బస్తీని తెరపై చూపించేందుకు 'అమీర్ లోగ్' చిత్రం రాబోతోంది. 'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో MC హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయి యోగీ కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది.



# "సుధీర్స్ జోకర్" నుంచి యాక్టర్ మురళీశర్మ బర్త్ డే పోస్టర్ రిలీజ్



వుదయం సినిమా: సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "సుధీర్స్ జోకర్". బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అందరి ప్రశంసలు అందుకున్న పరదా లాంటి విభిన్నమైన చిత్రం తర్వాత ఆనంద మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ శ్రీనివాసులు పి.వి., విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. వెర్సటైల్ యాక్టర్ మురళీశర్మ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ "సుధీర్స్ జోకర్" సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో మురళీశర్మ డిటెక్టివ్ జీవన్ పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న మురళీశర్మకు ఈ డిటెక్టివ్ జీవన్ పాత్ర మరో

# "మిషన్ పాజిబుల్" ఫస్ట్ లుక్ పోస్టర్

వుదయం సినిమా: నటుడు, దర్శకుడు నవీన్ హిదయత్ రూపొందించిన తమిళ సూపర్ హిట్ డార్క్ కామెడీ యాక్షన్ ఎంటర్ టైనర్ "మూదర్ కూడమ్". 2013లో రిలీజైన ఈ సినిమాకు సీక్వెల్ గా మూదర్ కూడమ్ 2 రూపొందుతోంది. ఈ సినిమా "మిషన్ పాజిబుల్" పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నవీన్ హిదయత్, ఒవియా, సెన్రయాన్, రాజాజీ, కుబేరన్, జయప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నవీన్ హిదయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గ్రాండెల్ పిక్చర్స్ బ్యానర్ పై సంకిత్ బోరా, కమల్ బోరా నిర్మిస్తున్నారు. ఈ రోజు మేకర్స్ "మిషన్ పాజిబుల్" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఓ నగరంలో డైనోసార్స్ భీభత్సం సృష్టిస్తుండటం, వాటిని తరిమేందుకు ఆర్మీ హెలికాప్టర్స్ రంగంలోకి దిగడం,

ఫా అవుతు మూవీలోని ప్రధాన పాత్రధారు పరుగెత్తడాన్ని చూపిసు ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశా ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఓ భారీ హాలీ యాక్షన్ ఎంటర్ టైనర్ ను తలపిస్తోంది ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే "మిషన్ పాజిబుల్" మూవీ సినీ ప్రియుల్లో ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. నటీనటులు – నవీన్ హిదయత్, ఒవియా, సెన్రయాన్, రాజాజీ, కుబేరన్, జయప్రకాష్, తదితరులు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.